2-04Pg1exHMNWJQE.qxd:2-04Pg1exHMNWJQE.qxd 01/01/01 9:21 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 60 పేజీలు: 12 వెల: 6.50

నెలాఖరుకల్లా బిజెపి జాతీయ అధ్యక్షుని ఎన్నిక
ధోలాఘాట్‌లో సిలిండర్ పేలి ఏడుగురి మృతి
9లో

## మూడు నెలలు ఎండమంటలే



### వడగాడ్పులు అధికంగా వీచే అవకాశం

### అనంతపురం, వైఎస్సార్ మినహా మిగిలిన జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత వేసవిలో ఏప్రిల్-జూన్ మధ్య ఎండలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) అంచనా వేస్తోంది. మధ్య, తూర్పు ప్రాంతాల్లో, వాయవ్య రాష్ట్రాల్లో ఎక్కువరోజులు వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఎక్కువ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి నమోదవుతాయని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పలుచోట్ల సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని ఐఎండీ అధిపతి మృత్యుంజయ్ మహాపాత్ర ఆన్‌లైన్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. రాబోయే మూడు నెలలపాటు అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు నుంచి నాలుగు రోజులు ఎక్కువగా వడగాలులు వీస్తాయన్నారు.
మామూలుగానైతే ఈ మూడు నెలల్లో నాలుగు నుంచి ఏడురోజుల వరకు వడగాలులు నమోదవుతుంటాయని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువగా వడగాలుల రోజులు కొనసాగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఏప్రిల్‌లో దేశంలో చాలా ప్రాంతాల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వివరించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎపిలో అనంతపురం, వైఎస్సార్ మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ వడగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని సీజనల్ అవుట్‌లుక్‌లో ఐఎండి ప్రకటించింది. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో 10 మండలాలు, విజయనగరంలో 6, శ్రీకాకుళంలో 6, అల్లూరి సీతారామరాజులో 3, తూర్పుగోదావరిలో ఒక మండలంలో వడగాలులు వీచాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి కూర్మనాథ్ తెలిపారు. సోమవారం నంద్యాల జిల్లా >>2

# నెలాఖరులోగా మెగా డిఎస్సీ

### స్కూళ్లు తెరిచే నాటికి నియామకాలు పూర్తి

### పేదరికం నిర్మూలనకే పి-4

### అనవసర విమర్శలు చేసే వారిని ప్రజలు నిలదీయాలి

### బాపట్ల ప్రజావేదిక సభలో సిఎం చంద్రబాబు



బహిరంగసభలో పాల్గొన్న ప్రజలు,అభిమానులు,నాయకులు




మంగళవారం బాపట్ల ప్రజావేదికలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**బాపట్ల,ఎప్రిల్01,ప్రభాతవార్త:** సంపద సృష్టించగా వచ్చిన ఆదాయాన్ని పేద ప్రజలకు ఖర్చు చేస్తామని, పేదరికం నిర్మూలనకే పి4 విధానానికి శ్రీకారం చుట్టామని, ప్రజలే ముందు ఆ తర్వాతే మిగిలిన వాటికి ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలో పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదిక సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బటన్లు నొక్కామని కొందరు గొప్పగా చెప్పుకుంటున్నారని వారు నొక్కినబటన్లు మనమిచ్చేపెన్షన్లతో సమానమనిఅన్నారు. అనవసర విమర్శలు చేసే >>2

## తిరుపతి రైల్వేస్టేషన్ సుందరీకరణ పూర్తి

### రూ. 300 కోట్లతో అభివృద్ధి పనులు

**తిరుపతి(రవాణ),ఏప్రిల్ 1ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందడంతో ఇక్కడకు నిత్యం వస్తున్న యాత్రికులు, ప్రయాణీకుల సౌలభ్యం కోసం 300 కోట్ల రూపాయలతో తొలిదశ ఆధునీకరణ, సుందరీకరణ పనులు పూర్తికావస్తున్నాయి. రైల్వేస్టేషన్‌లో మొదటి దశలో 3 అంతస్థులు,రెండవ దశలో మొత్తం 10 అంతస్తులు నిర్మాణం జరుగుతుంది. ఈ ప్రాజెక్టులో ప్రయాణీకుల సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ 20 లిఫ్టులు,22 ఎస్కలేటర్లు ఏర్పాటు చేయబోతున్నారు. మంగళవారం మధ్యాహ్నం తిరుపతిలోని ఆధునీకరణ, సుందరీకరణ పనుల్లో భాగంగా తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ పరిశీలించారు. త్వరలోనే ఈ స్టేషన్‌ను ప్రయాణీకుల సేవలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. తిరుమల శ్రీవారి పాదాలచెంత, స్వామి దర్శనానికి వచ్చే వేలాదిమంది ప్రయాణీ టకుల సౌకర్యాలు కల్పించేందుకు ఆధునీకరణ రూపుదిద్దుకుంటోంద >>2

# నెరవేరుతున్న పేదల కల

### ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీ అమలు చేస్తున్న మంత్రి నారా లోకేష్

### మొదటిదశలో మూడు వేల పట్టాల పంపిణీకి రంగం సిద్ధం

### మంగళగిరిలో 'మన ఇల్లు మన లోకేష్' పేరుతో ఏప్రిల్ మూడు నుండి పట్టాల పంపిణి



**మంగళగిరి(గుంటూరుజిల్లా), ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** లోకేష్ హామీ ఇస్తే నెరవేరినట్టే.. మంగళగిరి పేద ప్రజల కల నెరవేరబోతోంది. ఎంతో మంది నాయకులు హామీ ఇచ్చారు కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేస్తూ నారా లోకేష్ అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలు అందజేసి మంగళగిరి పేద ప్రజల దశాబ్దాలకల నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 91,413 ఓట్ల భారీ మెజారిటీతో మంగళగిరి ప్రజలు నారా లోకేష్‌ను గెలిపించారు. గెలిచిన మొదటి రోజు నుండే నారా లోకేష్ ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే దశగా కార్యాచరణ మొదలుపెట్టారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యల పరిష్కారం కోసం పట్టుదలతో పనిచేస్తున్నారు. ఎన్నికల ముందు లోకేష్ఇచ్చిన హామీల్లో ప్రధానమైంది ఇళ్ల పట్టాల సమస్య. ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నారు. వారంతా తాము నివసిస్తున్న భూమిని, రెక్కల కష్టంతో నిర్మించుకున్న గూడుని క్రమబద్ధీకరించాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఎంతోమంది నాయకులు వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో లబ్ది పొందినా ఆ హామీ అమలుకు కనీస కృషి చేసింది లేదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది మంగళగిరి శాసనసభ్యుడిగా లోకేష్ పేదల పట్ల తనకుఉన్న చిత్తశుద్ధిని కార్యాచరణలో పెట్టారు. గత పది నెలల్లో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రజల వివరాల సేకరణ దగ్గర నుండి వివిధ శాఖలతో సమన్వయం, పేద ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులే ఇళ్లకు వెళ్లి దరఖాస్తులు నింపడం వరకూ అన్నీ దశలను నారా లోకేష్ స్వయంగా పర్యవేక్షించారు. అత్యంత క్లిష్టమైన అటవీ భూములు, రైల్వే భూముల సమస్యను కూడా పట్టుదలగా తీసుకోని పరిష్కారం వైపు అడుగులు వేస్తున్నారు. మొదటి దశలో 3 వేల ఇళ్ల పట్టాల పంపిణికి రంగం సిద్ధం చేసారు.
నారా లోకేష్. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారి భూమిని, వారునిర్మించుకున్న ఇంటిని క్రమబద్దీకరిస్తూ శాశ్వత హక్కు కల్పిస్తూ ఇంటి పట్టాలు అందజేయనున్నారు.
నారా లోకేష్. పట్టాల పంపి ణితో పేదలకు భరోసా లభించనుంది. ఏప్రిల్ 3న మొదటి పట్టాను ఉండవల్లి గ్రామంలో అందజేయ నున్నారు. నారా లోకేష్ స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందజేసి మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 4తేదీ నుండి మంగళగిరి డాన్ బాస్కో స్కూల్‌ను అనుకోని ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటుచేస్తున్న వేదికపై లబ్ధిదారులకు నారా లోకేష్ ఇల్ల పట్టాలు అందజేయనున్నారు. ఏప్రిల్ 4 న యర్రబాలెం, నీరుకొండ, కాజా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నారా లోకేష్ ఇల్ల పట్టాలు అందజేయనున్నారు. ఏప్రిల్ 7న పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం, కొలనుకొండ, పద్మశాలి బజార్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు, ఏప్రిల్ 8న రత్నాల చెరువు, మహానాడు2కు చెందిన లబ్దిదారులకు పట్టాలు అందజేస్తారు, ఏప్రిల్ 11న సీతానగరం, సలాం సెంటర్, డ్రైవర్స్ కాలనీకు చెందిన లబ్ధిదారులకు, ఏప్రిల్ 12 న మహానాడు1, ఉండవల్లి సెంటర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు లోకేష్ పట్టాలు అందజేయనున్నారు.
మొత్తంగా మూడువేలకు పైగా పట్టాల పంపిణి కి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్యనాయకులు, నారా లోకేష్ భారీ విజయానికి కృషి చేసిన ఆయా గ్రామాల, వార్డుల ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.



## లక్షకు చేరువలో పసిడి

### ఇప్పటికే దాటేసిన వెండి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. రోజురోజుకూ బులియన్ మార్కెట్‌లో బంగారంధరలు రికార్డులు నమోదుచేస్తున్నాయి. రాజధాని ఢిల్లీలో తాజాగా 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.94,150కి చేరింది. దేశీయంగా పసిడిధరలు ఈస్థాయికి రావడం ఇదే తొలిసారి. అంతకుముందు వారాంతంలో 99.9 స్వచ్ఛత కలిగిన బంగారంధరలు రూ.92,150వద్ద ఉంటే మరో రెండువేలు తాజాగాపెరిగింది. ఈక్విటీతో పోలిస్తేప్రత్యామ్నాయంగా పెట్టుబడులకు బంగారం భావిస్తుండటంతో అంతర్జాతీయంగా డిమాండ్‌పెరిగింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ బంగారంధర సుమారు 18శాతంపెరిగింది.
జనవరి ఒకటిన రూ.79,390గా ఉన్న పసిడి సుమారు రూ.15 వేలు పెరిగింది.
అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్‌గోల్డ్ >>2

## వాట్సప్‌లో ఇంటర్ ఫలితాలు

**విజయవాడ ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 12-15 మధ్య విడుదల చేసేందుకు అధికారులు చర్యలుచేపట్టారు. ఏప్రిల్ 6 నాటికి మూల్యాంకనం పూర్తవుతుంది. ఆతర్వాత కంప్యూటరీకరణ వర్క్ ఉంటుంది. దీనికి ఐదారురోజులు సమయం పడుతుంది. ఈసారి వాట్సప్‌లోనే ఫలితాలు విడుదల చేయనున్నారు. ఇందుకోసం ఒక్కోవిద్యార్థి మార్కులను పిడిఎఫ్ రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఇవే షార్ట్ మెమోలుగా ఉపయోగ పడనున్నాయి. గతంలో ఫలితాలు ఇచ్చి, ఆ తర్వాత షార్ట్ మెమోలను ఆన్‌లైన్‌లో ఉంచే వారు. ఈసారి వాట్సప్‌లో ఫలితాలు ఇస్తున్నం దున పిడిఎఫ్ రూపంలో మార్కులు ఇవ్వనున్నారు.



## బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

### 17 మంది మృతి, మరికొందరికి తీవ్ర గాయాలు

**అహ్మదాబాద్, ఏప్రిల్ 1:** గుజరాత్‌లోని దీశాలోని ధువరోడ్డులో ఉన్న గోదాములో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది సిబ్బంది చనిపోయారు. దీశా మున్సిపల్ పరిధిలోని అగ్నిమాపక సిబ్బంది 108 అంబులెన్సులు ఆప్రాంతానికి చేరుకుని రక్షణ చర్యలుచేపట్టాయి. గన్‌పౌడర్ ఫ్యాక్టరీలో ఈ భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శక్తివంతమైన పేలుడు కావడంతో సమీపంలోని గోదాము కూలిపోయింది. శిథిలాలు >>2

### కోటిమంది లబ్దిదారులు దాటే విధంగా

# రెండో విడత దీపం -2 అమలు

### అర్హులు అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**సచివాలయం,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** కోటి మంది లబ్దిదారులు దాటే విధంగా రెండో విడత దీపం-2 పథకాన్ని రాష్ట్రంలో నేటినుండి ప్రారంభించడం జరిగిందని,అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు.మంగళవారం రాష్ట్ర సచివాలయం 4వ బ్లాక్ ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రప్రథమంగా నెరవేర్చిన హామీ దీపం-2 ని ఈ పథకాన్ని గత ఏడాది అకోబర్ 31న దీపావళి రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్ఛాపురంలో ప్రారంభించారు.ఈ పథకాన్ని పెద్దఎత్తున 99.03లక్షల మంది సద్వినియోగం చేసుకోవడం జరిగిందని,దాదాపు రూ.760కోట్లు లబ్దిదారుల ఖాతాల్లోకి నేరుగా జమచేయడం జరిగిందన్నారు.సుప్రీంకోర్టు మార్గదర శ్కాల ప్రకారం ఇకెవైసి నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మొత్తం 4,24,59,028మంది లబ్దిదారులకు గాను ఇప్పటి వరకు 93శాతం అంతే 3,85,74,194మంది లబ్దిదారుల ఇకెవైసి పూర్తిచేయడం జరిగిందని,కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు మిగిలిన 3శాతాన్ని కూడా ఈ మాసాంతానికల్లా పూర్తిచేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.ఇకెవైసి నమోదు విషయంలో లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకై గ్రామవార్డు సచివాలయాల్లోని మొబైల్ యాప్,ఈ పోస్ మిషన్ ద్వారా ఇకెవైసి నమోదు చేసుకునే అవకాశాన్ని క్షేత్రస్థాయిలోనే కల్పించడం జరిగిందన్నారు.

**మధ్యాహ్న భోజన పథకం క్రింద నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ**

ఈ విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజన పథకం క్రింద నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.ఈ ఏడాది జూన్‌నుండి 44,394 ప్రభుత్వపాఠశాలలకు, 3938వసతి గృహాలకు నాణ్యమైన సన్నని బియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో నెలనెలా కొరియర్ ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

**రబీలో 10లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు లక్ష్యం**

నేటి నుండి రబీ సీజన్ప్రారంభం అయిందని,ఈ రబీలోదాదాపు 10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యాన్ని నిర్ధేశించు కోవడం జరిగిందని మంత్రి తెలిపారు.

# ప్రజల చేతుల్లోకి ప్రభుత్వం

- పాలనా సంస్కరణలే కారణం
- పి-4 తప్పక విజయవంతం
- వాట్సప్ గవర్నెన్స్‌తో పాలనా విధానాలు సరళం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్1.ప్రభాతవార్తప్రతినిధి:** పరిపాలనా విధానాల్లో తాము తీసుకుని వస్తున్న మార్పులకు ప్రజలనుంచి అనుహ్య స్పందన లభిస్తోందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయన ఈ ఉదయం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఒకప్పుడు పాలనను ప్రజల వద్దకు తీసుకుని వెళ్ళామన్నారు. ఇప్పుడు ఏకంగా ప్రజల చేతుల్లోకే పరిపాలన వెళ్లిందన్నారు. పాలన సంస్కరణల్లో మనం తీసుకున్న ప్రతి రంగం విజయవంతమైందన్నారు. వాటప్స్ గవర్నెన్స్‌తో ప్రజలు ప్రభుత్వం నుంచి అవసరమైన సేవలు అందుకుంటున్నారన్నారు. గతంలో నేను ప్రజల వద్దకు పాలన ప్రవేశపె ట్టాను. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవ ర్నెన్స్ తీసుకొచ్చి ప్రభుత్వ సేవలు అందిస్తున్నా మని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచం వేగంగా మారుతోంది. ఈ పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు జరుగుతూనే ఉండాలి. ప్రతి ఒక్కరూ హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలి. కేవలం 25 ఏళ్లలోనే అమెరికన్ల కంటే రెండింతలు ఆదాయం సంపాదించింది మనతెలుగువారే అయినందుకు నాకు గర్వంగా ఉంది. నేనూ, ప్రధాని మోడీ, మిత్రులు పవన్ కల్యాణ్ ఆలోచించేది ఒకటే. మనరాష్ట్రం, దేశం బాగుండాలని. ప్రపంచంలో మనదేశం అగ్రస్థానంలో ఉంటే, దేశాన్ని నడిపించే శక్తి తెలుగుజాతికి ఇవ్వాలని ఆ భగవంతుణ్ని కోరకుంటున్నాను. గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం కళ తప్పింద న్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆ ఐదేళ్లు రాష్ట్రం కళ తప్పింది. అందరం కూర్చుని సంతోషంగా మాట్లాడుకునే పరిస్థితి లేదు. గడిచిన ప్రభుత్వం సృష్టించిన సమస్యలు నా సుధీర్ఘ రాజకీయ అను భవంలో ఏనాడు చూడలేదు. అన్నీ చిక్కుముడులే. ఒక్కో చిక్కుముడిని విడదీస్తూ వ్యవస్థను సరిచేస్తున్నాం. ఈ ఏడాది రూ. 3.22 లక్షలకోట్ల బడ్జెట్ పెట్టాం. ప్రజల ఆదాయం పెరగాలి. టెక్నాలజీని యువత అంది పుచ్చుకోవాలన్నారు. పేదరికం లేని రాష్ట్రమే గమ్యం.అందుకే పి4ను తీసుకుని వచ్చాను. ప్రపంచం మొత్తం అధ్యయనం చేసి పి4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సిఎం చంద్రబాబు తెలిపారు. ఇది డబ్బుతో పరిష్కారమయ్యేది కాదని మనస్సు పెట్టి పనిచేసి సమస్యను పరిష్కరించేదని చెప్పారు. పి4 విధానం సరికొత్త చరిత్రకు శ్రీకారం అవుతుందన్నారు. రాష్ట్రాన్ని పేదరికం లేని ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకే ఉగాది నాడు ఈ విధానానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. గత ఐదు దశాబ్ధాలుగా రాజకీయరంగంలో తనను ఆదరిస్తున్న తెలుగు ప్రజలకే ఈ జీవితం అంకితం తప్ప వేరే ఆలోచనలు లేవని సీఎం స్పష్టంచేశారు. సంపద కొందరికే పరిమితం కాకూడదు. ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమవుతుంది. ఎన్టీఆర్, మహాత్మాగాంధీ, అంబేద్కర్ సహా ఎవరూ పుట్టుకతోనే గొప్పవారిగా పుట్టలేదు. వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని మహోన్నత వ్యక్తులుగా ఎదిగారు. నేడు ఉగాది పర్వదినాన మార్గదర్శి బంగారు కుటుంబం జీరో పావర్టీ పి4కు శ్రీకారం చుట్టాను. సంపన్నులు పేదలను ఆదుకోవాలి. వారిని ఆర్థికంగా పైకి తేవాలన్నారు.

# గంజాయి భారీగా అక్రమ రవాణా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

### నలుగురి అరెస్టు, 147 కిలోల గంజాయి స్వాధీనం

**విజయనగరం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి :** విజయనగరం జిల్లా రామభద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొట్టక్కి వద్ద ఫిబ్రవరి 10వ తేదీన పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలను గ్రహించి 147 కిలోల గంజాయితో ఉన్న కారును వదిలి పరారయిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పి వకుల్ జిందల్ వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కొట్టక్కి చెక్ పోస్టు వద్ద రామభద్రపురం ఎస్ఐ వి. ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేస్తుండగా విషయం గ్రహించిన నిందితులు అదే మార్గంలో వస్తూ 147 కిలోల గంజాయితో వారు వస్తున్న >>2

2-04Pg2exHMNWJQE.qxd:2-04Pg2exHMNWJQE.qxd 01/01/01 9:23 AM Page 1





మంగళవారం ప్రజలనుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న సిఎం చంద్రబాబు

### జూన్ నెలాఖరు నాటకి విజయవాడ బైపాస్ రోడ్డులో

# వాహనాలకు అనుమతి

### కాజ నుంచి వెంకటపాలెం, గొల్లపూడి మీదుగా

### చిన్నఅవుటపల్లి వరకు బైపాస్‌ను అందుబాటులోకి

## సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఏప్రిల్ 1,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ బైపాస్ రోడ్డులో వాహనాలకు అనుమతినిచ్చే దిశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యచరణ చర్యలు చేపట్టింది. ముందు అనుకున్న ప్రణాళిక ప్రకారం బైపాస్ పూర్తిచేసి, జూన్ ఆఖరునాటికి వాహనాల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు."ఎక్స్" వేదికగా ఆయన విషయం స్పష్టం చేసారు.సీఎం చంద్రబాబు అందించిన సమాచారాన్ని అనుసరించి జూన్ నాటికి పెండింగ్ పనులు పూర్తిచేసి కాజ నుంచి వెంకటపాలెం, గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు బైపాస్‌ను అందుబాటులోకి తీసుకొస్తారు. ఆ తర్వాత నాలుగు గ్రిడ్ రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలో ముమ్మరంగా కార్యకలాపాలు మొదలైన నేపథ్యంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లే బైపాస్ తక్షణమే అందుబాటులోకి వచ్చేలా చూసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రాజధాని ప్రాంతానికి కీలక జాతీయ రహదారి అందుబాటులోకి రావడమే కాకుండా, అక్కడి నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను సులువుగా తరలించేందుకు కూడా అవకాశం ఏర్పడుతుంది.

కాజ నుంచి గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు ఉన్న విజయవాడ బైపాస్ (చెన్నైకోల్‌కతా హైవే బైపాస్) ఉంది. అందులోని కాజగొల్లపూడి ప్యాకేజీ 17.88 కిలోమీటర్లు. ఇది రాజధాని ప్రాంతంలోని 9 గ్రిడ్ రోడ్ల మీదుగా వెళ్తుంది. వీటిలో ఇ3, ఇ8, ఇ10, ఇ13, ఇ15 గ్రిడ్ రోడ్లు క్రాస్ అయ్యేచోట్ల ఎన్‌హెచ్‌ఏఐ అండర్ పాస్‌లను నిర్మించింది. దీనివల్ల ఆయా గ్రిడ్ రోడ్లలో రాకపోకలు సాగించే వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

అయితే ఇ9, ఇ11, ఇ12, ఇ14 గ్రిడ్ రోడ్ల వద్ద మాత్రం అండర్‌పాస్‌లు లేకుండానే, బైపాస్ నిర్మాణం పూర్తిచేశారు. బైపాస్ క్రాస్ అయ్యేప్రాంతాల్లో ఆ నాలుగు గ్రిడ్ రోడ్లు శాశ్వతంగా మూసుకుపోతాయి. ఈ గ్రిడ్ రోడ్లపై రాకపోకలు సాగించేవారు.. బైపాస్ దాటి వెళ్లాలంటే మరో ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలిసినా గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పనులు చేసేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు గ్రిడ్ రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు లేని విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి రావడంతో ఎట్టిపరిస్థితుల్లోనూ అక్కడ అండర్‌పాస్‌లు ఉండాల్సిందేనని ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆ నాలుగు చోట్ల బైపాస్‌ను కట్‌చేసి, అండర్‌పాస్‌ల నిర్మాణానికి అంచనాలు రూపొందించే పనుల్లో ఇంజినీర్లు ఉన్నారు.ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి గడ్కరీతో మాట్లాడారు. రాజధాని పనులు వేగంగా జరుగుతున్న వేళ మొదట బైపాస్ నిర్మాణం పూర్తిచేయాలని, ఆ తర్వాత నాలుగు గ్రిడ్ రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించేలా ఇద్దరూ చర్చించి, నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ ప్రస్తుతం బైపాస్ ఆపేసి, నాలుగు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తిచేయాలంటే మరో 15 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో తొలుత బైపాస్ పూర్తిచేయడానికే సమ్మతించారు. దీంతో ఈ పనులు మరింత వేగంగా సాగనున్నాయి. వర్షాలు మొదలయ్యే లోపు జూన్ ఆఖరుకు బైపాస్ అందుబాటులోకి వచ్చేలా పెండింగ్ పనులు పూర్తిచేస్తామని ఎన్‌హెచ్‌ఏఐ వర్గాలు తెలిపాయి

## వెంకన్న ఆస్తులు కాపాడటంపై 'ఫోకస్'!

### దేశవ్యాప్తంగా తిరుమలేశుని ఆస్తులు కబ్జా కాకుండా యాక్షన్‌ప్లాన్

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు,దాతలు పలు రకాలుగా బహుమానంగా ఇచ్చిన ఆస్తులను కాపాడటంపై తిరుమల తిరుపతి దేవస్థానం ఫోకస్ పెట్టింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఏడుకొండల స్వామి ప్రియభక్తులు సమర్పించుకున్న కానుకల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా, కబ్జాకు గురికాకుండా చూడాలనే యాక్షన్‌ప్లాన్ అమలుచేసే దిశగా రాష్ట్రప్రభుత్వం కూడా చొరవతీసుకుంటోంది. ఇందుకోసం టిటిడి అధికారులు, పాలకమండలి సభ్యులతో ఒకమిటీని కూడా ఏర్పాటుచేశారు. గతనెలలో తిరుమలకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వేంకటేశ్వరస్వామి ఆస్తులు కబ్జా కానివ్వనని, రక్షణకు చర్యలు తీసుకుంటున్నామంటూ పునరుద్ఘాటించారు. ఎక్కడైనా దేవుని ఆస్తులు కబ్జా చేసివున్నా తిరిగి కాపాడుకోవడానికి కంకణంకట్టుకున్నామని వెల్లడించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం(నేడు) ఉండవల్లిలోని సిఎం నివాసంలో టిటిడి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి, రెవెన్యూ అధికారులు కలసి కీలక సమావేశం కానున్నారు. ముఖ్యంగా దేవుని ఆస్తుల పరిరక్షణకు యాక్షన్‌ప్లాన్, భక్తులకు మరింత సులభంగా స్వామివారి దర్శనం చేయించడం, అలిపిరి టోల్‌గేట్‌లో తనిఖీలకు అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు ,అన్యమత ఉద్యోగులపై చర్యలకు కీలక సూచనలు తీసుకోనే దిశగా చర్చ సాగించనున్నారు. దేశవ్యాప్తంగా వెయ్యికిపైగా స్థిరాస్థులు ఉన్నాయని, 7,126.85 వేల ఎకరాలు ఉండగా ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 690 ఆస్తులు ఉన్నాయి. 6,657.43 ఎకరాలు ఉండటం విశేషం. సాక్షాత్తు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుపతి నగరం పరిసరాల్లోనే వివిధ చోట్ల 3,663 ఎకరాలు భూములు ఉన్నాయి. 584 ఎకరాలు స్థలాలపై వివిధ న్యాయస్థానాల్లో కేసులు నడుస్తున్నాయి. పలు కోర్టుల్లో ఉన్న కేసులు కూడా పరిష్కారానికి చొరవ తీసుకునేదిశగా ప్రస్తుత పాలకమండలి ముందడుగు వేయనుంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో భక్తులు తమ కానుకగా, దేవునిపై భక్తివిశ్వాసాలతో స్థిరాస్థులు, భూములు ఇనాంగా రాసిచ్చారు. ఈ ఆస్తులను ఎవరూ కూడా విక్రయించడానికి వీలులేకుండా గత పాలకమండలి తీర్మానం చేసి, ప్రత్యేక జిఒ కూడా జారీచేసింది.

**సిఎం సమక్షంలో యాక్షన్‌ప్లాన్ :**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి దేశవ్యాప్తంగా ఉన్న వేలకోట్లరూపాయలు విలువైన ఆస్తుల రక్షణ దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం గట్టి చర్యలు చేపట్టేందుకు యాక్షన్‌ప్లాన్ సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వెంకన్న ఆస్తులను పూర్తిస్థాయిలో గుర్తించి ఎక్కడా అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఇప్పటికే పలువురు చేతిలో ఉన్న వాటిని వెనక్కుతీసుకుని పరిరక్షించాలని ఆలోచన చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో తిరుపతి, రూరల్ పరిసరాల్లో, చంద్రగిరి, తొండమనాడు, నాగలాపురం ప్రాంతాలతోబాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా, ఢిల్లీ వంటి ప్రధాన నగరాల్లో శ్రీవారికి ఆస్తులు ఉన్నాయి. ఆస్తులన్నీటినీ గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చూసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా వెంకన్న భక్తులు స్వామివారికి కానుకలుగా సమర్పించిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టేదిశగా ఛైర్మన్, అధికారులు అధ్యయనం చేస్తారు. దేశంలోని పలుప్రాంతాల్లో జనక్‌పురి, రిషికేష్, డెహ్రాడూన్ తదితర దూర ప్రాంతాల్లో ఉన్న ఆస్తులను ఆక్రమణలకు గురికాకుండా టిటిడి చూసే వీలుకలుగుతుంది. అంతేగాక దేశవ్యాప్తంగా ఉన్న వెంకన్న ఆస్తులను పూర్తిస్థాయిలో పరిరక్షించేందుకు , రక్షణ చర్యలు తీసుకోవడానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇప్పుడు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడికి చెందిన ఆక్రమణలకు గురైన స్థలాలను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకునే దిశగా పటిష్టచర్యలు తీసుకోనున్నారు.

# నెలాఖరులోగా మెగా డీఎస్సీ

>> వారిని ప్రజలు నిలదీయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి బిసిలు వెన్నుముక. రాష్ట్రంలో టిడిపి ఇంత బలంగా ఉందంటే అందుకు వెనుకబడిన వర్గాలే కారణమన్నారు. 43 ఏళ్లుగా టిడిపి జెండా మోసింది బలహీన వర్గాలేనని బెదిరించినా భయపడకుండా ఎదురొడ్డి పోరాడారని ఆయన అన్నారు. పార్టీని ఆదుకున్న వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన అన్నారు. గత ప్రభుత్వ అసమర్థ పాలన ఎలా ఉందో అందరం చూశామని రాష్ట్రాన్ని సర్వనాశం చేసిపోయారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రూ. 10 లక్షల కోట్ల అప్పు వారసత్వంగా వచ్చిందని ఓవైపు సంక్షేమం, అభివృద్ధి చేస్తూనే మరోవైపు అసలు, వడ్డీ రెండూ కట్టాల్సిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. సంపద సృష్టించి ఆదాయం పెంచి దాన్ని నిరంతరం పేదలకే ఖర్చు పెడతానని హామీ ఇస్తున్నానన్నారు.రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు మిత్రులు పవన్ కల్యాణ్ , తాను , బిజెపి జతకట్టామని ఇచ్చిన హామీలన్నీ అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు.తాను ముందుండి నడిపించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నానన్నారు.28 రకాల పింఛన్లు ఇస్తున్నామని మన దేశంలో ఒక్క పెన్షన్ల కిందే ప్రతి నెలా 63 లక్షల మందికి ఏడాదికి రూ. 33,100 కోట్లు వ్యయం చేస్తున్నామన్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసే రాష్ట్రం దేశంలో ఒక్క ఎపినేనన్నారు. రూ. 200 పింఛను రూ. 2 వేలు చేసింది తానేనన్నారు. ఎన్నికల డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు ఇస్తున్నామని మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్టే పింఛన్లూ అందిస్తున్నామన్నారు. కొందరి ఆదాయం కంటే పింఛను ద్వారానే ఎక్కువ వస్తోందని ఉపాధి నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లిన వారు పింఛను అందుకోలేకపోయేవారని అలాంటి వారికి గత ప్రభుత్వంలో పింఛను ఇచ్చేదికాదన్నారు. కానీ ఎన్డీఏ ప్రభుత్వంలో మూడో నెలలోనైనా పింఛను తీసుకునే అవకాశం కల్పించామన్నారు. అలా రెండు నెలలు వరుసగా పింఛను తీసుకోని వారు మన రాష్ట్రంలో 93,324 మంది ఉన్నారు.రాజధాని అమరావతి పనులకు శ్రీకారం చుట్టామని నాలుగేళ్లలో అమరావతికి పూర్వ వైభవం తెస్తామన్నారు.

ఈ నెలలో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చి జూన్‌లోగా కొత్త టీచరు పోస్టులు భర్తీ చేస్తామన్నారు.47 సంవత్సరాలుగా ప్రజలు నన్ను ఆశీర్వదిస్తున్నారు. సమైక్యాంధ్రలో 9 ఏళ్ల ముఖ్యమంత్రిగా, పదేళ్ల ప్రతిపక్షనేతగా, నవ్యాంధ్రలోఆరో సంవత్సరం ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం లభించిదని ఇది తనకిప్రజలిచ్చిన అరుదైన గౌరవమన్నారు.ఇటువంటి అవకాశం ఏ నాయకుడికి దొరకలేదన్నారు. పేదరికం లేని సమాజమే నా ఆశయమన్నారు. పేద కుటుంబాలను ఆదుకునే వారు మార్గదర్శిగా, ఆదుకోబడిన వారు బంగారు కుటుంబంగా పరిగణించబడతారన్నారు. కొత్తగొల్లపాలెంలో మానసిక దివ్యాంగురాలైన వడ్లమూడి సుభాషిణి ఇంటికి పింఛను అందించేందుకు ఆయన స్వయంగా వెళ్లారు. సుభాషిణి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయడంతో పాటు ఆమె తల్లికి ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సుభాషిణి చెల్లెలు భరణిని ఏం చదువుకుంటున్నావ్, ఏం కావాలనుకుంటున్నావని సిఎం అడిగారు. భరణి సమాధానం ఇస్తూ.. తనకు పోలీస్ అవ్వాలని ఉందని చెప్పింది. జనాల్ని బాగా కొట్టొచ్చు అని పోలీస్ అవుదామనుకుంటున్నావా అని నవ్వుతూ అన్నారు. పోలీస్ అయ్యి ప్రజల్ని కాపాడాలని సిఎం సూచించారు.

చదివించుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని కుటుంబ సభ్యులు తెలపగా ఆమెను కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.మరో లబ్ధిదారు బత్తుల జాలమ్మ గృహానికి వితంతు పెన్షన్ పంపిణీ చేశారు. జాలమ్మ ఇల్లు శిథిలావస్థకు చేరడంతో చూసి చలించిపోయిన సిఎం వెంటనే గృహాన్ని మంజూరు చేయడంతో పాటు గ్యాస్ కనెక్షన్ కూడా ఇవ్వాలని ఆదేశించారు. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కునేందుకు బిసి కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఏం చదవు కుంటున్నావని జాలమ్మ చిన్నకుమారుడుని ప్రశ్నించగా పదవ తరగతి మధ్యలో నిలిపేశానని చెప్పారు. చదువుకుంటావా అని సిఎం అడగ్గా చదువు రాదు అని అతను తిరిగి సమాధానం ఇచ్చాడు. ఎందుకు రాదు, మేమంతా వచ్చి చదువుకున్నామా, ఇష్టపడి చదవుకున్నాం అని అన్నారు. చదవు రాదని మనసులో పడితే రాదని, వస్తుందంటే వస్తుందని అన్నారు. ఎప్పుడూ గొర్రెలు మేపడమే కాదు, పై స్థాయికి రావాలని సిఎం చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి,జిల్లా ఎస్పీ తుషార్ డూడి,ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, , బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

### ఎపి సిఐడి మాజీ చీఫ్ సంజయ్‌కు

## సుప్రీంకోర్టు నోటీసులు

**విజయవాడ ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి సిఐడి మాజీ చీఫ్ సంజయ్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఇటీవల ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈకేసులో సంజయ్‌కు ఎపి హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ అమానుతుల్లా జస్టిస్, పి.కె మిశ్రా ధర్మాసనం, ఎపి ప్రభుత్వ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సంజయ్‌కు నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను నెలాఖరుకు వాయిదా వేసింది.

## సుందరీకరణ పూర్తి

>>న్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా, మారుతున్న కాలంతోబాటు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. దేశంలోనే ప్రముఖ ప్రముఖ రైల్వేస్టేషన్‌లలో తిరుపతి ఒకటిగా నిలిచిపోతుందన్నారు. ప్రయాణీకులు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నామని డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఆధునీకరణ పనులు ఉత్తరభారతదేశంకు చెందిన వీరేంద్ర కన్‌స్ట్రక్షన్స్ చేపట్టిందన్నారు. రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్‌లు విస్తరణ, పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆధునిక పరికరాలు, సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ చిన్న రెడ్డప్ప, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి, నిర్మాణసంస్థ సూపర్ వైజర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఎండమంటలే

>> గోస్పాడులో 40.3, కర్నూలు జిల్లా కమ్మరచేడులో 40.2, అనంతపురం జిల్లా నాగసముద్రంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో వేడి, ఉక్కపోత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించనుంది. మంగళవారంనుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు తగ్గుతాయని ఐఎండి తెలిపింది. శనివారం ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

## చేరువలో పసిడి

>> ధర ఔన్స్ 3149 డాలర్లకు చేరడంతో దేశీయంగా అదేస్థాయిలో పెరుగుతోంది. మరోవైపు వెండిధర మాత్రం కాస్త తగ్గుముఖం పట్టింది. శుక్రవారం కిలో వెండి ఢిల్లీలోరూ.1,03,000గా ఉటే మంగళవారం రూ.500 తగ్గి 1,02,500కి చేరింది. అమెరికా భాగస్వామ్య దేశాలపై బుధవారం నుంచి ప్రతీకార సుంకాలు అమలుకు ట్రంప్ ప్రకటించడంతో ఆయా దేశాలు కూడా సుంకాలు ప్రారంబించే యోచనలో ఉన్నాయి. దీనివల్లప్రపంచ ఆర్థికవ్యవస్థకు పెనుముప్పు తప్పదని అందుకే సురక్షిత పెట్టుబడి స్థావరంగా బంగారం వైపు ఇన్వెస్టర్లు పరుగులు తీస్తున్నట్లు ఆర్థికరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 02-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల పంచమి రా.11.54
కృత్తిక ఉ.8.51
వర్జ్యం రా.11.39-1.09
దు.ఉ.11.47 - మ.12.36
శుభసమయం : ఉ.9.25 - 10.10
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృషభం :** సంఘంలో గౌరవం పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో ముందడుగు వేస్తారు. దైవదర్శనాలు.

**మిథునం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలు లాభ సాటిగా సాగుతాయి.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

**కన్య :** ఆర్థిక లావాదేవీలలో ఆటుపోట్లు ఎదురైన అధిగమిస్తారు. చేపట్టిన పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**తుల :** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కారించుకుంటారు. విలువైన పత్రాలు జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.


**ధనుస్సు:** కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** శుభకార్యాలలో పాల్గొంటారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వస్తులాభం.

**కుంభం:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు.

**మీనం:** ఉద్యోగులకు బదిలీలు వుంటాయి.పనులలో ఆటంకాలు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్

## రాష్ట్రంలో నాలుగు తప్ప 64 జాతీయ రహదారులపై టోల్ పెంపు

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి :** ఎపిలో నాలుగును మినహాయించి జాతీయ రహదారులన్నింటిపై టోల్ రుసుములు పెరిగాయి.మంగళవారం నుంచి ఇవి అమలులోకి వచ్చాయి. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఏపీ రీజినల్ అధికారి పరిధిలో 68 టోల్ ప్లాజాలు ఉన్నాయి. వాటిలో నాలుగు మినహా మిగిలిన 64 చోట్ల 2025- 2026 ఆర్థిక ఏడాదికి టోల్ పెంపు ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చింది. కార్లు, జీపులకు కిలోమీటరుకు రూ.5 పైసలు, బస్సులు, లారీలకు 18 పైసలు నుంచి వాటి యాక్సిల్‌ను బట్టి 35 పైసలు వరకు పెరిగాయి. స్థానికులకు అందజేసే నెలవారీ పాస్ ప్రస్తుతం రూ.340 ఉండగా అది ఇప్పుడు రూ.350కి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే హోల్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా టోల్‌లను ఏటా సవరిస్తుంటారు. నెల్లూరు తడ మధ్యఉన్న సూళ్లూరుపేట, బూదనం, వెంకటాచలం టోల్‌ప్లాజాలు, విజయవాడహైదరాబాద్ మార్గంలో ఉన్న కీసర టోల్‌ప్లాజా కలిపి మొత్తం నాలుగు చోట్ల మాత్రం పెరగలేదు. ఇవి 1997 టోల్ నిబంధనల కింద ఉన్నాయి. వీటికి ఏటా ఆగస్టులో పెంపు అమలు చేస్తారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లేమార్గంలో నాలుగు టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటిలో కీసర మినహా కొర్లపహాడ్, చిల్లకల్లు, పంతంగి ప్లాజాల్లో రుసుములు తగ్గాయి. చిల్లకల్లు ప్లాజాలో అన్ని వాహనాలకు రూ.5 చొప్పున, పంతంగిలో కార్లు, జీపులకు రూ.15, టూ యాక్సిల్ బస్సులు, లారీలకు రూ.25, భారీ వాహనాలకు రూ.50 వరకు వరకు తగ్గాయి. ఈ మార్గంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి యాదాద్రి జిల్లా దండుమల్కాపురం వరకు 181 కిలోమీటర్ల రోడ్డును గతంలో జీఎంఆర్ సంస్థ నిర్మించింది. గత సంవత్సరం జూన్ ఆఖరు వరకు ఆ సంస్థ టోల్ వసూలు చేసింది. దాని గడువు ముగియడంతో, గత జులై నుంచి ఈ టోల్‌ప్లాజాలు ఎన్‌హెచ్‌ఏఐ ఆధీనంలోకి వచ్చినట్లు గెజిట్ ప్రచురించారు. ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల ప్రకారం లెక్కలు వేసి, ఆ మూడు టోల్‌ప్లాజాల్లో రుసుములను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ తగ్గింపు ఈరోజు నుంచి అమల్లోకి వచ్చింది. హైదరాబాద్ ఓఆర్ఆర్ టోల్ రుసుములను సగటున ఐదు శాతం పెంచుతున్నట్లు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ తెలిపింది. కొత్తఛార్జీలు మార్చి 31 అర్ధరాత్రి నుంచి అమలవుతాయని తెలిపారు.నెల్లూరుతడ మధ్య ఉన్న సూళ్లూరుపేట, బూదనం, వెంకటాచలం టోల్‌ప్లాజాలు, విజయవాడహైదరాబాద్ మార్గంలో ఉన్న కీసర టోల్‌ప్లాజా కలిపి మొత్తం నాలుగు చోట్ల మాత్రం పెరగలేదు.

## ఎల్‌ఎస్జీపై చెలరేగిన పంజాబ్‌కింగ్స్

### సొంతగడ్డపై 8 వికెట్ల తేడాతో లక్నో జట్టు చిత్తుగా ఓటమి



**లక్నో, ఏప్రిల్ 1:** ఐపిఎల్ 2025 సీజన్‌లో 13వ మ్యాచ్‌లో పంజాబ్‌కింగ్స్ చెలరేగిపోయింది. సొంత మైదానంలో లక్నో సూపర్ జెయింట్స్‌కు ఓటమి తప్పలేదు. ఐపిఎల్ 18వ సీజన్‌లో పంజాబ్‌కింగ్స్ రెండో విజయం సాధించింది. తొలిపోరులో గుజరాత్ టైటాన్స్‌కు షాకిచ్చిన పంజాబ్ లక్నో గ్రౌండ్‌లో ఎల్‌ఎస్జీ జట్టును చిత్తుచేసింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్‌సింగ్ 69 పరుగులు, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 52పరుగులుచేసారు. అయ్యర్ నాటౌట్‌గానే నిలిచారు. ఇంపాక్ట్ ప్లేయర్ నేహాల్ వధేరా 43పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచి ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరి మెరుపులతోనే లక్నోపై 8 వికెట్ల తేడాతో పంజాబ్‌కింగ్స్ విజయం సాధించింది. 16.2 ఓవర్లలోనే ఎల్‌ఎస్జీ టార్గెట్ ఛేదించింది. హిట్టర్లతో నిండిన ఎల్‌ఎస్జీ భారీ స్కోరుకూడా చేయలేకపోయింది. పంజాబ్‌కింగ్స్ పేసర్ అర్షదీప్‌సింగ్ మూడు 43 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసాడు. ఆదినుంచి కూడా లక్నోజట్టు తడబడుతూ వచ్చింది. పవర్‌ప్లేలోనే 3 కీలక వికెట్లు కోల్పోయింది. నికొలస్‌పూర్ 44, ఆయుష్ బదోనిలు జట్టును ఆదుకున్నారు. పంజాబ్ స్పిన్నర్లను ధీటుగా ఎదుర్కొంటూ లక్నో స్కోరుబోర్డును ఉరికించారు. అర్థసెంచరీకి ముందు పూరన్ ఔట్ అయినా అబ్దుల్‌సమద్ 27 పరుగులుచేసి బదోని కూడా అంతే దూకుడుతో ఆడి సోనకరుపెంచారు. దీనితో పంత్‌సేన నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 171 పరుగులుచేసి విజయం తన ఖాతాలో వేసుకుంది. తొలుత బ్యాటింగ్‌చేసిన లక్నోజట్టుకు ఆరంభంలోనే అర్షదీప్ షాకిచ్చాడు. తొలి ఓవర్‌లో నాలుగో బంతికే మిచెల్‌మార్ష్ వికెట్ నష్టపోయాడు. తర్వాత మార్క్‌రమ్ 28 పరుగులుచేసి నాల్గవ ఓవర్‌లో ఔట్ అయ్యాడు.

## గంజాయి భారీగా అక్రమ రవాణా

>> కారును వదిలి పరారయ్యారని వివరించారు. వెంటనే గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వివరించారు. సాంకేతికతను ఉపయోగించి నలుగురు నిందితులు విశాఖ జిల్లా ఆనందపురం మండల ం దుక ్కవానిపాలెం గ్రామానికి చెందిన భోగవిల్లి గోవిందరావు (20), సరుగుపల్లి అనిల్‌కుమార్ (29), బంక రామసురేష్ (25), అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిప్పుట్టు మండలం కిలగడ గ్రామానికి చెందిన అంబిడి బాలరాజు(32)లను అరెస్టు చేసినట్లు వివరించారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు ఎఎస్ఆర్ జిల్లా అనంతగిరి మండలం శివలింగాపురానికి చెందిన శెట్టి ఉమామహేశ్వరరావు అలియాస్ హుస్సేన్ (42) ఇప్పటికే పలు గంజాయి కేసుల్లో అరెస్టు కాబడి జైలులో ఉన్నాడని వివరించారు. గంజాయి వ్యాపారం ద్వారా ప్రధాన నిందితుడు సంపాదించిన 2 కోట్ల రూపాయిల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు వివరించారు.ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని ఎస్పి వకుల్ జిందల్ వివరించారు. ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన బొబ్బిలి డిఎస్పి జి.భవ్యారెడ్డి, బొబ్బిలి రూరల్ సిఐ కె.నారాయణరావు, రామభద్రపురం ఎస్ఐ వి.ప్రసాదరావు,కానిస్టేబుళ్లు వై.రమేష్,ఎస్.రవి, ఎ.ధర్మారావు,పి.నాగార్జునలను ఎస్పి వకుల్ జిందల్ అభినందించారు. ప్రశంసా పత్రాలను అందజేశారు. విలేకర్ల సమావేశంలో డిఎస్పి భవ్యారెడ్డి,బొబ్బిలి రూరల సిఐ నారాయణరావు, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు,ఆర్‌విఆర్‌కె చౌదరి, రామభద్రపురం ఎస్ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

>> సుమారు 200 మీటర్ల దూరం వరకూ చెల్లాచెదురయ్యాయి. పనిచేసే కార్మికులు తమ విధుల్లో బాణాసంచా తయారీలో ఉన్నారు. అదే సమయంలో పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు మానవ శరీర భాగాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఒకదశలో మంటలు అదుపుచేసేందుకు విధ్వంసం కట్టడిచేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ఎంతో శ్రమించాల్సి వచ్చింది. ప్రమాద తీవ్రతవల్ల మృతులసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకూప్రమాదానికి గల కారణాలపై అధికారిక సమాచారం ఏదీ లేదు. అయితే ఇంకా ఎంతమంది కార్మికులు ఈప్రమాదంలో చిక్కుకున్నారన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను రికవరీచేసారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలతో దీశా సివిల్ ఆసుపత్రికి తరలించారు. బనసకాంత కలెక్టర్ మిహిర్ పటేల్ మాట్లాడుతూ బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించిందని, దీశా పారిశ్రామిక వాడలో జరిగిందని ఈ ఉదయం తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. పేలుడు ధాటికి శ్లాబ్ కూలిపడింది. కార్మికుల కుటుంబాలు కూడా ఫ్యాక్టరీ ఆవరణలోనే నివసిస్తున్నాయి. మున్సిపల్ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చింది.

GNT3.qxd:02-04Pg3exHMNWJQECTK.qxd 01/01/01 10:13 AM Page 1





## రోలర్ స్కేటింగ్‌లో దొంతర గ్రీష్మ ప్రతిభ

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖకు చెందిన ఆర్టిస్టిక్ స్కేటర్ దొంతారా గ్రీష్మను ఏపీ ప్రభుత్వం సముచిత రీతిన సత్కరించే దిశలో సన్నద్ధమవుతుంది. శాప్ ఛైర్మన్ రవినాయుడు, క్రీడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆ దిశలో అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఇటీవల తైవాన్‌లో జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 3 స్వర్ణపతకాలు సాధించింది. విశాఖ వ్యాలీ స్కూల్‌లో ప్లస్ టూ చదువుతున్న 16 ఏళ్ల గ్రీష్మ ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు తైవాన్‌లో జరిగిన ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంది. పెయిర్, పెయిర్ డ్యాన్స్, క్వార్టెట్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఈ క్రమంలో స్కేటర్ దొంతారా గ్రీష్మకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో 3 స్వర్ణాలు సాధించిన గ్రీష్మ మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఎక్స్ లో పోస్ట్ చేశారు. మరో రెండు ఈవెంట్లలో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది దక్షిణ కొరియాలో జరగనున్న ఆసియా ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించడమే లక్ష్యమని గ్రీష్మ వెల్లడించింది. తల్లిదండ్రులు, కోచ్‌లు సత్యనారాయణ, చిట్టిబాబుల తర్ఫీదు వల్లనే ఈ పతకాలు సాధించినట్లు, వారికి గ్రీష్మ కృతజ్ఞతలు తెలిపారు. పాల్గొన్న ప్రతి పోటీలోనూ గ్రీష్మ పతకాల పంట పండిస్తోంది.

## దుర్గమ్మకు విశేష పుష్పార్చన



పుష్పార్చనలో పాల్గొన్న జపాన్ టోక్యోకు చెందిన మహిళలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 1, ప్రభాత'వార్త'** ప్రత్యేక పుష్పార్చనలందుకున్న దుర్గమ్మ వారు భక్తులను అనుగ్రహించారు. వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా తెల్లచామంతులు, మల్లెపూలు అమ్మవారి అర్చన ప్రాంగణానికి అధికారులు పండితులు, అర్చకస్వాములు తీసుకొచ్చి అక్కడ అమ్మవారికి పూజాదికాలు జరిపించారు. జపాన్ టోక్యోకు చెందిన ఇద్దరు మహిళలుశ్రీ అమ్మవారి పుష్పార్చనలో పాల్గొనడం విశేషం.

# వైద్యులు నైతిక విలువలకు కట్టుబడి పనిచేయాలి

**- ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్**

### అవసరం లేకున్నా స్కానింగ్‌లు,ఎక్స్‌రేలు రాయకండి, ఆస్పత్రి అంటే ప్రజలు భయపడకుండా వచ్చేలా చేయండి



మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,ఏప్రిల్1.,ప్రభాతవార్తప్రతినిధి;** వైద్యులు నైతిక విలువలకు కట్టుబడి పనిచేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం వైద్య విద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. వైద్యో నారాయణో హరి అన్న నానుడిని నిజం చేస్తూ ముందుకు సాగాలన్నారు.అవసరమున్న లేకున్నా ఎక్స్ రేలు,స్కానింగ్‌లు రాయకూడదన్నారు.వైద్య వచ్చిన వారిలో ఆత్మస్థయిర్యం కలిగించాలి తప్ప ఆస్పత్రికి వెళ్ళాలంటే భయపడే పరిస్థితి తీసుకుని రావోద్దన్నారు.ఎన్టీయార్ హెల్త్ యూనివర్సిటీలో ఏపీ మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం, పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం వేడుకగా జరిగింది. ఏపీ మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ జి. సుజాత, డాక్టర్ కె. వెంకట సుబ్బనాయుడు, డాక్టర్ డి. శ్రీహరి, డాక్టర్ స్వర్ణ గీత, డాక్టర్ ఎస్. కేశవరావు బాబు, డాక్టర్ సి. మల్లేశ్వరీ ల చేత మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ వైద్యుల రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్ లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. వైద్యులు తమ సర్టిఫికెట్లను ప్రతి ఐదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేయించుకోవాలని, ఈ నిబంధన ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. దీంతో వైద్యుల పనితీరుపై పర్యవేక్షణ పెరుగుతుందన్నారు. విదేశాల్లో ఉన్న వైద్యుల విషయం లో కొంత సమస్య ఉన్నప్పటికీ వాటిని కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. వైద్యులు నైతిక విలువలు పాటించాలని, అవసరం ఉన్నా లేకపోయినా యాంటిబయోటిక్స్ వాడించడం, టెస్ట్ లు పేరుతో రోగులు ఆర్థికంగా చితికిపోయేలా వ్యవహరించకూడదన్నారు. నేడు వైద్య వృత్తి వ్యాపారమైందన్న విమర్శలకు చెక్ పెట్టాలని కోరారు. పవిత్రమైన వైద్య వృత్తిని స్వీకరించిన నాడు చేసిన ప్రమాణం ప్రకారం వైద్యులు నడుచుకోవాలని వైద్యులకు మంత్రి సూచించారు. అయితే కొంత మంది రోగులు, వారి బంధువులు ఎక్కువ టెస్ట్ లు రాసి, ఎక్కువ మందులు రాసిన వారే మంచి వైద్యులన్న ఆలోచన లో ఉన్నారని, వారు కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. నేటి కాలంలో సిజేరియన్ ఆపరేషన్లు పెరిగిపోయాయని,

అందుబాటులోకి వస్తున్న కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని నార్మల్ డెలివరీలు జరిగేలా వైద్యం అందించాలన్నారు.

ఏపీఎంసీలో మొత్తం 23 మంది సభ్యులు ఉంటారని, నలుగురు ఎక్స్ అఫిషియో మెంబర్లు, 13 ఎలక్టెడ్ మెంబర్లను ఎన్ను కోవాల్సి ఉందన్నారు. అలాగే మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక కూడా జరగాల్సి ఉందన్నారు.

# విజయవాడలో ప్రవీణ్ ఉన్న మూడు గంటల్లో ఏమి జరిగింది?

**- పాస్టర్‌కు కుటుంబ సమస్యలున్నాయా..**

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** రాజమహేంద్రవరంలో పాస్టర్ ప్రవీణ్ మరణానికి ముందు విజయవాడలో గడిపిన మూడు నుంచి నాలుగు గంటల నడుమ ఏం జరిగిందనే విషయాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఆయన విజయవాడ రామవరప్పాడు చౌరస్తా సమీపంలోని ఓ పార్కులో విశ్రాంతి తీసుకున్న తర్వాత నుంచి మృతి వరకు మధ్యలో ఏం జరిగిందనే విషయాలు బయటికొస్తున్నాయి. ప్రధానంగా విజయవాడలో ఆయన్ని చివరిసారిగా చూసిన ట్రాఫిక్ ఎస్ఐ, టీకొట్టు మాస్టర్ ఆ రోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు రామవరప్పాడు వద్ద ఏం జరిగిందనేది వివరించారు. ప్రవీణ్ ద్విచక్రవాహనం హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం మరోవైపు చాలా నీరసంగా కనిపించడంతో ఈ రాత్రి వేళ రాజమహేంద్రవరం వెళ్లొద్దని, స్థానికంగా ఉన్న హోటల్‌లో విశ్రాంతి తీసుకుని ఉదయం బయల్దేరి వెళ్లాలని ఎస్ఐ, టీకొట్టు మాస్టర్ ప్రవీణ్‌కు సూచించినా ఆయన వినిపించుకోలేదని అందున్నారు. రాజమహేంద్రవరంలో అత్యవసర పని ఉంది ఇప్పుడే వెళ్లాల్తి అంటూ ప్రవీణ్ లైట్లు లేని ఆ బైక్‌పైనే వెళ్లిపోయినట్లు వారిద్దరూ పేర్కొన్నారు. గత నెల 24న సాయంత్రం 4.45 గంటలకు గొల్లపూడిలో పెట్రోల్ బంక్‌కు ప్రవీణ్ చేరుకున్నారు. అప్పటికే ద్విచక్ర వాహనంపై తూలుతూ ఉండటం, బైకు లైట్ పగిలిపోయి ఉండటం, బైక్ సేఫ్టీ రాడ్ వంకర పోవడం పెట్రోల్ బంకులోని సీసీ కెమెరాలో నమోదైంది. బంకులో సిబ్బంది ఎంత పెట్రోల్ కావాలని అడిగితే చేతితో 8 అని సైగ చేశారు. రూ.872 తన ఫోన్‌పే ద్వారా నగదు పంపించి విజయవాడ వైపు వెళ్లిపోయారు. రామవరప్పాడు రింగ్ వద్ద తాను ఆ రోజు విధులు నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. సాయంత్రం 5:20 గంటల ప్రాంతంలో సెల్ఫ్ యాక్సిడెంట్ అయిందని చెప్పారు. చుట్టుపక్కల వారు ప్రవీణ్‌ను లేపి పక్కన కూర్చోబెట్టారని వివరించారు. సమాచారం తెలిసిన వెంటనే తాను ప్రమాద స్థలానికి వెళ్లినట్లు పేర్కొన్నారు. బండికి హెడ్‌లైట్ ఊడిపోయిందని, కళ్లజోడుకు ఒక అద్దం లేదన్నారు. దెబ్బలు తగిలాయా? అని అడిగితే ప్రవీణ్ లేదని చెప్పారు. ఆయణ్ని సమీపంలోని పార్కులో కూర్చోబెట్టామని సుబ్బారావు వెల్లడించారు; దాదాపు మూడు గంటలు ప్రవీణ్ అక్కడే కూర్చున్నారని సుబ్బారావు పేర్కొన్నారు. తన విధులు ముగిసిన తర్వాత ఎనిమిది గంటల సమయంలో వెళ్లి ప్రవీణ్‌ను పలకరించానని చెప్పారు. టీకొట్టుకు తీసుకెళ్లి టీ ఇప్పించినట్లు తెలిపారు. అప్పటికే హెడ్‌లైట్ వేలాడుతోందని తాను ట్రాఫిక్ బూత్‌లోకి తాడు కోసం వెళ్లానని వివరించారు. మళ్లీ తిరిగి వచ్చే సరికే కనిపించలేదని ఆయన బాగా నీరసంగా, మగతగా ఉన్నారని ట్రాఫిక్ ఎస్సై అన్నారు. ద్విచక్ర వాహనం పడిపోవడంతో పగిలిపోయిన హెడ్‌లైట్‌ను మరమ్మతు చేసేందుకు ఎవరైనా స్థానికంగా మెకానిక్ ఉన్నారా అంటూ ప్రవీణ్ తనను అడిగారని టీకొట్టు మాస్టర్ నాగార్జున తెలిపారు. ఇక్కడ ఎవరూ లేరని తాము చెప్పామని అన్నారు. హెడ్‌లైట్ కిందకు వేలాడుతుండటంతో కనీసం దానిని తీగతో కడతాను ఉండండి అంటూ హోటల్‌లోకి వెళ్లి వచ్చేలోగానే అక్కడి నుంచి ప్రవీణ్ తన వాహనంపై వెళ్లిపోయారని వివరించారు.



# మత్స్యకారులపై అలల పంజా

**-ఇద్దరు మత్స్యకారులు గల్లంతు**

**శ్రీకాకుళం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో మంగళవారం ఉదయం సముద్రంలో వేటకు వెళ్లి రాకాసి ఆలకు ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. మంచినీళ్లపేటలో మంగళవారం ఉదయం నాలుగు గంటల సమయంలో గ్రామానికి చెందిన బొంగ కోటేశ్వరరావు, చింతల వెంకటేష్, వంక కృష్ణ, బుంగ ధనరాజులు వేటకు వెళ్లారు. రాకాసి అలలకు బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో చింతల వెంకటేష్, బొంగ కోటేశ్వరరావు ఈదుకుంటూ ప్రమాదం నుంచి తప్పించుకుని ఒడ్డుకు చేరుకున్నారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. వీరి ఆచూకీ కోసం స్థానిక మత్స్యకారులు సముద్రంలో గాలిస్తున్నారు. మత్స్యకారుల గల్లంతుపై మంత్రి అచ్చెన్నాయుడు మత్స్యశాఖ అధికారులతో ఫోన్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేటకు వెళ్లి వస్తుండగా మత్స్యకారుల బోటు తిరగబడడంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. గల్లంతైన నలుగురు మత్స్యకారుల్లో ఇద్దరు క్షేమంగా ఒడ్డుకు చేరుకోవడంతో మిగిలిన ఇద్దరు మత్స్యకారులను ఒడ్డుకు చేర్చేందుకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.


# తిరుమల సమాచారం

## శ్రీవారి ఆలయంలో 6న శ్రీరామనవమి ఆస్థానం -7న పట్టాభిషేకం



**తిరుమల,ఏప్రిల్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** త్రేతాయుగంలో సాక్షాత్తు శ్రీరామచంద్రమూర్తి కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా ఆవిర్భవించారనే పురాణగ్రంధాల ఆధారంగా తిరుమలలో శ్రీరామనవమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 6వతేదీ వెంకన్న ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం, 7న శ్రీరామపట్టాభిషేకం మహోత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు. 6వతేదీ ఆదివారం ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు రంగనాయకుల మండపంలో శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపిస్తారు. ఇందులో పాలు,పెరుగు,తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు,చందనంతో అభిషేకం చేస్తారు. సాయంత్రం6.30గంటల నుండి 8గంటలవరకు హనుమంతవాహనసేవ తిరుమలలో వైభవంగా జరగనుంది. ఆ తరువాత రాత్రి 9గంటల నుంచి 10గంటలవరకు బంగారువాకిలిలో శ్రీరామనవమి ఆస్థానం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం సహస్రదీపాలంకారసేవ రద్దయ్యింది. 7వతేదీ సోమవారం రాత్రి 8గంటల నుంచి 9గంటల వరకు బంగారువాకిలిలో ఆలయ అర్చకులు శ్రీరామపట్టాభిషేక ఆస్థాన మహోత్సవం వేడుకగా నిర్వహిస్తారు.

## బేడిఆంజనేయస్వామి మూలమూర్తికి నిధులు విడుదలైనా అమలుకాని బంగారుతాపడం



**తిరుమల,ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** మూడేళ్ళక్రిందట అప్పటి అధికారంలో ఉన్న టిటిడి పాలకమండలి ప్రతిపాదనలకు నేటికీ మోక్షం కలగలేదు. ఆ ఆమోదం అమలుకాకపోగా ఆ వైదిక కార్యక్రమం కోసం విడుదలైన నిధులు ఏమయ్యాయో?అనేది ఇప్పుడు టిటిడి అర్చకుల్లో చర్చ మొదలైంది. ప్రస్తుతం వెండి తాపడాలతోనే బేడి ఆంజనేయ స్వామి భక్తులకు దర్శనమిస్తుండటం విశేషం. కలియుగవైకుంఠం తిరుమలకొండపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా బేడిఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ప్రత్యేకత కూడా లేకపోలేదు. సాక్షాత్తు స్వామివారి ప్రియభక్తుడుగా పూజలందుకుంటున్నాడు. ఇక్కడ బేడి ఆంజనేయస్వామి మూలవిరాట్టుకు బంగారుతాపడం చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం 2002 జులైలో నిర్ణయించింది. ఇందుకు అవసరమైన సుమారు 18.75లక్షలు రూపాయలు నిధులను మంజూరుచేస్తూ అప్పటి పాలకమండలి ఆమోదించింది. ఈ పనులు అదే ఏడాది సెప్టెంబర్‌లో వెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యేనాటికి పూర్తిచేసే దిశగా టిటిడి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా ఈ పనులు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం బేడిఆంజనేయస్వామికి వెండితోతయారుచేయబడిన కవచాలును అమర్చిఉన్నారు. వీటిపై బంగారుతాపడం చేయాలని భక్తుల కోరిక మేరకు టిటిడి ఈ పనులు మొదలుపెట్టాలని, ఇందుకు దాతల సహకారం కూడా తీసుకోవాలని నిర్ణయించారు. అయితే గత మూడేళ్ళుగా ఇవేమీ అమలు కాలేదు. తిరుమలలో ఏదేని ఆలయ శుభకార్యాలు, పట్టువస్త్రాలు సమర్పణ, మఠాధిపతులు, పీఠాధిపతులు పెద్దమర్యాద సమయాల్లో, బ్రహ్మోత్సవాల్లో గొడుగులు సమర్పణకు ముందు వాటిని తొలుత బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చి ఇక్కడ ఉంచి ప్రత్యేక పూజలు చేయడం సంప్రదాయం. దీంతో బేడి ఆంజనేయస్వామికి మరింత విశిష్టత సంతరించుకుంది. ఇక్కడ స్వామివారికి బంగారు తాపడం చేయాలనేది భక్తుల అభిప్రాయాలు మాత్రం కాగితాలపైనే ఉండిపోయింది. అంతేగాక తిరుమల ఆలయంలో మూలవిరాట్టు శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైఉన్న బంగారువాకిలిని కూడా స్వర్ణమయం చేయాలని సంకల్పం నెరవేరడం లేదు.

## అనారోగ్యంతో తమిళనాడు భక్తుడు మృతి

**తిరుమల,ఏప్రిల్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన తమిళనాడు భక్తుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆలయానికి సమీపంలోని సహస్రదీపాలంకారసేవ జరిగే ప్రాంతంలో అతను ప్రాణాలు కోల్పోయాడు. తిరుమల పోలీసుల సమాచారం మేరకు.....తమిళనాడు తిరువళ్ళూరుకు చెందిన ఎస్. మోహన్‌సుందర్(35)గా గుర్తించారు. అతని జేబులోని ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో మృతి చెందాడనేది పోలీసుల సమాచారం. అయితే మరెలాంటి వివరాలు లేకపోవడంతో దర్శనానికి వచ్చి ఇలా జరిగిందా లేక ఏదేని కారణాలు ఉన్నాయా అనేది పోస్టుమార్టమ్ నివేదికలో తేలాల్సివుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. తిరుమల 1టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# 6న సీతారాముల కల్యాణోత్సవానికి సన్నాహాలు

## శ్రీరామనవమికి ముస్తాబౌతున్న ఆలయాలు



కైకాలవీధిలోని సూరాతివారి రామమందిరంలో వెలసిన సీతారామలక్ష్మణుల

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తి పట్టణంలోనూ, పరిసర గ్రామాల్లో శ్రీరామ మందిరాలు నవమి ఉత్సవాలకు ముస్తాబౌతున్నాయి. ఈ నెల 6 శ్రీరామనవమి కావటంతో గ్రామాల్లో సందడి నెలకొంది. అంతేకాక శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూడా శ్రీరాముని కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.కొన్ని సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ ఏడాది స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సూచనలతో ఇఓ టి.బాపిరెడ్డి సారధ్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

**6న కళ్యాణోత్సవం:** ఏర్పాట్లులో అధికారులు శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించే సీతారాముల కళ్యాణోత్సవం ఈ నెల 6న నిర్వహించుటకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.గతంలో ప్రసన్న వరదరాజస్వామి ఆలయ ప్రంగణంలో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించే వారు.గత మూడేళ్ళుగా వరదరాజ స్వామి ఆలయం పునర్నిర్మాణం జరుగుతున్నందువల్ల నెహ్రూవీధిలోని శ్రీరామ మందిరంలో నిర్వహిస్తున్నారు.ఈ మేరకు అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి,ఇఓ టి.బాపిరెడ్డికి ఇది కొత్త. కాబట్టి ఎలాంటి అవరోధాలు లేకుండా నిర్వహించుటకు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

**గ్రామాల్లో సందడే సందడి:** సాధారణంగా శ్రీరామనవమి ఉత్సవాల్ని పట్టణంలోనే కాకుండా పల్లెల్లో కూడా అంగరంగవైభవంగా నిర్వహించటం ఆనవాయితి. ఒక్కొక్క మందిరం పరిధిలోని అన్ని కుటుంబాల వారు భాగస్వాములుగా ఉభయాల్ని అందించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో శ్రీరామనవమి అంటే పల్లెల్లో ఎక్కడ లేని సంబరాలు, పోటీలు పడి ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నెహ్రూవీధిలోని శ్రీ పట్టాభిరామ మందిరంలో బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితి.ఈ ఉత్సవాల్ని నేడు నిర్వహించనున్నారు. ఇప్పటికే మందిరంను శుభ్రం చేసి చలువ పందిళ్ళు వేశారు. శ్రీకాళహస్తి పట్టణంలో సుమారు 70 మందిరాలు ఉన్నాయి. ఒక్కొక్క మందిరంలో పురాతన కాలం నాటి సీతారామలక్ష్మణుల చిత్రపటాలున్నాయి. ఆ రోజుల్లోనే ఉభయదారులు చిత్రపటాల్లోని శ్రీరాముని చిత్రాల్ని బంగారు పూతతో తయారు చేయించుకున్నారు. వాటిని గుర్తించిన దొంగలు కొందరు చిత్రపటాల్ని తీసుకెళ్ళారు. ఇటీవల కాలంలో సన్నిధివీధి, గాంధీవీధి,వైష్ణవకోనేరు వద్ద శ్రీరామమందిరాలు జీర్ణోద్ధారణ గావించారు. ఉత్సవాల్ని ప్రతి వీధిలోనూ ఘనంగా నిర్వహించటం ఆనవాయితి. సన్నిధివీధి, అగ్రహారంలోని మందిరంలో భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహించటం జరుగుతుంది. దేవస్థానం సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ సీతారాముల కళ్యాణాన్ని ప్రసన్న వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే వారు. ఇదో పండగ వాతావరణం చోటు చేసుకునేది. ఇప్పటికే రామమందిరాలు ముస్తాబు అయ్యాయి.శ్రీకాళహస్తి పరిసర గ్రామాల్లో శ్రీరామనవమిని ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలో రెండు మూడు రామమందిరాలుంటున్నాయి. ఇక్కడ ఉభయదారులు కూడా అధిక సంఖ్యలో ఉంటున్నారు.ప్రతి రోజూ రాత్రి వేళల్లో ఉభయదారులు పోటీలు పడి ఉత్సవాల్ని నిర్వహిస్తారు. కొన్ని గ్రామాల్లో 15 రోజుల పాటు ఉత్సవాల్ని నిర్వహిస్తారు. ఏ రోజు కా రోజు పోటీలు పడి సంబరాలు జరుపుతారు.ముఖ్యంగా పట్టాభిషేకం, కళ్యాణోత్సవం, వసంతోత్సవం అంటే పండగల కన్నా అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. శ్రీకాళహస్తిలోని రామమందిరాల్లో చిత్రపటాలుంటే సన్నిధివీధిలో సీతారామలక్ష్మణ భరత శత్రుఘ్నుల విగ్రహాల్ని తయారు చేసి పూజలు జరుపుతున్నారు.

# రూ.2000 కోట్లతో రహదారుల పునరుద్ధరణ

**విజయవాడ ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అధ్వాన్నంగా మారిన ప్రధాన రహదారులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.గుంతలు పూడ్చినా చిన్నచిన్న మరమ్మతులు చేసినా వాహనాలు సాఫీగా ప్రయాణించేందుకు అవకాశం లేని రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వాలని ఆర్ అండ్ బీశాఖను ఆదేశించింది. ఈ మేరకు 4972 కి.మీ. మేర రహదారుల పునరుద్ధరణ పనులు చేయాల్సి ఉంటుందని ఆర్‌అండ్‌బీ లెక్కతేల్చింది. వీటికి రూ.రెండు వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. ఈ నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వం కసరత్తు ఆరంభించింది. గత ప్రభుత్వంలో హయాంలో సకాలంలో మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేయక పోవడంతో అనేక రోడ్లు ఘోరంగా తయారయ్యాయి. అటువంటి వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. నాబార్డ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ఇచ్చే రూ.400 కోట్లతో 1,247 కి.మీలను అభివృద్ధి చేయనున్నారు. అలాగే మరో 1433 కి.మీల పునరుద్ధరణకు కేంద్రం ఇచ్చే స్పెషల్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ నిధులు రూ.600 కోట్లు వెచ్చించనున్నారు.ఈ పనులకు రెండు రోజుల కిందట అనుమతులు కూడా ఇచ్చారు. న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులు, రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధితో పనులు చేసేందుకు గతంలో ఎంపికచేసి తర్వాత రద్దయిన రోడ్లలో 2292 కి.మీ.లను పూర్తిస్థాయిలో పునరుద్ధరించనున్నారు. వీటికి కూడా సాస్కి నిధులు రూ.1000 కోట్లు వెచ్చించేలా ప్రతిపాదించారు. మొత్తంగా రూ.2 వేల కోట్లతో 4972 కి.మీ.ల పనులు చేయనున్నారు. ఇందులో జిల్లా రహదారులు 3162 కి.మీ. కాగా రాష్ట్ర రహదారులు 1810 కి.మీ ఉన్నాయి. న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం రూ.6400 కోట్లతో గత ప్రభుత్వంలో ఏక వరుస రహదారులను రెండు వరుసలుగా విస్తరించేలా పనులు చేపట్టారు. ఈ నిధుల్లో 70 శాతం రుణం కాగా రాష్ట్రవాటా 30 శాతంగా ఉంది. అయితే ఈ ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. మొదటి దశలో 1244 కి.మీ.లు విస్తరణ , రెండు వంతెనల నిర్మాణానికి రూ.3014 కోట్లు మంజూరయ్యాయి.


**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**

NIWAS HOUSING FINANCE

(పూర్వపు ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం : యూనిట్ నం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ
అంధేరి-ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093

**స్వాధీనతా ప్రకటన (నిబంధన 8(1) మరియు (2))**

ఇదిలా ఉండగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్టు (చట్టం) 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క (నిబంధన 3)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను నెరవేర్చే నిమిత్తం ఇందులో పేర్కొన్న సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి రుణగ్రహీత(లు) నోటీస్‌లో పేర్కొన్న మొత్తాన్ని సదరు నోటీస్ స్వీకరించిన తేదీ నుండి 60 రోజులలోగా బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసినదిగా పిలుపునిస్తూ డిమాండ్ నోటీస్ జారీ చేసారు. రుణగ్రహీత(లు) ఇట్టి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి, దిగువ సంతకందారు NHFPL అధీకృత అధికారి అయినందున సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులను క్రింద పేర్కొనబడిన ప్రతి ఆస్తి ఎదురుగా ఉన్న తేదీ స్వాధీనం చేసుకొన్నారని ఇందుమూలముగా నోటీస్ ఇవ్వడమైనది.
చట్టం యొక్క 13 సెక్షన్ యొక్క సబ్ సెక్షన్ (8) నియమాల ఏర్పాట్లు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడం ఏమనగా అందలి నిర్దేశితాలను అనుసరించి రుణగ్రహీత లభ్యంగా గల సమయంలోగా తనఖా పెట్టబడిన ఆస్తులను తిరిగి పొందవచ్చును.
ప్రధానంగా రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా తెలుపబడిన ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఒకవేళ అలా జరిపిన పక్షంలో NHFPL వారికి దిగువ తెలిపిన బకాయి మొత్తం మరియు వడ్డీ మరియు ఆపై ఇతర ఛార్జీలు మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది.

| రుణ ఖాతా నంబరు | రుణగ్రహీత(లు) & ఆస్తి వివరాలు | మొత్తం మరియు డిమాండ్ నోటీస్ తేదీ | స్వాధీనతా తేదీ | స్వాధీనతా స్టేటస్ |
|---|---|---|---|---|
| LNGUN0HL-06220025090 | 1. కోటేశ్వర రావు చెలబోయిన (రుణగ్రహీత) 2. శ్రావణి చెలబోయిన (సహ-రుణగ్రహీత) | రూ.11,80,339/- (రూపాయలు పదకొండు లక్షల ఎనభై వేల మూడు వందల ముప్పై తొమ్మిది మాత్రమే) తేది: 16-జనవరి-2025 | 31-03-2025 | సింబాలిక్‌గా స్వాధీనం |

ఆస్తి కలిగి వున్నది : గుంటూరు జిల్లా, నర్సారావుపేట ఉపజిల్లా, చిలకలూరిపేట మండలం, కావూరు గ్రామం, లింగంగుంట్ల పంచాయతీ ఏరియా, పరిధి, కావూరు గ్రామం, వద్ద ఇం.నం.611-C ఏదైతే 145.2 చ.గజాల విస్తీర్ణ స్థలం 1150చ.అడుగుల RCC ఇల్లుతో నిర్మితం. ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులచే : **తూర్పు :** జొన్నలగడ్డ శ్రీనుకు చెందిన గోడ ఆస్తి. **పడమర :** పంచాయత్ బజార్, **ఉత్తరం :** షేక్ మై మున్నీసా ప్రవీణ్‌కు చెందిన ఆస్తి. **దక్షిణం :** కె. కోటేశ్వరరావుకు చెందిన ఆస్తి. ఈ పై సరిహద్దులలో 145.2 గజాలు లేదా 121.40 చ.మీ॥ యొక్క విస్తీర్ణ స్థలం 1150 చ.అ॥ RCC ఇల్లు నిర్మాణంతో అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో.

| రుణ ఖాతా నంబరు | రుణగ్రహీత(లు) & ఆస్తి వివరాలు | మొత్తం మరియు డిమాండ్ నోటీస్ తేదీ | స్వాధీనతా తేదీ | స్వాధీనతా స్టేటస్ |
|---|---|---|---|---|
| LNGUN0HL-10230036834 | 1. హరి శంకర్ మురుగు (రుణగ్రహీత) 2. జ్యోతి మురుగు (సహ-రుణగ్రహీత) | రూ.8,72,443/- (రూపాయలు ఎనిమిది లక్షల డెబ్బై రెండు వేల నాలుగు వందల నలభై మూడు మాత్రమే) తేది: 16-జనవరి-2025 | 31-03-2025 | సింబాలిక్‌గా స్వాధీనం |

ఆస్తి కలిగి వున్నది : గుంటూరు జిల్లా, తెనాలి ఉప-జిల్లా, తెనాలి మునిసిపల్ పట్టణం, వద్ద సర్వే వార్డ్ నం.1, బ్లాక్ నం. 16 కంటిగ్యుయస్ ప్లాట్‌లో కలిగి వున్నది ఎక. 0-18 సెంట్లు T.S.నం. 570/2లో, ఎ.0-35 సెంట్లు, T.S.నం. 571లో, ఎ.0-05 సెంట్లు, T.S.నం. 572/1లో, ఎ. 0.42 సెంట్లు, T.S.నం. 572/2లో, ఎ.0-43 సెంట్లు, T.S.నం. 573/3లో, ఇం.నం. 13-17-13 దగ్గర 100 చ.గజాల యొక్క విస్తీర్ణం స్థలంతో అందులోని అన్ని ఫిక్చర్‌లు మరియు ఫిట్టింగ్‌లు ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులచే : **తూర్పు :** మునిసిపల్ బజార్, 20-11 అ॥. **పడమర :** వాసిరెడ్డి రమాదేవిచే ఇతరులకు అమ్మబడిన స్థలం. 20-11అ. **ఉత్తరం :** విక్రేత/రామిరెడ్డి విజయలక్ష్మి యొక్క మిగిలిన స్థలం 43 అ॥. **దక్షిణం :** గుగ్గులోతు మోతీబాయ్ యొక్క స్థలం-43అ॥.

ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్
తేదీ : 02.04.2025

సం/- అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున

వార్త

తక్కువ పదాలతో ఎక్కువ విషయాలు చెప్పడం మేధావుల లక్షణమైతే, చెప్పేదేమీ లేకపోయినా ఎక్కువ పదాలు వినియోగించడం మూర్ఖుల లక్షణం.

-కాల్టన్

# పంచాయతీలను నిర్వీర్యం చేయొద్దు!

జాతిపిత మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలకపెద్దలు ఏనాటి నుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి హామీలుగానే మిగిలిపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉన్నది. కనీసం రాజ్యాంగం కల్పించిన అధికారాలు కూడా స్థానిక సంస్థల ప్రతినిధులకు అప్పగించేందుకు పాలకపెద్దలు ఇష్టపడడం లేదు. కొత్త అధికారాల సంగతి దేవుడెరుగు. సర్పంచులకు గతంలో ఉన్న అధికారాలు కూడా క్రమేపీ కనుమరుగైపోతున్నాయి. ఒకనాడు గ్రామాల్లో తిరుగులేని అధికారాలు, హోదా ఉన్న సర్పంచులు నేడు ఉత్సవ విగ్రహాలుగా మారిపోతున్నారనే చెప్పొచ్చు. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గురించి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎందరో నాయకులు పెద్దపెద్ద మాటలు చెప్తూనే ఉన్నారు. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాటికి కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవంగా చూస్తే గ్రామసర్పంచులకు ఒక వ్యూహం ప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. చివరకు స్వతంత్రంగా చీపురుకట్ట కొనలేని దురదృష్టపు పరిస్థితులుతెచ్చిపెట్టారు. ఇందుకు కారణం వారూవీరు అనే దానికంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు తమవంతు ప్రయత్నాలు చేశారు, చేస్తున్నారు. గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలను పెట్టి సర్పంచులను పక్కకు పెట్టారు. వారి ప్రమేయం లేకుండానే వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితులు తీసుకువచ్చారు. ఒకరకంగా చెప్పాలంటే సర్పంచులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. నిన్న మొన్నటివరకు ఆంధ్రప్రదేశ్‌లో వాలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టి సర్పంచుల ఉనికినే ప్రశ్నార్థకం చేశారు. ఇలాంటి చర్యలతో ఉన్న ప్రాధాన్యత కూడా లేకుండాపోయింది. నేతల వాగ్దానాలు, ఉపన్యాసాలు, హామీలతో ఏదో సాధించాలని సమాజానికి ఏదోచేయాలని నూతన ఉత్సాహంతో ఎందరో యువతీయువకులు పోటీచేసి ఎన్నోవ్యయప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. గ్రామాభివృద్ధికి తాము చేసిన వాగ్దానాలు తీర్చేందుకు నడుం కట్టారు. కానీ ఈ చట్టాల వలలో, రాజకీయాల వ్యూహాలలో తాము ఏమీ చేయలేమనే విషయం అర్థంకావడానికి వారికి చాలాకాలం పట్టింది. అయితే తమ గ్రామప్రజలకు తాము చేసిన వాగ్దానాలు పూర్తిచేసేందుకు తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి కొన్నిగ్రామాల్లో పనులు పూర్తిచేశారు. అయితే ఎంతకూ ఆ బిల్లులు రాకపోవడం ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి ఇంకొకపక్క అప్పులు, వడ్డీలుపెరిగి మరొకపక్క గ్రామప్రజల ముందు తలవంచుకోలేక డజను మందికిపైగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ పరిస్థితిలో గతయేడాది జనవరి 31వ తేదీతో వారి పదవీ కాలం గడువు పూర్తయిపోయింది. అప్పటి నుంచి వారు మాజీలుగా మారిపోయారు. అయినా ఇప్పటికీ వారికి బిల్లుల డబ్బులు రాకపోవడంతో సర్పంచులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. మరొకపక్క ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికీ బిల్లులు వస్తాయో రావో తెలియదు. వస్తే ఎప్పుడువస్తాయో చెప్పేవారు లేరు. అంతా అగమ్యగోచరంగా ఉంది. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులంటే గౌరవమర్యాదలుండేవి. భారత దేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్రఉంది. చంద్రగుప్తుడి కంటే ముందు నుంచి గ్రామాలు, గ్రామవ్యవస్థ అమలులో ఉన్నట్లు ఆధారాలున్నాయి. ఆనాడు కూడా గ్రామసభలుండేవి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికం వ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేది. ప్రాచీన కాలం నుండి గ్రామీణ వ్యవస్థ ఏదోఒక రూపంలో భారత్‌లో కొనసాగుతూనే ఉన్నది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్‌రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామస్వరాజ్య లక్ష్యంలో స్థానిక సంస్థల పటిష్టత అన్నది ముఖ్యాంశం. భారతరాజ్యాంగంలో స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. 1952 నుంచి ఎన్నో కమిటీలు, మరెన్నో అధ్యయనాల అనంతరం ఎన్నో మార్పులు చేర్పులు చేశారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలకపెద్దలకు మనసు ఒప్పడం లేదు. రానురాను పంచాయతీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలతో ఎన్నికైన సర్పంచులను సస్పెండ్ చేసే అధికారం అధికారులకు కట్టబెట్టిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ఈ వ్యవస్థలో ఎన్నో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నా, ప్రభుత్వాలు మారినా అధికార వికేంద్రీకరణలో మాత్రం ఆది నుంచి అధికారంలో ఉన్న పెద్దలు జాగ్రత్తపడుతూనే ఉన్నారు. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది వంటిది. అందులో సర్పంచులు చాలాకీలకం. రాష్ట్రానికి మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు కేకలు పెడుతున్న నాయకులు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడందురదృష్టకరం. ఇప్పటికైనా ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ పదేపదే వల్లించే నేతలు పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులతో కాలం గడపడం ఏ కోణంలో చూసినా సమంజసం కాదు.

వినడంలో మనిషి తొందర పడాలి, కానీ మాట్లాడటంలో తొందర పడకూడదు. అపార్థం చేసుకోవడంలో అసలు త్వరపడకూడదు.



జేమ్స్ జ్యూడిత్

మనస్సును మంచి ఆరోగ్యకరమైన ఆలోచనలతో నింపండి. అవే జీవితాన్ని సుఖమయం చేస్తాయి.



విలికిన్స్

# ప్రజావాక్కు



## అయ్యో! బర్మా

పెను భూకంపం ధాటికి మయన్మార్ (బర్మా) కకావికలమైంది. పదహారు వందలకుపైగా మానవప్రాణాలు పోయినట్లు, మూడు వేల మంది క్షతగాత్రులైనట్లు లెక్క ఇప్పటికి తేలినా, గంట గంటకు ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. అమెరికా అంచనాల ప్రకారం విగత జీవుల సంఖ్య కొన్ని వేలల్లో ఉండొచ్చు. అక్కడి రెండు పెద్ద నగరాలు కూలిన భవనాలు, నిర్మాణాలతో మట్టిదిబ్బలుగామారినట్లు ఛాయా చిత్రాలుచెప్తున్నాయి. ఆ శిథిలనగరాల్లో చిక్కుకున్న ప్రాణాలు ఎన్ని ఉన్నాయో, ఎంతవరకు నిలబడతాయో ఎవరూ చెప్పలేరు. వెంటనే అక్కడ సహాయకచర్యలు అందించడానికి భారత్ ముందుకురావడం, 139 టన్నుల సహాయక సామగ్రి, పలు సహాయక బృందాలు, విపత్తు నిర్వహణా టీములు వెంటనే పనిలోకి దిగడం అభినందనీయం.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## పథకాలతో ప్రయోజనాలు

ఇటీవల తెలంగాణ ప్రభుత్వము తెస్తున్న రెండు పథకాలలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇది భూమిలేని నిరుపేదల పాలిటవరం. ఎందుకంటే రాజ్యాంగంలో ప్రస్తావించిన అధికరణ 41 ద్వారా పౌరుల పనికి హక్కును కల్పిస్తూ మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టంద్వారా పౌరులను కనీస సమయం పనిలో కచ్చితంగా భాగస్వాములను చేస్తూ మీవెంట మేమున్నాం అనే భరోసాను కల్పిస్తుంది. మరొకవైపు వడ్డీలేని రుణాలను మహిళలకు పెద్ద మొత్తంలో అందిస్తూ మహిళలలో నాయకత్వ బాధ్యతను సమిష్టి తనాన్ని పెంచుతూ మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేస్తూ బ్యాంకులద్వారా రుణాలు ఇవ్వడం ద్వారా గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతమవుతుంది.

-భారత అవినాష్, జనగామ

## అభివృద్ధికి కృషి చేయాలి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిని యూనివర్సిటీకే అప్పగించాలని కోరుతూ విద్యావ్యవస్థ బలోపేతంలో భాగంగా యూనివర్సిటీ భూములు యూనివర్సిటీ అభివృద్ధికే ఉపయోగించాలని తెలుపుతూభవిష్యత్తు తరాలకు సంపూర్ణ విద్యను అందించాలి అంటే యూనివర్సిటీలలోఉన్న భూములను క్రీడా మైదానాలకు ల్యాబ్‌లకు, నూతనకోర్సులు ప్రవేశపెట్టి భవన నిర్మాణాలు చేపట్టాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## 16వ వసంతంలోకి విద్యహక్కు చట్టం

ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాలు గల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించడం కోసం భారత పార్లమెంటులో 2009 ఆగస్ట్ 4న ఆమోదం పొందిఆగస్టు 26నాడు రాష్ట్రపతి ఆమోదం పొందింది. 2010 ఏప్రిల్ 1నుండి విద్యహక్కు చట్టం అమలులోకి వచ్చింది. ఆర్టికల్ 21లో ఇది పొందుపర్చారు. విద్యను ప్రాథమిక హక్కుగా అందించే 135 దేశాల సరసన మనదేశం చేరింది. 7 అధ్యాయాలు, 38సెక్షన్లు, ఒక అనుబంధ సెక్షన్ పొందుపరిచారు. బడుల మంజూరు, విద్య పని దినాలు, ఉపాధ్యాయ విధులు, ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకి సీట్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. చట్టం అమలులోకి వచ్చి 16 సంవత్సరాలు అవుతున్నా నేటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. బడులను మంజూరు చేయాలని చట్టంలో ఉంటే దేశ వ్యాప్తంగా హేతుబద్ధీకరణ పేరుతో బడులు మూసివేయడం చెస్తున్నారు. ఇప్పటికైన విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు చేయాలి. టీచర్లను బడుల్లో బోధనకు మాత్రమే వినియోగించుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా అందరూ కలిసి కృషి చేయాలి.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## తల్లిదండ్రులను గౌరవించండి

తమ జీవితాంతం పిల్లల కోసం బతికిన తల్లిదండ్రులనుచివరకు వృద్ధాశ్రమంలో, రోడ్లపైనా వదిలేస్తున్నారు కొందరు. తల్లిగా ప్రేమను పంచిన అమ్మ, కష్టపడి సంపాదించి చదువు చెప్పించి బిడ్డల ఉన్నతికి కారణమైన తండ్రి, రోడ్డుపై , వృద్ధాశ్రమంలో జీవిత చరమాంకంలో ఒంటరిగా, అనాథలా కాలం గడపాల్సి వస్తుంది. అదెంత బాధాకరం అనే విషయాన్ని పిల్లలు తెలుసుకోవాలి. రేపు తమ బిడ్డలు కూడా అలాగే చేస్తే అని ఒక్కసారి ఊహించుకుంటే ఇంకెప్పుడు అలాంటి తప్పు చెయ్యరు. పిల్లలు వృద్ధ తల్లిదండ్రులకు అండగా ఉంటే, సమాజం మరింత సంతోషకరంగా మారుతుంది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## తెలుగు భాషపై కమిటీ వేయాలి

సుమేరియన్లు తెలంగాణ ప్రాంతం నుండి వలస వెళ్ళారని ప్రొ. జేమ్స్ ఎడ్గర్ స్వైన్ పేర్కొన్నారు. తెలుగు భాష నుండే సుమేరియన్ భాష ఆవిర్భవించింది. తెలుగు ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన భాష. తెలుగు భాష ప్రాచీనత గురించి అధ్యయనం చేయడానికి రాష్ట్రప్రభుత్వం కమిటీనిఏర్పాటు చేయాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్'తో న్యాయం సాధ్యమా?

**న్యాయవ్యవస్థలోని అవినీతి ఆరోపణలను కేంద్రప్రభుత్వం, సుప్రీంకోర్టు ఏవిధంగా చట్టపరంగా పరిష్కరించగలదు అన్నదే దేశం ఎదుర్కొం టున్న సమస్య. తెరమీదికి అప్పుడప్పుడూ వచ్చే ఈ అంశం ఇప్పుడు ఢిల్లీ జడ్జి ఇంట్లోని కరెన్సీ మంటల ఆరోపణల నేపథ్యంలో తక్షణ పరిష్కారాన్ని కోరుతున్నది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన అంతర్గత న్యాయాధీశుల కమిటీ ఎలాంటి రిపోర్టు ఇస్తుందో అని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సామాన్యుడు పౌరుడిగా ఈ దేశంలో జీవించే వ్యక్తి కోరుతున్నది ఒక్కటే. అవినీతి ఆరోపణ రాజకీయ నాయకుడు ఎదుర్కొన్నా, న్యాయాధీశులు ఎదుర్కొన్నా, ప్రభుత్వ ఉద్యోగస్థులు ఎదుర్కొన్నా చట్టాలు వారి పట్ల పారదర్శకతతో న్యాయాన్ని బాహాటంగా చేస్తేనే ప్రజాస్వామ్య విలువలను, మనుగడను కాపాడినట్లవుతుంది. ఈ అంటుకున్న నిప్పును కేవలం నామమాత్రంగా ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్‌తో తాత్కాలికంగా ఆర్పుతే న్యాయం జరగదు.**



రావులపాటి సీతారాంరావు

ఢిల్లీ హైకోర్టు జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో అవుట్‌హౌస్‌గా పిలవబడే ఇంటి పరిసరాలలోనే తగలబడిన లెక్కకు మించిన కరెన్సీ నోట్లు, నిప్పును ఆర్పటానికి వచ్చిన ఫైర్ డిపార్టుమెంట్ వారు చూసి పోలీసులకు చెప్పారని అదీ, జస్టిస్ ఊళ్లోలేని సమయంలో జరిగిందని కథలుకథలుగా ఘటన గురించి వదంతులో, నిజాలో బయటకు వచ్చాయి. మొదట ఫైర్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారి కాలిన కరెన్సీ మాట నిజం కాదన్నారు. తర్వాత నీళ్ల నమిలారు. కానీ ఈ సంఘటన జరిగిన మరునాటి సాయంత్రం ఢిల్లీ చీఫ్ జస్టిస్‌కు ఢిల్లీ పోలీసు కమిషనర్ సంఘటన గురించి తెలియపర్చారు. ఆ తర్వాత చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకు కూడా తెలిసింది. వివాదంలో చిక్కుకున్న జడ్జిని తిరిగి అలహాబాద్ హైకోర్టుకు (ఆయన పారెంట్ కోర్టు) పంపటం జరిగింది. జడ్జిగారు ఆరోపణనుఖండించారు. బహుశా ఎవరి కుట్ర అయినా వుండొచ్చు అన్న సందేహాన్ని కూడా వెలిబుచ్చారు. ఉన్నతస్థాయిలో ఉన్న జడ్జీలు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవటం చాలా అరుదు. అన్నివ్యవస్థలూ పారదర్శకత లోపించి, అవినీతికి పాల్పడుతున్నప్పుడు న్యాయస్థానాలు నిప్పులాంటివి అని, చెదలు అంటవని భారతదేశ వాసుల ప్రగాఢనమ్మకం. ఆ నమ్మకం నీరు కారిపోవటంతో న్యాయవ్యవస్థ కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న జాబితాలో చేరటం, వ్యవస్థకు కాదు నష్టం, దేశం అనుసరిస్తున్న రాజ్యాంగానికీ, ప్రజాస్వామ్యానికి అపార నష్టం కలిగిన భావనతో ప్రస్తుత సమాజం ఉండటం కడు విషాదకరం. ఇది కేవలం టీకప్పులో తుఫాన్‌గా చెదిరిపోవాలనే సామాన్యులు ఇప్పటికీ ఆశిస్తున్నారు. న్యాయస్థానాలలో అవినీతి చోటు చేసుకుంటున్న అంశం పూర్వాపరాలు గమనిస్తేఇదేమీ కొత్తగా బయటకు వచ్చిన మురికికాదు అని విశ్లేషకుల అభిప్రాయం. అభిప్రాయాలు వేరు, నిజాలువేరు. నిజాలు నిగ్గు తేల్చడానికే ఉన్నత న్యాయస్థానం అంతర్గతంగా ఒక జడ్జీల కమిటీని నియమించి వారు ఇచ్చేరిపోర్టు కోసం ఎదురు చూస్తున్నది. సుప్రీంకోర్టే కాదు, దేశంలో అన్నివ్యవస్థలతోపాటు సామాన్య ప్రజానీకం కూడా ఎదురుచూస్తున్న మాట నిజం. కొన్నేళ్ల కిందట పట్టాభిరామారావు అనే సెషన్స్ జడ్జి స్థాయి న్యాయాధీశుడు, అందరికీ తెలిసిన కర్ణాటక మైనింగ్ కింగ్, గాలిజనార్ధన రెడ్డి కేసు విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొని, అరెస్టు కాబడి, అవమాన భారాన్ని తట్టుకోలేక బెయిల్ మీద ఉన్నప్పుడు ఆత్మహత్య కు పాల్పడ్డారని ఒక కథనంగా ఘటనగా ఇప్పటికీ మర్చిపో లేదు. ఈ కొత్త ఆరోపణ, ఉన్నత న్యాయాధీశుడు మీద వెలుగులోకి రావటంతో మళ్లీ ఈ సంఘటన గురించి చర్చించుకుంటున్నారు. లోయర్ లెవల్‌లో ఉన్న జడ్జి కాబట్టి సి. బి.ఐ ఆయన మీద తీవ్రచర్యలు తీసుకున్నట్లుగా భావిస్తున్నారు కానీ, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయాధీశులకు ఇంపీ చ్‌మెంట్ మాత్రమే చర్యలకు ఆఖరిఅస్త్రంగా ఉండటం గమనార్హం. సామాన్యుడికి ఒక న్యాయం, న్యాయం చెప్పే వారికి మరొక న్యాయం



అన్న అంశం బయటపడింది. రాజ్యాంగంలో ఇలాంటి భేదాలు చోటు చేసుకున్నాయా, న్యాయస్థానాలు చట్టాలను విశ్లేషించి అవసరమైతే తగు చర్యలతోపాటు లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ఉన్నది కదా అన్నదే చర్చ. ఒకటో, రెండో కేసులు వారి పరిధిలో విచారణకు వచ్చిఉండొచ్చు. కానీ అవి అంతగా వెలుగుచూడ లేదు. ప్రజాబాహుళ్యంలో నాన లేదు. అందుకే ఇంకా ఈ చట్టం గురించి అవగాహనా లోపం వల్లనో, స్పష్టత లేకపోవడం వల్లనో పరిస్థితులు, న్యాయాన్యాయాలు క్షుణ్ణంగా ప్రజాస్వామ్యంలో వ్యవహరిస్తున్న మనదేశంలోని చట్టసవర ణకు ప్రతిపాదనలు చోటు చేసుకోలేదు. ప్రముఖ పబ్లిక్ ఇంట్రెస్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ సమస్యను వివరిస్తూ మీడియాలో ఒక వ్యాసం ద్వారా తన అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సంఘటన వల్ల ఉత్పన్నమైన పరిస్థితుల ను ప్రభుత్వం తమకు వీలుగా మల్చుకొనే ప్రయత్నంలో భాగంగా జడ్జీలను నియమించే విషయాన్ని పూర్తిగా తమ కంట్రోల్‌లోకి తీసుకొనేప్రయత్నం మరొకసారి చేస్తున్నదని అభిప్రాయపడ్డారు. అందుచేతే రాజ్యసభ ఛైర్మన్ వైస్ ప్రసి డెంట్ రాజకీయ నాయకులను (అన్ని పక్షాల నుంచి) సమావేశపర్చి నేషనల్ జ్యూడిషియల్ అపాయింట్‌మెంట్ యాక్ట్‌ను కొట్టేసిన తిరిగి ఎందుకు చట్ట పరిధిలోకి తీసుకొని రాకూడదన్న వివాదాంశాన్ని తెరమీదికి తీసుకొని వచ్చారు. (సుప్రీం ఆ యాక్ట్ రాజ్యాంగ బేసిక్ స్ట్రక్చర్‌ను ఉల్లంఘిస్తుందని కొట్టి వేయడం జరిగింది)సుప్రీం కోర్టు జ్యుడిషియల్ అపా యింట్‌మెంట్స్ విషయంలో ప్రభుత్వ జోక్యం సరికాదన్న భావనతో ఈ యాక్ట్‌ను కొట్టేసింది. ఆ విషయాన్ని జడ్జిల అవినీతి ఆరోపణలతో ముడిపెట్టిన చర్చలు అవసరమా? విషయం ఒకటవుతే మరొక విషయాన్ని ముడిపెట్టి సమస్య పరిష్కారం బదులు సమస్యలో భాగంకావడం ఎంతవరకు సమంజసమని కొందరు విజ్ఞులు కూడాభావిస్తున్నారు. అయితే జడ్జిల నియామకాలు కొలీజియం వ్యవస్థ పారదర్శకత లోపించి పూర్తిన్యాయం చేకూర్చటం లేదన్న భావన కూడా న్యాయనిపుణులలో ఉంది. ఆ సమస్యను తేలిగ్గా తీసివేయడం సమంజసం కాదని మరికొందరి అనుభవజ్ఞుల అభిప్రాయం. ప్రభుత్వం ఎక్కువగా న్యాయమూర్తుల నియామకాలు నియంత్రణ చేయడంకూడా ఈ సమస్యకు పరిష్కారంకాదు. కొలీజియంలోని సిట్టింగ్ జడ్జీలు పనిభారంతో సతమతమ వుతున్నారు. అందుకనే నియామకాల బాధ్యతను పూర్తి ఏకాగ్రతతతో నిర్వర్తించలేకపోతున్నారు. సంవత్సరానికి వందలమంది జడ్జీల నియామకాలు జరగాల్సిన అవసరంఉంది. పూర్తిస్వేచ్ఛతో ఈ బాధ్యతను నిర్వహించటానికి జ్యుడిషియల్ అప్పాయింట్‌మెంట్ కమిషన్ లాంటిది మిగతా నియామకాల వ్యవస్థల మాదిరి చట్టం ద్వారా నిర్దిష్టమైన మార్గదర్శకాలతోటి, అనుభవం కలిగిన వ్యక్తులతోటి జడ్జిలనియా మకాలు చేపట్టటం అనేది మరొక పరిష్కారంగా భావించవచ్చు. న్యాయవ్యవస్థలోని అవినీతి ఆరోపణలను కేంద్రప్రభుత్వం, సుప్రీంకోర్టు ఏవిధంగా చట్టపరంగా పరిష్కరించగలదు అన్నదే దేశం ఎదుర్కొంటున్న సమస్య. తెరమీదికి అప్పుడప్పుడూ వచ్చే ఈ అంశం ఇప్పుడు ఢిల్లీ జడ్జి ఇంట్లోని కరెన్సీ మంటల ఆరోపణల నేపథ్యంలో తక్షణ పరిష్కారాన్ని కోరుతున్నది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన అంతర్గత న్యాయాధీశుల కమిటీ ఎలాంటి రిపోర్టు ఇస్తుందో అని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సామాన్యుడు పౌరుడిగా ఈ దేశంలో జీవించే వ్యక్తి కోరుతున్నది ఒక్కటే. అవినీతి ఆరోపణ రాజకీయ నాయకుడు ఎదుర్కొన్నా, న్యాయాధీశులు ఎదుర్కొన్నా, ప్రభుత్వ ఉద్యోగస్థులు ఎదుర్కొన్నా చట్టాలు వారి పట్ల పారదర్శకతతో న్యాయాన్ని బాహాటంగా చేస్తేనే ప్రజాస్వామ్య విలువలను, మనుగడను కాపాడినట్లవుతుంది. ఈ అంటుకున్న నిప్పును కేవలం నామమాత్రంగా ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్‌తో తాత్కాలికంగా ఆర్పుతే న్యాయం జరగదు. •

# వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన అవసరం

రామ కిష్టయ్య సంగన భట్ల

వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల హక్కు అని అర్థం. భారత దేశంలో 1986లో వినియోగదారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. ఈ చట్టం ప్రకారం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగదారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాదకారక వస్తువులు, సేవల నుంచి రక్షణపొందే హక్కు. అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు సేవలను పొందాలి. అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియజేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు. వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసుకోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. వినియోగదారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, లోపాల నుండి పరిహారం పొందేహక్కు. వినియోగదారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగ దారుల విద్య హక్కు. వినియోగదారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతోఅవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కుల పట్ల అవగాహన లేకఎంతో మోసపోతున్నారు. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈకామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుంతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. వినియోగదారు రక్షణచట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కారసంస్థల ఏర్పాటుకు మార్గంసుగమం చేసింది. కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. కేంద్రప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటుచేసే రాష్ట్రవినియోగదారు పరిష్కారసంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ జ్యూడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. •

# తీవ్ర ఒత్తిడిలో ఉపాధ్యాయ లోకం

శ్రీశ్రీ కుమార్

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయ లోకమే నేడు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నట్టు స్పష్టమవుతున్నది. పరీక్షలు, ఫలితాలు వాటితో పాటుగా ప్రమాణాల పేరుతో రకరకాల సర్వేలు, రిపోర్టులు తయారవుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుండడం గమనార్హం. పబ్లిక్ పరీక్షలలో ఫలితాలు ఇంత శాతం సాధించాలని జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు ప్రతి సంవత్సరం నిర్దేశించడం మామూలే. ఫలితాలు అనేవి నిర్దేశిస్తే వచ్చేవి కావని మన అధికారులు ఎప్పటికీ గ్రహించలేరు. వారు క్షేత్రస్థాయిలో వాస్తవాలు గ్రహించకుండా కేవలం ప్రభుత్వాల మెప్పుపొందడం కోసమే ఈ రకమైన నిర్దేశాలు, ఆదేశాలు జారీ చేస్తారు. వారు ఆ రకంగా ఉపాధ్యాయ లోకంపై ఒత్తిడి పెంచడం, ఉపాధ్యాయులు విద్యార్థులపై ఒత్తిడి పెంచడం పర్యవసానంగా విద్యార్థులు తీవ్రమైన చర్యలకు అనగా ఆత్మహత్య లాంటి చర్యలకు పాల్పడడం మనం ప్రతి ఏడూ చదువుతాం. ఫలితాలలో ప్రమాణంగా భావించినంత కాలం నిజమైన ప్రమాణాల స్థాయి ఎప్పటికీ మెరుగుపడదనేది వారు గ్రహించాలి. మనదేశంలో విద్యను ఆషామాషీగా ఆటపాటలుగా నేర్చుకోవడం జరగడం లేదు. అది ఒక తపస్సు లాగాసాగుతుంది. మే నెలలోనే తదుపరి విద్యా సంవత్సరానికి ఒక క్యాలెండర్ తయారు చేయించడం కోసం కొంతమంది మేధావులు నియమింపబడుతారు. వారు తమదైనశైలిలో తమస్థాయిలో ఒక క్యాలెండర్ తయారు చేసి ఆమోదింపచేసుకున్న తర్వాత అన్ని పాఠశాలలకు కళాశాలలకు పంపడం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులతో నిమిత్తం లేకుండా ఏసీ గదుల్లో కూర్చుని తయారు చేసే క్యాలెండర్ వాస్తవాల లోతుల్లోకి చూడకపోగా కనీసం వాటి దరిదాపుల్లో కూడా చేరదు. అందుకే అవన్నీ ప్రయోగాత్మక వైఫల్యాలే. కేవలం పరీక్షల నిర్వహణా మాత్రమే ఆ క్యాలెండర్ ప్రకారం సజావుగా జరుగుతుంది. వాటిలక్ష్యాలు, స్పష్టీకరణలు ఏ మేరకు సాధించగలుగుతున్నారనే ఒక చర్చ ఏనాడూ జరగదు. ప్రతి పాఠ్యాంశానికి సంబంధించిన విషయ బోధన, గ్రహణ లాంటివి ఆచరణాత్మకంగా తయారు కావాలి. సెకండరీ స్థాయిలో కూడా విద్యార్థులకు కనీస సామర్థ్యాలు లేకపోవడం శోచనీయం. అందుకు ఉపాధ్యాయులను నిందించడం దుర్మార్గం. అనేక కారణాలు సమస్యలు ముప్పిరిగొన్న నేపథ్యంలో కనీస సామర్థ్యాల సాధన ఎప్పటికైనా అందని ద్రాక్షే. ఉపాధ్యాయులకు స్వేచ్ఛ లేదు. వారిని ఒక చట్రంలో బిగించి ఈ విధంగానే బోధించాలి, ఇవే బోధించాలి, వాటి ఫలితాలు ఇవే కావాలి అన్నట్లు అధికారులు నిర్దేశించడం హేతుబద్ధం కాదు. అసలు వారికి తరగతి గది పనికి మించి ఇతర కార్యక్రమాలు పనులు ఎక్కువవుతున్నాయి. చివరికి వారు కంప్యూటర్ల లాగానే మానవ రోబోలుగాను మారే పరిస్థితులు దాపురించాయి. బోధన కన్నా బోధనేతర పనులు ఎక్కువైనాయి. అధికారులు కూడా విద్యా ప్రమాణాల గూర్చి, తరగతి బోధనగూర్చి ఏనాడూ పట్టించుకున్న పాపాన పోరు. వారికి కావలసిన, వారు తిరిగి పైఅధికారులకు సమర్పించవలసిన సమాచారం కాగితాల రూపంలో అందిందా లేదా అన్నదే వారి బాధ. అంకెల రూపంలో సమాచారం మాత్రమే వారికి ముఖ్యం. క్షేత్రస్థాయిలో నిజమైన బోధన జరుగుతున్నదో లేదో వారికి



అనవసరం. ప్రమాణాలు మెరుగుపడుతున్నాయా లేదా విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెరుగుదల వారికి ఏనాడు పట్టవు. నైపుణ్యం వెలికి తీసే చర్యలు ఏమీఉండవు. ఆలోచనలకు, సృజనాత్మకతకు తావులేకుండా మన విద్యాధికారులు ఒక ఏడాదికి సరిపోను కార్యక్రమాలు తయారు చేయడం శోచనీయం. వారు మనుషులతో కాకుండా కాగితాలతోనే మాట్లాడతారనేది వాస్తవం. అసలు మంత్రులైనా, అధికారులైనా క్షేత్రస్థాయిలో వాస్తవాలు అధ్యయనం చేశారా వాటిపై సమగ్రమైన సమీక్ష జరిపారా అనేది ఉపాధ్యాయ లోకం ప్రశ్నించాలి. ముఖ్యంగా కరోనా అనంతరపరిస్థితుల్లో విద్యార్థులను నాలుగు గదులకు పరిమితం చేసి వారిచే పాఠ్యాంశాలు చదివించడం, వారికి వినిపించడం ఉపాధ్యాయులకు గగన కుసుమమైన పరిస్థితి. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు అలవాటు పడటం ఒక సంవత్సరానికి పైగా పాఠశాలలకు దూరం కావడం చదువుకు దూరం కావడం ఇలాంటి సమస్యలు మనం తరగతి గదిలో ఎదుర్కొంటున్నాం. కొవిడ్ తర్వాత విద్యార్థులలో మానసిక శారీరక మార్పులు చోటు చేసుకోవడంతో వారిని నియంత్రించడం సరైన మార్గంలో నడిపించడం ఉపాధ్యాయులకు కష్ట సాధ్యమవుతుందనేది కాదనలేని వాస్తవం. కానీ ఇవన్నీ పట్టని అధికారులుమాత్రం మీరు ఏ విధంగానైనా తాము నిర్దేశించిన ఫలితాలు తేవాల్సిందే అనడం ఉపాధ్యాయ లోకాన్ని మరింత సమస్యల వలయంలోకి నెట్టివేస్తున్నది. వారిచే ఇష్టం లేని అనైతిక చర్యలకు పాల్పడేలా చేస్తున్నది. ఎందుకంటే ప్రమాణాల కంటే ఫలితాలు అధికారులను సంతృప్తి పరుస్తాయి. ప్రశ్నపత్రం సరిగా తయారు చేయించలేని లీకులు లేకుండా పరీక్షలు సక్రమంగా జరుపలేని ప్రభుత్వాలు ఫలితాల విషయంలో మాత్రం ఉపాధ్యాయ లోకాన్ని తప్పుపడుతున్నది. ఇటు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, అటు అధికారుల మధ్య ఉపాధ్యాయులు నలిగిపోయి తమ విధులుసక్రమంగా నిర్వహించలేకపోతున్నారనేది కఠినమైన నిజం. మొన్న విజయనగరం జిల్లాలో ఒక ప్రధానోపాధ్యాయుడు ఉదయం పూట విద్యార్థుల ఎదుట తనను తాను శిక్షించుకున్నాడు. విద్యార్థులు సరిగాచదవలేకపోతున్నారని వారు కనీస సామర్థ్యాలు సాధించలేకపోతున్నారని బాధతో ఒక నిస్సహాయ పరిస్థితుల్లో మాత్రమే సదరు ప్రధాన ఉపాధ్యాయుడు ఆ రకమైన చర్యకు పాల్పడ్డాడు. అది ఆ ఒక్కప్రధాన ఉపాధ్యాయుడి స్థితి మాత్రమే కాదు. మొత్తం ఉపాధ్యాయ లోకం మానసిక దైన్యస్థితిని తెలియజేస్తున్నది. దానికి కారణాలు విశ్లేషించాలి. వాటికి పరిష్కారాలు కనుక్కోవాలి. సమస్య లోతుల్లోనికి పోకుండా రోగనిర్ధారణ సరిగా జరగకుండా కేవలం పైపూత మందులు పనిచేయవు. ఉపాధ్యాయులు తరగతి గదులలో అద్భుతాలు సృష్టించగలరు కానీ వారు సంతోషంగా స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులుండాలి. విద్యార్థి ఒక్క ఉపాధ్యాయుడితో ఉండేది కేవలం 45 నుండి 50 నిమిషాలు మాత్రమే. మొత్తం పాఠశాలలో ఆరు గంటలు ఉంటాడు. ఒక్కొక్క ఉపాధ్యాయుడు విద్యార్థులను ఒక్కొక్క రీతిలో ప్రభావితం చేస్తాడు. సమగ్ర మూర్తిమత్వ రూపకల్పనలో ఎన్నో అంశాలు విద్యార్థిని ప్రభావితం చేస్తుంటాయి. ఇవికాక తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలు, ఆకాంక్షలు, తోటి విద్యార్థుల ఆలోచనలు కూడా ఇందులోభాగమే. అధికారులు రకరకాల పేర్లతోవిద్యార్థుల సామర్థ్యాల మదింపు చేస్తూ ఉపాధ్యాయులను విద్యార్థులను గందరగోళంలో పడవేస్తున్నారు. స్వీయ శిక్షలు క్రమశిక్షణరాహిత్యాన్ని మార్చలేవు. కేవలం సానుభూతి మాత్రమే పెంచుతాయి. చాలీచాలని జీతంతో, డిమాండ్ చేసినా తమ హక్కు అయిన డిఏలు రాక, తమ సొంత పిల్లల చదువులు పట్టించుకోలేక తమ ఆరోగ్యాలు పణంగా పెట్టి నిస్వార్థంగా సేవచేసే ఉపాధ్యాయులకు ఇటు ప్రభుత్వంలోనూ సమాజంలోనూ గుర్తింపు గౌరవం లోపిస్తున్న సందర్భం ఇది. పిఆర్సి గొంతెమ్మ కోరిక అయినది. డిఏలు అడగొద్దంటున్నారు. విద్యకు నిధులు కేటాయింపులు అరకొరగానే ఉంటున్నాయి. ఏనాడో చెప్పిన ఆరు శాతానికి ఆరు దశాబ్దాలు దాటినా దిక్కులేదు. నిత్యం అసంతృప్తితో పని చేస్తే ఆ పనిలో ఎవరూ పరిపూర్ణత సాధించలేరు. •

## నూతన రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి అత్యున్నతమైన డిజైన్లు

**గుంటూరు ,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** నగరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భవన యజమానులకు,వ్యాపారులకు,వీలైనంతగా ఇబ్బందులు తగ్గించేలా శంకర్ విలాస్ వద్ద నూతన రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి అత్యున్నతమైన డిజైన్లు రూపొందించడం



జరిగిందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కలక్టరేట్‌లోని డిఆర్సీ సమావేశ మందిరంలో కలెక్టర్,ఎస్పీ సతీష్‌కుమార్,జిఎంసి కమీషనర్ పులి శ్రీనివాసులు,ఆర్ అండ్ బి ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి తో కలసి శంకర్ విలాస్ వద్ద నూతన రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రెండు వరుసల ఆర్వోబి స్థానంలో నూతనంగా నాలుగు లైన్లతో ఆరో వ్బి నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు మరియు హైవే శాఖ రూ.98కోట్లు కేటాయించిందన్నారు.నూతన ఆర్వోబి హిందూ కళాశాల వైపు మహిళా కళాశాల జంక్షన్ నుంచి లాడ్జిసెంటర్ వైపు అరండల్‌పేట 9వ లైను వరకు 930మీటర్ల పొడవు ఉంటుందని బ్రిడ్జి కింద అరండల్‌పేట 4వ లైను వద్ద 18మీటర్ల వెడల్పుతోనూ,అరండల్ పేట 5వ లైను వద్ద,గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి వద్ద 14 మీటర్ల వెడల్పుతో అండర్‌పాస్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.బ్రిడ్జి విస్తరణకు సమీపంలోని 134 భవనాల్లో కొంత స్థలం సేకరించడం జరుగుతుందన్నారు.బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవవలన ఎంఓఆర్టీ అండ్ హెచ్ 16-10-2024న పరిపాలన అనుమతులు మంజూరు చేసిందన్నారు.జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం సమయంలో తూర్పు నియోజకవర్గం నుంచి పశ్చిమ నియోజకవర్గంకు వాహనాల రాకపోకలకు ప్రత్యేక ంగా ప్రత్యామ్నాయ మార్గాలతో రూట్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందన్నారు.బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమై 24నెలల్లో పూర్తి అవుతుందని,పనులు ప్రారంభించిన ఐదు నెలల వరకుట్రాఫిక్ మళ్లింపు అవసరం ఉండదని తెలిపారు.

## 3నుండి7 వరకు దరఖాస్తులు పరిశీల,క్యాంపులు

**-నగర కమిషనర్ పులి శ్రీనివాసులు**

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్1,ప్రభాతవార్త:** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 202425 ఏడాదికి సంబందించి ఆన్ లైన్ బెనిఫిషియరీ మేనేజ్మెంట్ మోనిటరింగ్ సిస్టం (ఓబిఎంఎంఎస్)లో ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 3వ తేదీ బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పశ్చిమ నియోజకవర్గంలో 4వ తేదీ ఎన్టీఆర్ స్టేడియంలో, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 7వ తేదీ అమరావతి రోడ్ నవీన స్కూల్‌లో లబ్దిదారుల దరఖాస్తుల పరిశీలన క్యాంప్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓబిఎంఎంఎస్ ద్వారా ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలైన బిసి కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఈబిసి కార్పొరేషన్, ఏపి వైశ్య కమ్యూనిటి కార్పొరేషన్, బ్రాహ్మణ కమ్యూనిటి కార్పొరేషన్, కమ్మ కమ్యూనిటి కార్పొరేషన్, క్షత్రియ కమ్యూనిటి కార్పొరేషన్, రెడ్డి కమ్యూనిటి కార్పొరేషన్లకు సంబందించి వార్షిక ప్రణాళిక, బ్యాంక్ లింక్డ్ స్కీంల లబ్దిదారులను ఎంపిక చేయడానికి, వారి దరఖాస్తులను పరిశీలించడానికి నియోజకవర్గాల వారీగా ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు షెడ్యూల్ ప్రకటించామన్నారు. కనుక దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ కాపీ, విద్యార్హతలు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్ ల జిరాక్స్ కాపీలు, ఒక పాస్ పోర్ట్ ఫోటోతో నిర్దేశించిన క్యాంప్‌లకు హాజరు కావాలని కోరారు.



## యువకునిపై పెట్రోల్‌పోసి నిప్పు అంటించిన యువతి

**- యువతి పై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని కోపంతో ఈ ఘటన**

**సత్తెనపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** సత్తెనపల్లి నియోజకవర్గం క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామంలో ఓ యువకునిపై యువతి ఒకరు పెట్రోల్ పోసి నిప్పు అంటించిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. సదరు యువతి గురించి ఆ యువకుడు తప్పుడు ప్రచారం చేస్తున్నాడనే కోపంతో యువతి ఈ సంఘటనకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనలో యువకునికి వీపు కాలిపోవడంతో అతనిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇరువురూ ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు ఈ కేసులపై దర్యాప్తు చేస్తున్నారు.



## బస్సునే చోరీ చేశాడు.! పట్టుబడ్డాడు

**సత్తెనపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ఏకంగా ఒక ప్రైవేట్ కళాశాల బస్సును నాగేశ్వరరావు అనే వ్యక్తి చోరీ చేశాడు. పేరేచర్ల వద్ద ఆగి ఉన్న బస్సును డ్రైవర్ లేడు అని గమనించి స్టార్ట్ చేసుకొని పరారయ్యాడు. సత్తెనపల్లి మండలంలోని ధూళిపాళ్ళ దగ్గర బస్సును వెంబడించి మరి పట్టుకున్నారు. బస్సును తీసుకువెళ్ళే కంగారులో నాగేశ్వరరావు ఆటోను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. డ్రైవర్ నాగేశ్వరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




# అమరావతి వార్త



# పేదల కోసం సంపద సృష్టిస్తాం

**-గత పాలకులు నొక్కిన బటన్లు మనమిచ్చే పెన్షన్లతో సమానం**

**-ఈ నెలలోనే మెగా డీఎస్సీ**

**-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**బాపట్ల,ఏప్రిల్1,ప్రభాతవార్త:** పేదరికం నిర్మూలనకే పీ4 విధానానికి శ్రీకారం చుట్టామని, ప్రజలే ముందు ఆ తర్వాతే మిగిలిన వాటికి ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలో పేదల సేవలో కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బటన్లు నొక్కామని కొందరు గొప్పగా చెప్పుకుంటున్నారని వారు నొక్కిన బటన్లు మనమిచ్చే పెన్షన్లతో సమానమని అన్నారు. అనవసర



విమర్శలు చేసేవారిని ప్రజలు నిలదీయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నుముక. రాష్ట్రంలో టీడీపీ ఇంత బలంగా ఉందంటే అందుకు వెనుకబడిన వర్గాలే కారణమన్నారు. పార్టీని ఆదుకున్న వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. గత ప్రభుత్వ అసమర్ధ పాలన ఎలా ఉందో అందరం చూశామని రాష్ట్రాన్ని సర్వనాశం చేసిపోయారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. గత పాలకులు రూ. 10 లక్షల కోట్ల అప్పును వారసత్వంగా ఇచ్చారన్నారు. ఓవైపు సంక్షేమం, అభివృద్ధి చేస్తూనే మరోవైపు అసలు, వడ్డీ రెండూ చెల్లిస్తున్నామన్నారు. సంపద సృష్టించి ఆదాయం పెంచి దాన్ని నిరంతరం పేదలకే ఖర్చు పెడతానని హామీ ఇస్తున్నానన్నారు.రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు మిత్రులు పవన్ కల్యాణ్ , తాను , బీజేపీ జతకట్టామని ఇచ్చిన హామీలన్నీ అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు.తాను ముందుండి నడిపించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నానన్నారు.తెలుగుదేశం ప్రభుత్వంలో 28 రకాల పింఛన్లు ఇస్తున్నామని మన దేశంలో ఒక్క పెన్షన్ల కిందే ప్రతి నెలా 63 లక్షల మందికి ఏడాదికి రూ. 33,100 కోట్లు వ్యయం చేస్తున్నామన్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసే రాష్ట్రం దేశంలో ఒక్క ఏపీనన్నారు.రూ. 200 పింఛను రూ. 2 వేలు చేసింది తానేనన్నారు. డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు ఇస్తున్నామని మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్టే పింఛన్లూ పంపిణి చేస్తున్నామన్నారు. రెండు నెలలు వరుసగా పింఛను తీసుకోని వారు మన రాష్ట్రంలో 93,324 మంది ఉన్నారు.రాజధాని అమరావతి పనులకు శ్రీకారం చుట్టామని నాలుగేళ్లలో అమరావతికి పూర్వ వైభవం తెస్తామన్నారు.ఈ నెలలో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చి జూన్ లోగా కొత్త టీచరు పోస్టులు భర్తీ చేస్తామన్నారు.47 సంవత్సరాలుగా ప్రజలు నన్ను ఆశీర్వదిస్తున్నారు. రాష్ట్రంలో ఏ నాయకుడికి అందని అరుదైన గౌరవం తనకు దక్కిందన్నారు. . పేదరికం లేని సమాజమే నా ఆశయంమన్నారు.కొత్తగొల్లపాలెంలో మానసిక దివ్యాంగురాలైన వడ్లమూడి సుభాషిణి ఇంటికి పింఛను అందించేందుకు ఆయన స్వయంగా వెళ్లారు. సుభాషిణి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయడంతో పాటు ఆమె తల్లికి ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. .మరో లబ్ధిదారు బత్తుల జాలమ్మ గృహానికి వితంతు పెన్షన్ పంపిణీ చేశారు. జాలమ్మ ఇల్లు శిథిలావస్థకు చేరడంతో చూసి చలించిపోయిన సీఎం వెంటనే గృహాన్ని మంజూరు చేయడంతో పాటు గ్యాస్ కనెక్షన్ కూడా ఇవ్వాలని ఆదేశించారు. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కునేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఏం చదవు కుంటున్నావని జాలమ్మ చిన్నకుమారుడుని ప్రశ్నించగా పదవ తరగతి మధ్యలో నిలిపేశానని చెప్పారు. చదువుకుంటావా అని సీఎం అడగ్గా చదువు రాదు అని అతను తిరిగి సమాధానం ఇచ్చాడు. ఎందుకు రాదు, మేమంతా వచ్చి చదువుకున్నామా, ఇష్టపడి చదవుకున్నాం అని అన్నారు. చదవు రాదని మనసులో పడితే రాదని, వస్తుందంటే వస్తుందని అన్నారు. ఎప్పుడూ గొర్రెలు మేపడమే కాదు, పై స్థాయికి రావాలని సీఎం చంద్రబాబు సూచించారు.ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 3,000 పింఛను రూ 4000 వేలు చేశానన్నారు. డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్టే పింఛన్లూ అందిస్తున్నాను. ప్రతి నెలా ఒకటిన ఉదయం 9 గంటలకే 80 శాతం, తొలిరోజే 98 శాతం మందికి పింఛన్లు పంపిణీ పూర్తి



చేస్తున్న అధికార యంత్రాంగాన్ని అభినందిస్తున్నాను.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి,జిల్లా ఎస్పీ తుషార్ దూడి,ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, , బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సిఎం చంద్రబాబు పాలన

**వినుకొండ,ఏప్రిల్1,ప్రభాతవార్త:** రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని 28వ వార్డు ఓబయ్యకాలనీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ వైకాపా పాలనలో సామాజిక పింఛనుదారులు, ప్రజలు దారుణంగా మోసపోయారన్నారు. జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ప్రజలకు ఇచ్చిన వాగ్ధానం మేరకు తమ ప్రభుత్వం పింఛన్లు పెంచి పేదల జీవితాల్లో చంద్రన్న వెలుగులు నింపారన్నారు. పేదలకు అండగా ఉండే ప్రభుత్వం తమదన్నారు. సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్ళుగా సీఎం చంద్రబాబు పాలన చేస్తున్నారన్నారు. ఉగాది సందర్భంగా సీఎం ప్రవేశపెట్టిన పీ-4 విధానంతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కల సాకారం కాబోతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన, మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పింఛన్లు పంపిణీ చేసిన పల్నాడుజిల్లా కలెక్టరు

**మాచర్ల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా నెలవారీ పింఛన్ల పథకంలో భాగంగా మంగళవారం



ఉదయం పలనాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు దుర్గి మండలంలో పర్యటించి స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాది .కారి గభ్రునాయక్, మడల రెవెన్యూ అధికారి ఫణికుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. దుర్గి మండలం ధర్మవరం గ్రామంలో వ్యయసాయం చేస్తున్న కోటిరెడ్డి అనే రైతుకు పీఎండీఎస్ కింద 30 రకాల విత్తనాలు వేసి సాగు చేస్తున్న పొలాన్ని కలెక్టరు అరుణ్‌బాబు పరిశీలించారు. సాగులో మెళకువలు వారికి వివరించారు. అలాగే దుర్గి మండలం ఓబులేశునిపల్లెలో పశువుల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక మంచినీటి తొట్టెను ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి మురళీకృష్ణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సిద్ధలింగమూర్తి, మండల ప్రత్యేకాధికారి గభ్రు నాయక్, మాచర్ల ఉద్యాన అధికారి ఎన్.సురేష్, అగ్రికల్చర్ అధికారి అమీర్‌రెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులను సత్కరించిన సిపి

**విజయవాడ క్రైం,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** ప్రజా సేవకే సమయం,శక్తి అన్ని వినియోగించినందుకు డిపార్ట్‌మెంటు తరపున పదవీ విరమణ చేసిన పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఉద్యోగ భాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి,అంకిత భావంతో పోలీసు శాఖ ద్వారా విశిష్ట సేవలందించి గత నెల 31న పదవీ విరమణ చేసిన ఐదుగురు పోలీసు అధికారులను తన కార్యాలయంలో సిపి రాజశేఖరబాబు, అడ్మిన్ డిసిపి కెజివి సరిత,పోలీసు అధికారులతో కలిసి సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖ ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవలందించినందుకు గాను పదవీ విరమణ చేసిన అధికారులను అభినందించి పోలీసు మర్యాదలతో శాలువాతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందినవారిలో టాస్క్‌ఫోర్స్ ఏడిసిపి ఎ.శ్రీనివాసరావు,ఎస్ఐ (గుణదల) అబ్దుల్ రఖీబ్,మూడవ ట్రాఫిక్ ఎస్ఐ జె.రంగయ్య,సిఎస్‌బి అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్ వైఎస్ మహంకాళిరావు, ఎఆర్‌హెచ్‌సి సిఎఆర్ ఎస్.శ్రీనివాసరావులు పదవీ విరమణ గావించారు .కార్యక్రమంలో ఎఆర్ ఏసిపి డి.ప్రసాదరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు,ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సోమయ్య,అసోసియేషన్ సంఘ సభ్యులు,అధికారులు సిపిఓ సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.




## సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**చందర్లపాడు ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ఈ నెల 5న సీఎం ముప్పాళ్ళ గ్రామానికి రానున్నారు. బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకల్లో సీఎం పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించే బహిరంగ సభకు ఏర్పాటు చేసిన స్థలాలను జిల్లా కలెక్టర్ లక్ష్మీసా, మరియు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య కలసి పరిశీలించారు.

## సిఎం చంద్రబాబు సాహసోపేత నిర్ణయమే ఎన్టీఆర్ భరోసా నూతన పింఛన్లు

**ఎ కొండూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలానికి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకం కింద 32మంది లబ్దిదారులకు కూటమి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు గద్దె కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ కొత్తగా మంజూరైన 2 కొత్త పెన్షనల నగదును రామచంద్రాపురం గ్రామ సచివాలయం వద్ద కృష్ణారెడ్డి అందచేశారు. ఎ కొండూరుకు 3, కొండూరు తండాకు 4, చీమలపాడుకు 2, గొల్లమందలకు 1, కంభంపాడుకు 1, కోదూరుకు 3, కృష్ణారావుపాలెంకు 2, కుమ్మరికుంట్లకు 4, మాధవరంకు 1, పోలిశెట్టిపాడుకు 5, రామచంద్రాపురంకు 2, రేపూడి గ్రామానికి 3, వల్లపట్ల గ్రామానికి 1, మొత్తం 32 కొత్తగా పెన్షన్‌లు మంజూరైనట్లు కృష్ణారెడ్డి తెలిపారు. భర్త చనిపోయిన మరుసటి నెలలోనే ఆ పెన్షన్‌కు భార్యకు రెండో నెలలో లబ్దిదారునికి అందించే విధంగా సిఎం చంద్రబాబు సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం పట్ల లబ్దిదారులు చంద్రబాబు నిర్ణయాన్ని హర్షిస్తున్నారని గద్దె కృష్ణారెడ్డి తెలిపారు.



## ఈతకు దిగి యువకుడు మృతి

**పెదకాకాని,ఏప్రిల్1,ప్రభాతవార్త:** మండల పరిధిలోని తక్కెలపాడు గ్రామంలోగల గుంటూరు ఛానల్ కాలవలో మంగలవారం ఉదయం సుమారు గం.11:30ని.లకు నలుగురు యువకులు ఈతవేస్తుండగా షేక్.జానీ(19)అనే యువకుడికి ఈత రాక పోవడంతో మృతి చెందాడు.మృతి చెందిన వ్యక్తి మంగళదాస్‌నగర్ 1వలైన్ నివాస ముంటున్న షేక్.షాహిదా వైఫ్‌ఆఫ్ కాలేషా కుమారుడు గా గుర్తించారు.మృతి చెందిన వ్యక్తి బట్టలషాప్‌లో పని చేస్తాడని తెలిపారు.తల్లి పిర్యాదు ఇవ్వడంతో మృతికి గల కారణాలను తెలుసుకుంటామని పెదకాకాని సిఐ.నారయణస్వామి తెలిపారు.



## ప్రశాంతముగా ముగిసిన 10పరీక్షలు

**యడ్లపాడు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షలు మండలంలో మంగళవారంతో ప్రశాంతముగా ముగిసాయి. మండల కేంద్రం యడ్లపాడులో మూడు పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయటం జరిగింది. ఇందులో మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి మొత్తం 452మంది విద్యార్దులకుగాను ఇందులో 440మంది విద్యార్దులు హాజరు కాగా 12మంది విద్యార్దులు పరీక్షకు హాజరు కాలేదని ఎంఇవో నాగరత్నం తెలిపారు. పరీక్షలకు హాజరుకాని విద్యార్దులు అన్ని పరీక్షలకు రాలేదన్నారు. ముగిసిన పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు చోటుచేసు కోలేదన్నారు. పరీక్షలు పూర్తికావటంతో విద్యార్ధిని, విద్యార్దులు పరీక్ష హాలు నుండి బయటకు రావటంతోనే వారి ఆనందోత్సవాలను తెలియజేసారు.




## పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు లబ్దిదారులకు పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ తెల్లవారుజామునే ప్రతి నెల 1వతేదీన పెన్షన్ లబ్దిదారులకు ఇంటి వద్దకే వెళ్ళి నగదు అందజేయడం అద్భుత కార్యక్రమం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకుముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి నెల 1వ తేదీనే వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళలకు పెన్షన్లను పెంచి అందిస్తున్నారన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో మొదటి రోజునే 95 శాతానికి పైగా పెన్షన్‌లను లబ్దిదారులకు మున్సిపల్ సిబ్బంది, సచివాలయ అధికారులు, పార్టీ నాయకులు నేరుగా లబ్దిదారులకు అందజేస్తున్నారని తెలిపారు. లబ్దిదారుల దీవెనలే ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## కోర్టుకు హాజరైన మాజీ ఎంపి సురేష్

**సత్తెనపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బాపట్ల మాజీ ఎం.పి.నందిగం సురేష్ మంగళవారం హాజరయ్యారు. ఈయనపై అమరావతి పోలీస్‌స్టేషన్‌లో గతంలో నమోదైన కేసులో బెయిల్ పై రిలీజ్ అయ్యారు. బెయిల్ గడువు ముగియడంతో కోర్టుకు తిరిగి హాజరయ్యారు. కోర్టు నుండి సమన్లు వచ్చిన తర్వాత హాజరయ్యేటట్లు వాయిదా వేసినట్లు న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు.



## 252 కోట్ల రూపాయల ఆస్తి పన్ను వసూళ్ళు

**-ఇన్‌ఛార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్**

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** 2024-25 సంవత్సరానికి గాను 252 కోట్ల పన్ను వసూలు చేసామని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆస్థి పను ్న,నీటి ఛార్జీలు,డ్రైనేజి ఛార్జీలు మొత్తం కలిపి 252 కోట్లు వసూలు చేసామని ఆయన మంగళవారం పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 20 శాతం పన్నులు అధికంగా వసూలు చేశామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆస్థి పన్ను 160 కోట్లు,నీటి ఛార్జీలు 34 కోట్లు,డ్రైనేజి ఛార్జీలు 15 కోట్లు వసూలు కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్థి పన్ను 189 కోట్లు,నీటి ఛార్జీలు 444 కోట్లు,డ్రైనేజి ఛార్జీలు 19 కోట్లు మొత్తం కలిపి 252 కోట్లు వసూలు అయ్యాయని ఆయన వెల్లడించారు.

## మూగజీవాల దాహార్తి తీర్చిందుకు నీటితొట్టెలు ఏర్పాటుకు చర్యలు : ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

**వినుకొండ, ఏప్రిల్1, ప్రభాతవార్త:** వేసవి దృష్ట్యా మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నీటి తొట్టెలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని నాగులవరం గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన మూగజీవాల కోసం నీటితొట్టెల నిర్మాణ పనుల్ని జీ.వీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ ఒక్కో తొట్టెని రూ. 33,200తో సిమెంటుతో పక్కాగా నిర్మించడం జరుగుతుందన్నారు. బోరు మోటారు ద్వారా ఎప్పటికప్పుడు తొట్టెలు నీటితో నింపి మూగ జీవాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 55 తొట్టెలకు రూ. 18.26 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన, మండల పార్టీ అధ్యక్షులు మాదినేని ఆంజనేయులు, మక్కెన కొండలు, చిరంజీవి, బ్రహ్మం, వీరగంధం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## నీటికుంటలతో పశువులకు వేసవిలో ప్రయోజనం : ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** నీటికుంటలతో పశువులకు వేసవిలో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మండలంలోని గురవాయపాలెం గ్రామంలో



మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో భాగంగా నీటి కుంటలను ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు భూమిపూజ నిర్వహించారు. ఎంపిటిసి టి.వి.కృష్ణకుమారి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రైతులు వ్యవసాయం కొరకు సేద్యపు నీటికుంటలను ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా పశువులకు వేసవికాలంలో దాహార్తిని తీర్చేందుకు నీటికుంటల ఏర్పాటు మంచి కార్యక్రమం అని తెలియజేశారు. పల్లెలకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేసేందుకు సిఎం నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అవివింద్‌బాబు తెలిపారు.

**మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది : ఎమ్మెల్యే చదలవాడ**

మిర్చి రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మంగళవారం



గురవాయపాలెం గ్రామంలో మిర్చి రైతులతో ఆయన మాట్లాడారు. రైతుకు సరైన గిట్టుబాటు ధరలు లేవన్నారు. అయితే ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు ఇప్పటికే క్యాబినెట్‌లో చర్చించిందన్నారు. ఇచ్చిన హామీలతో పాటు అదనపు హామీలను అమలు చేస్తున్న చంద్రబాబునాయుడు వైపు మిర్చి రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారని, వారి ఆశయాలను నిజం చేసే సత్తా చంద్రబాబునాయుడుకు మాత్రమే ఉందన్నారు. కనీస మద్దతు ధర కల్పించి అప్పుల్లో ఉన్న రైతులను ఆదుకుంటామని, అధైర్యపడవద్దని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.

## లోక కళ్యాణార్థం ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలి

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** లోక కళ్యాణార్ధం యజ్ఞ, యాగాది క్రతువులతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా చేపట్టాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక తెలగపాలెం రామమందిరం మహాకుంభాభిషేక్ మహోత్సవ కార్యక్రమంలో మంగళవారం పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. దేవాలయం వద్దకు వచ్చిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు



నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అర్చకస్వాములు, పలువురు పార్టీ నాయకులు ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌ను దేవాలయంలోని తోడ్కొని వెళ్ళి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాకుంభాభిషేకానికి సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలను సందర్శించి కలశాలు, ఇతర దేవతలకు నమస్కరించారు. యాజ్ఞీకస్వామి శ్రీనివాసుల శ్రీనివాస దీక్షిత అయ్యంగార్ ఎమ్మెల్యే నరేంద్రకు వేదాశీర్వచనం చేశారు. ఎమ్మెల్యే వెంట తోట ప్రసాద్, బొప్పన బాపనయ్య, కత్తుల రవికిరణ్, అల్లం సాంబశివరావు, శెట్టి లింగేశ్వరరావు, ఆకుల సాంబశివరావు, యన్నం నాయుడు, బండ్లమూడి బాబూరావు, మువ్వా వెంకటకృష్ణ, బందరుపల్లి శ్రీనివాసరావు, దుర్గయ్య, లక్ష్మీనారాయణచౌదరి తదితరులున్నారు.

## 90శాతం పింఛన్లు పంపిణీ

**టంగుటూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన టంగుటూరులోని పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఒకటో తారీకు 90శాతం పంపిణీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పెన్షన్లు పూర్తి చేసేందుకు సచివాలయం సిబ్బంది ఉదయం నుంచే పెన్షన్లు పంపిణీ చేశారు. పెన్షన్ దారులు ఆనందంతో అందుకొని వచ్చే ఉదయాన్నే హైదరాబాద్ బస్సుల్లో దిగిన వారు కూడా ఎమ్మటిని పెన్షన్ అందుకున్నారు. పింఛన్ల కోసం పలు ప్రాంతాల నుండి విచ్చేసి పింఛన్లు అందుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

**యడ్లపాడు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డ సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన కధనం మేరకు. సత్తెనపల్లికి చెందిన అక్ల అజయ్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై గుంటూరు వైపు వెళుతున్నాడు. యడ్లపాడు ఎర్రకొండ వద్ద వంతెన పైకి రాగానే అదే మార్గంలో మద్యం సేవించి నడిచి వెళుతున్న యువకుడిని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి వంతెన పక్క గోడకు ఢీకొట్టింది. దీంతో అజయ్ వంతెన పైనుంచి కింద సర్వీసు రోడ్డులో పడ్డాడు. ప్రమాదంలో గాయపడిన అజయ్‌ను గుంటూరులోని ప్రైవేట వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గుర్తు తెలియని యువకుడు పరిసర గ్రామాల నూలుమిల్లుల్లో పని చేసే ఒడిశాకు చెందిన వలస కార్మికుడుగా పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంకాయలపాటి బాలకృష్ణ తెలిపారు.





## పశువుల దాహార్తి తీర్చడానికే నీటి తొట్లు


**కారంపూడి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** వేసవికాలంలో పశువుల దాహార్తి తీర్చడానికే నీటితొట్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం కారంపూడిలోని వినుకొండ రహదారిలో ఉపాధిహామీ పథకం కింద 33 వేల రూపాయలతో నిర్మించే నీటి తొట్టికి భూమిపూజ



చేశారు. మండలంలని 15 గ్రామాలకు 20 నీటితొట్లు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నీటి సౌకర్యం, చేతిబోర్లు ఉన్న ప్రాంతాల్లో నీటితొట్లు ఏర్పాటు చేసి పశువులకు దాహార్తి తీర్చడానికి నీటిని నిల్వ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కోటిరెడ్డి, ఈఓపీఆర్‌డీ కసిన్యానాయక్, కూటమి నాయకులు బాలునాయక్, ఇన్‌ఛార్జి సర్పంచి సరస్వతీ బాయి, తండా మస్తాన్‌జానీ, కటికల బాలకృష్ణ, బాలరాజు, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ ఫలాలు అందుకోవాలి : ఎమ్మెల్యే వేగేశన

**బాపట్ల, ఏప్రిల్01, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ ఫలాలు అందుకోవాలని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మంగళవారం బాపట్ల పట్టణంలో మన వార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా 11వ వార్డు, 14వ వార్డు,16వ వార్డులలో



ఎమ్మెల్యే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి నెల 1వ తేదిన అధికారులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వచ్చి వారికి ఫించన్ అందజేస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి పథంలో నడిపిస్తు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, చీరాల గోవర్ధన్ రెడ్డి, నూరగాని శేఖర్, మందపాటి ఆంద్రేయ, శ్రీనివాసరావు, సురేష్, నర్రా వీరాంజనీలు, బీమా కోటేశ్వరరావు, పసుపులేటి శివ, కొటికలపూడి నాగేశ్వరరావు, సుబ్బారావు, తిరుమలశెట్టి సాంబశివరావు, ఫరీద్ మస్తాన్, మందపాటి ఆంద్రెయ, శీలం శ్రీనివాసరావు, భీమా లీలా కృష్ణ, జిట్టా ప్రమీలా రాణి, తులసీ కుమారి, జిట్టా శ్రీనివాసరావు, అంజనేష్, రాఘవేంద్ర, రాణి, ప్రసాద్, మరియు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పేరిట పింఛన్ల నగదు పంపిణీ

### -చంద్రబాబు నిర్ణయం పేదల కళ్ళల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

**మంగళగిరి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** వృద్ధాప్య పెన్షన్ అందుకున్న వ్యక్తి చనిపోయిన తర్వాత నెల నుంచి ఆదే పెన్షన్‌ను ఆ వ్యక్తి భార్యకు ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత ఏడాది నవంబర్ నెలలో ఆదేశాలు జారీచేశారు. దీనికి



అనుగుణంగా స్థానిక పార్కురోడ్డు 9వ లైన్ 30వ వార్డులో బత్తుల ఈశ్వరమ్మ అనే వితంతువుకు మంగళవారం రూ.12వేల పెన్షన్ నగదును అందజేశారు. ఈశ్వరమ్మ భర్త వెంకటేశ్వరరావు గత ఏడాది డిసెంబర్ నెలలో వృద్ధాప్యం కారణంగా మృతి చెందాడు. తదుపరి నెల జనవరిలో దరఖాస్తు చేసుకోగా ఆయన పేరిట ఉన్న పెన్షన్ భార్య ఈశ్వరమ్మకు మంజూరైంది. ఆ సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున పెన్షన్ నగదు పంపిణీ చేయలేదు. కోడ్ ముగియడంతో మంగళవారం మూడు నెలలకు కలిపి (ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్) రూ.12000లు పెన్షన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ 30వ వార్డు అధ్యక్షులు బైరబోయిన శివశంకర్, టిడిపి పట్టణ కార్యదర్శి బైరబోయిన శ్రీనివాస్, టిడిపి నాయకులు కాకర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**-చంద్రబాబు నిర్ణయంతో పేదల కళ్ళల్లో వెల్లివిరుస్తున్న ఆనందం**

వాస్తవానికి పెన్షన్ అందుకుంటున్న వృద్ధుడు చనిపోతే భార్య వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి, తిరిగి కొత్త పెన్షన్‌లు ప్రభుత్వం మంజూరు చేసినప్పుడు మాత్రమే వారికి పెన్షన్ నగదు అందుతుంది. ఈ నిబంధన గతంలో ఉండేది, భర్త చనిపోయిన వెంటనే అదే వృద్ధాప్య పెన్షన్ పంపిణీని భార్య పేరిట తదుపరి నెల నుంచి కొనసాగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత ఏడాది నవంబర్‌లో నిర్ణయం తీసుకున్నారు. దీంతో వితంతు మహిళలు గతంలో పడిన ఇబ్బందులు ఎదుర్కొనకుండా దరఖాస్తు చేసుకున్న వెంటనే పెన్షన్ అందుకుంటున్నారు. చంద్రబాబు నిర్ణయంతో వారి కళ్ళల్లో ఆనందం వెల్లి విరుస్తుంది.

## డ్వాక్రా గ్రూపుల జీవనోపాధికి ప్రణాళికలు తయారు చేయండి : డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి

**కారంపూడి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** మండలంలోని డ్వాక్రా గ్రూపులకు 2025-26 సంవత్సరానికి రుణ, జీవనోపాధికి ప్రణాళికలు తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీ రాణి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు గత రెండు రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ తరగతుల్లో



పాల్గొని మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఉన్న డ్వాక్రా గ్రూపులకు రుణాలు అందించడానికి ఎన్యూమరేటర్లు కృషి చేయాలని అన్నారు. తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రాజమ్మ, పెన్షన్స్ ఏపీఓ భరత్‌కుమార్, సీసీలు మల్లేశ్వరరావు, వీరకుమారి, ప్రభావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

**నూజెండ్ల, ఏప్రిల్1, ప్రభాతవార్త:** మండలంలోని పెద్దవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నందు రీడింగ్ ఈజ్ ఫన్ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ విద్యార్థుల చేత వివిధ రకాల కథలు, హాస్య పుస్తకాలు చదివించారు. స్కూల్ హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేందుకు



ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. పుస్తక పఠనంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలపాడులో 12 క్వింటాళ్ళ ఎండు మిర్చి చోరీ

**నూజెండ్ల, ఏప్రిల్1, ప్రభాతవార్త:** మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో మీసాల నాగేశ్వరరావు అనే రైతు పొలంలో రాసిపోసిన 12 క్వింటాళ్ళ ఎండుమర్చి పంటను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీ చేశారు. ప్రస్తుత ధర ప్రకారం వాటి విలువ సుమారు రూ. 1.50లక్షలు ఉంటుందని



చేతికి అందిన పంట చోరీకి గురి కావడంతో రైతు ఆవేదన వెల్లిబుచ్చాడు.

## పాలిటెక్నిక్, ఏపీఆర్‌జెసికి ఎంట్రన్స్ కోచింగ్

**వినుకొండ, ఏప్రిల్1, ప్రభాతవార్త:** స్థానిక విష్ణుకుండినగర్ కాలువకట్ట వద్ద గల వాసవి కోచింగ్ సెంటర్ నందు ఏపీఆర్‌జెసి, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తెలియజేశారు. మంగళ వారం ఈ మేరకు గోడపత్రులు ఆవిష్కరించి వివరాలు



పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్: 8187803847, 8008474864 సంప్రదించగలరని కోరారు.

## అక్కిదాసుకు సేవా రత్న అవార్డు

**పొన్నూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** పొన్నూరు పట్టణానికి చెందిన మాల మహానాడు నాయకుడు అక్కిదాసు జోసఫ్‌కు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం లభించింది. ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెం గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవా రత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అక్కిదాసు జోసఫ్ పొన్నూరు ప్రాంతంలో అనేక ఉద్యమాలు చేయడంతోపాటు అప్పట్లో ఆర్టీసి డిపో తరలించే



సమయంలో మోకాళ్ళపై నడిచి డిపో నిలుపుదలకు కృషి చేశారన్నారు. దళిత బహుజన ఉద్యమాలలో చురుగ్గా పాల్గొనే జోసఫ్‌కు అవార్డు ఇవ్వడం హర్షణీయమని పలువురు చెప్పారు. అక్కిదాసు జోసఫ్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి తన వంతు కర్తవ్యంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఉద్యమాలలో పాల్గొనడం జరిగిందన్నారు. సమాజాన్ని చైతన్య పరచాల్సిన బాధ్యత దళిత బహుజన నాయకులపై ఎంతైనా ఉందన్నారు. తనకు అవార్డు ఇవ్వడం అంటే తన బాధ్యతను మరింత పెంచడంతోపాటు గుర్తు చేయడంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అక్కిదాసు జోసఫ్‌ను ఘనంగా సత్కరించారు.

## అలరించిన త్యాగరాజస్వామి కృతులు

**పొన్నూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** శ్రీ గణ నాదం బజామ్యహం....అనే త్యాగరాజస్వామి కృతులు, రామా నీల మేఘశ్యామ...అనే రామదాసు కీర్తనలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. స్థానిక తెలగపాలెం రామ మందిరం వద్ద జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా మంగళవారం టీవీ, రేడియో ఆర్టిస్ట్ కొమ్మూరు నాగ వెంకట బాల సుబ్రహ్మణ్యం, వై.వేణుగోపాల్(తిరుపతి) డోలు సహకారంతో



సన్నాయి వాయిద్యంతో కృతులను ఆలపించారు. సాంప్రదాయబద్ధమైన డోలు, సన్నాయి వాయిద్యానికి భక్తులు తన్మయత్వం చెందారు. త్యాగరాజస్వామి కృతులు, రామదాసు కీర్తనలు విశేషంగా ఆకర్షించాయి. రెండు సన్నాయిలు, రెండు డోళ్ళతో సాగిన ఈ కచేరి నువ్వా నేనా అనేవిధంగా పోటీ పడి వాయించారు. భక్తులు ఈ బృందానికి అభినందనలు తెలిపారు.

## మునిసిపల్ కమిషనర్‌కు సత్కారం

**సత్తెనపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** జిల్లా బెస్ట్ సేవా అవార్డును మదర్‌థెరిస్సా ఆదరణ సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. సంస్థ అధ్యక్షులు చిలకా జాన్సన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ జొన్నలగడ్డ మణిదాసు, సంస్థ సలహాదారులు నల్లూరు రవి, చిలుకా రమణయ్య, బండారు శ్రీకాంత్, బొజ్జా, నరేష్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు.



జాన్సన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో తనదైన ముద్రను కమిషనర్ ఆనంద్‌కుమార్ వేశారన్నారు. వారు పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేసిన మంత్రి డోలా

**జరుగుమల్లి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పైడిపాడు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ఇచ్చిన మాట ప్రకారం పార్టీలకు అతీతంగా పింఛన్లను పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. అభివృద్ధి ధ్యేయంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం మన ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత, తెలుగు మహిళలు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్ దినోత్సవం

**నరసరావుపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్ దినోత్సవాన్ని స్థానిక హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. డైరెక్టర్ ఆనంద్‌బెంజ్‌మెన్ మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్‌జెండర్స్ అనేక సవాళ్ళను, వివక్షతను ఎదుర్కొంటున్నారన్నారు. వారిని సమానంగా చూడాలన్నారు. వారికి హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలన్నారు. భారత పార్లమెంట్ చేసిన చట్టాన్ని అందరూ గౌరవించాలన్నారు. హెచ్ఐవిని అరికట్టడంలో



వారు భాగస్వాములు కావడం మంచిదన్నారు. ట్రాన్స్‌జెండర్స్ సౌమ్య, చాందిని తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటామన్నారు. హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎం ఉదయరాజు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్మికుల ర్యాలీ

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికులు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శిలార్ మసూద్, యోహాను, ఏసు, జీవరత్నం, విజయలక్ష్మి, నరసింహారావు, నవీన్‌కుమార్, రాజు, శ్రీను, లత తదితరులు మాట్లాడారు. మున్సిపాల్టిలో 40 మంది కార్మికులతో నెల రోజులు పని చేయించుకొని సగం నెలకే జీతాలు ఇస్తున్నారని విమర్శించారు. పారిశుద్ధ్య, ఇంజనీరింగ్




కార్మికులతో కలిసి జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తామన్నారు. 2023 డిసెంబర్‌లో 17 రోజుల సమ్మె ఒప్పందాలకు సంబంధించి జీవోను విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమంను విజయవంతం చేయండి

**బాపట్ల, ఏప్రిల్01, ప్రభాతవార్త:** సిపియస్, జీపీస్ లను రద్దు చేసి పాత పెన్షన్ వీధానని అమలు చేయాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ శేఖర్ బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాప్టో గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలకు గండి కొట్టి ఇబ్బందులకు గురిచేసిన విషయాన్నీ వివిధ మాధ్యమాల ద్వారా ప్రస్తుత గౌరవ ముఖ్యమంత్రి దృష్టికి ప్రతిపక్షం నాయకులు గా ఉన్నప్పుడు తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. ప్రతిగా తాము అధికారం లోకి వచ్చిన వెంటనే అన్ని రకాల పెండింగ్ బాఖయిలను చెల్లిస్తామని , 12 వ వేతన సవరణ కమిషన్ నియమిస్తానని, ఐఆర్ ప్రకటిస్తానని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇంతవరకు ఎటువంటి హామీలు అమలు చేయలేదని కావున సిపియస్, జీపీస్ లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనీ, 12వ వేతనం కమిషన్ ను నియమించి. వెంటనే 30శాతం ఐఆర్ ను ప్రకటించాలని పాఠశాలలో తెలుగు మధ్యమానన్ని కొనసాగించాల అని కోరుతూ రాష్ట్ర వ్యాపిత నిరసన కార్యక్రమం లో భాగం గా బాపట్ల జిల్లా కలెక్టరేట్ వద్ద బుధవారం సాయంత్రం 4 గంటలకు నిరసన కార్యక్రమం ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచారామ క్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

**అమరావతి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** అమరావతిలో పంచారామ క్షేత్రమైన బాల చాముండి సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవాలయంలోని ఉపాలయమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పంచామృత అభిషేకాలను స్వామివారికి నిర్వహించారు. విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. దేవస్థానం ఈవో సునీల్‌కుమార్ భక్తులకు సౌకర్యాలను కల్పించారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.




## ముగిసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు

**రొంపిచర్ల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మండలంలో గత నెల 17 నుండి జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపి మోడల్‌స్కూల్, వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తుతో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అనారోగ్యానికి గురి కాకుండా వైద్యసేవలు, మంచినీటి వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది. మూడు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు ముగిసిన వెంటనే విద్యార్థులు ఉత్సాహంతో సందడి చేశారు. ఒక్కరిపై ఒకరూ గులాలు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూ సందడి చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగియడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన మూడు పరీక్ష కేంద్రాలు చీఫ్‌లకు, ఇన్విజిలేటర్లకు, పోలీస్, వైద్యశాఖల సిబ్బందికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎంఇవో-2, డి.బ్రహ్మేశ్వరరావులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే సిఎం చంద్రబాబు లక్ష్యం : నాగోతు శౌరయ్య

**నరసరావుపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య అన్నారు. పి-4 కార్యక్రమంతో ఖచ్చితంగా పేదల జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. జన్మభూమి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మార్చిన చంద్రబాబు దేశానికే మార్గదర్శకంగా పి-4 కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. తెలుగువారి నూతన సంవత్సరం ఉగాది రోజున గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. తమకు జన్మనిచ్చిన గ్రామాలకు,



ప్రాంతాలకు రుణం తీర్చుకునే అవకాశం ప్రవాస ఆంధ్రులకు, పారిశ్రామికవేత్తలకు ఈ కార్యక్రమంలో లభిస్తుందన్నారు. గ్రామాల దత్తత కార్యక్రమం కూడా గొప్ప కార్యక్రమం అన్నారు. పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలను, కుంటుపడిన గ్రామాల అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు, ఆర్థికంగా స్థితిమంతులు అయినవారు చేయూతనివ్వడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. సుమారు రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, దాతలు, లబ్దిదారులు, ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు భాగస్వాములుగా పి-4ను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ఆయుర్వేదం ఆధారంగా 7రోజుల ఆహార ప్రణాళిక

**విజయవాడ, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం తీసుకోవడం అవసరమని ఇంట్లో తయారైన నెయ్యి కూరగాయల సూప్‌లు ఆకుకూరలు బాదం వంటి ప్రోటీన్‌ల వంటి సహజ వనరులు మరియు సమతుల్య ఆహారం కోసం తీపి పులుపు ఉప్పు చేదు ఘాటు వగరు అనే ఆరు రుచులతో కాలానుగుణంగా ఆహార ప్రణాళికను రూపొందించుకోవడం ద్వారా జీర్ణక్రియ మెరుగుగా ఉండి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆయుర్వేద నిపుణురాలు డాక్టర్ మధుమిత కృష్ణన్ సిఫార్సు చేశారు.

## తెదేపా లక్షరూపాయిల సభ్యత్వం తీసుకున్న రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా

**చిలకలూరిపేట,ఏప్రిల్1,ప్రభాతవార్త:** మాజీమంత్రి,ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పిలుపుమేరకు పట్టణంలో లక్షరూపాయిల సభ్యత్వాలు 100కు చేరుకున్నాయి. మంగళవారం టిడిపి లక్షరూపాయిలు సభ్యత్వాన్ని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా తీసుకున్నారు. ఈ మేరకు సభ్యత్వం కార్డును మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తన నివాసంలో కరిముల్లాకు అందచేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చిలకలూరిపేటలో లక్షరూపాయిల టిడిపి సభ్యత్వం చేర్పించడంలో కరిముల్లా కీలకపాత్ర పోషించారని, పార్టీ కోసం ఎన్నో దశాబ్దాలుగా కష్టపడుతూ ప్రత్తిపాటి ఆదేశాలను అమలుపరుస్తూ పార్టీ పటిష్టతకు కృషిచేసిన వ్యక్తి కరిముల్లా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కామినేని సాయిబాబు, టిడిపి పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, కార్యదర్శి మద్దుమాల రవి, మురకొండ మల్లిబాబు, బేరింగ్ మౌలాలి, కొండా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన తెదేపా రాష్ట్ర కార్యదర్శి

**చిలకలూరిపేట,ఏప్రిల్1,ప్రభాతవార్త:** ఎన్టీఆర్ భరోసా సామాజిక ఫించన్లను టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా అర్హులైన వారందరికి సామాజిక ఫించన్లను ప్రతినెలా 1వ తేదినే వారి గృహాల వద్దకే వచ్చి ఫించన్ సోమ్ము అందచేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్లు

**మాచర్ల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు గ్రామ పంచాయతీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పశువుల నీటి తొట్టెల నిర్మాణ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ ఆదేశాల రాష్ట్రవ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభిం చారు. రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రిశిరెడ్డి, కళ్లం రామాంజిరెడ్డి చేతుల మీదుగా శిరిగిరిపాడు గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.ప్రసాదరావు, వదామి ఏపీఓ రేఖాజ్యోతి, టీఏ నాగులనాయక్, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మునిసిపాలిటీకి పన్నుల ద్వారా రూ.4.3 కోట్ల ఆదాయం

**మాచర్ల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నుల వడ్డీతో 50 శాతం రాయితీ ఇవ్వడంతో మాచర్ల మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక బిల్ కౌంటర్లను ఏర్పాటు చేసి అర్ధరాత్రి 12 గంటల వరకు బిల్లులు కట్టించుకున్నారు. కౌంటర్లను పరిశీలించిన కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ మార్చి 31వ తేదీ, ఏప్రిల్ 1వ తేదీ వరకు ఇప్పటివరకు మున్సిపాలిటీకి పన్నుల రూపంలో 7.5 కోట్లు రావాల్సి ఉండగా రూ.4.3 కోట్లు మాత్రమే వచ్చినట్లు పేర్కొన్నారు.



## శాకాహారం తినండి.. ఆరోగ్యంగా జీవించండి

మాచర్ల టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఆనందం ఉంటుందని హైదరాబాదు పిరమిడ్ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి అన్నారు. జగద్గురువు బ్రహ్మర్షి పత్రీజీ ఆశయ సాధనలో భాగంగా మాజీ ఆర్సీ కేపీ సిద్ధంరాజు జన్మదిన సందర్భంగా మంగళవారు మహా కరుణ శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పిరమిడ్ మాస్టర్లు గాంధీ, సతీష్ బాబు మాట్లాడుతూ సకల జీవరాశుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకై మాచర్లలో ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కేపీ సిద్ధంరాజు, గోపవరపు చలపతిరావు, మంజుల కృష్ణ, పలు గ్రామాల పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ప్లాంటేషన్ ప్రోగ్రాం

**పొన్నూరు, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నారాకోడూరు గ్రామంలోని సీఎంఎస్ చిల్డ్రన్ హోమ్‌లో ప్లాంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎంఎస్ చిల్డ్రన్ హోమ్‌లో మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, బుక్స్, టవళ్ళు, ఇతర విద్యాసామాగ్రిని అందజేశామన్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కల ప్లాంటేషన్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఎన్ఎస్ఎస్ అనేది యువతలో సామాజిక బాధ్యతలు పెంచే ముఖ్యమైన పాత్రను పోషిస్తుందన్నారు. అంతే కాకుండా దేశంలో యువతకు సేవా కార్యక్రమాలపై అవగాహన కలిగేలా, సామాజిక చైతన్యం పెంచే మార్గంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



## పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోండి

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** వివిధ రకాల సామాజిక ఫించన్లు పొందుతున్న లబ్దిదారులు ఫించన్ సొమ్మును సద్వినియోగ పరచుకోవాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు సూచించారు. పట్టణంలో పలు వార్డుల్లో పంపిణీ చేస్తున్న సామాజిక ఫించన్లన కార్యక్రమాన్ని మంగళవారం ఆయన సిబ్బందితో కలసి పరిశీలించారు. అర్హులందరికి ఫించన్లను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పేదలను ఆదుకోవడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నాయన్నారు. లబ్ధిదారులకు సక్రమంగా పింఛన్ సొమ్మును అందించే బాధ్యత సచివాలయ సిబ్బంది, మునిసిపల్ సిబ్బందిపై ఉందన్నారు. సకాలంలో ఫించన్లను అందించడం ద్వారా లబ్దిదారుల ఆశీస్సులు కూడా మెండుగా అందుకోవచ్చని సూచించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## అవ్వారు బుర్రయ్య ధర్మసత్రం ఫౌండర్ ట్రస్టీ మృతి

**పొన్నూరు, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** అవ్వారు బుర్రయ్య ధర్మసత్రం ఫౌండర్ ట్రస్టీ అవ్వారు వెంకట సాంబశివరావు(72) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు అవ్వారు బుర్రయ్య ధర్మసత్రం ఫౌండర్ ట్రస్టీగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి మంచి ఖ్యాతి గడించారు. తమ పూర్వీకులు ఏర్పాటు చేసిన ఈ సంస్థ ద్వారా ఎంతో మందికి సేవలందించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. సాంబశివరావు మృతి వార్త విన్న పట్టణ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## విద్యార్థులకు ఉచిత జూట్ ఉత్పత్తుల తయారీ శిక్షణ

**రాజుపాలెం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** నాగార్జున యూనివర్శిటీ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్స్‌బులిటీ విభాగం ద్వారా పల్నాడు జిల్లాలోని రాజుపాలెం మండలంలోని కొండమోడు గ్రామం నందు విద్యార్థులకు జూట్ ఉత్పత్తుల తయారీ శిక్షణ నిర్వహించారు. ఈ తరగతులను సిఎస్ఆర్ అధికారి డాక్టర్ ఎం.వెంకటరమణ సందర్శించారు. మహిళలతో ఆమె మాట్లాడారు. శిక్షణ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వాటర్ బాటిల్ బ్యాగ్, టెంపుల్ బ్యాగ్, క్యారేజీ బ్యాగు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో శిక్షకురాలు దుర్గ, కెఎన్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ కోనేటి నరసింహారావు పాల్గొన్నారు.



# సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకుల సందడి

**బాపట్ల రూరల్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** సూర్యలంక తీరం మంగళవారం ముస్లిం పర్యాటకులతో పోటెత్తింది. సోమవారం రంజాన్ పండుగ జరుపుకున్న ముస్లింలు మంగళవారం తీరానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. దీంతో తీరం వెంబడి పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. వేలాది సంఖ్యలో వచ్చిన ముస్లిం పర్యాటకులతో కోలాహలంగా మారింది. బాపట్ల నుండి సూర్యలంక తీరం వరకు పర్యాటకులతో రోడ్లన్నీ నిండిపోయాయి. దారి వెంబడి ఉన్న అన్ని హోటల్లు రెస్టారెంట్లు పర్యాటకులతో కిటకిటలాడాయి. ఆదర్శనగర్ నుండి సూర్యలంక తీరం వరకు రోడ్డుకు రెండు వైపులా ఉన్న చెట్ల కింద పర్యాటకులు చేరి సేద తీరారు. అక్కడే వంట వార్పు చేసి భోజనాలు ఆరగించారు. చిన్న పెద్ద పిల్ల పాప ముసలి ముతక అనే భేదం లేకుండా అన్ని వయసుల ప్రజలు ఇక్కడ కు వచ్చి సమయం గడిపారు.



**ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా,,,**

ముస్లింలకు అతి పెద్ద పండుగ అయిన రంజాన్ మరుసటి రోజు బాసి ఈద్ చేసుకోవటం తరతరాలుగా ఆచారం గా ఉంది. బాసి ఈద్ అంటే రెండోరోజు చేసు కునే పండుగను బాసి ఈద్ అంటారు. రంజాన్ పండుగ తర్వాత రోజు కుటుంబ, బంధుమిత్ర సపరివార సమేతంగా పర్యాటక ప్రాంతాలకు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదకరంగా గడిపి సందడి వాతావరణం నడుమ వంటావా ర్పు , చేసుకొని భోజనాలు ఆరగించడం సాయంత్రం పడ్డాక ఇళ్లకు చేరడం ముస్లింల సంప్రదాయం.

**మూడు జిల్లాల నుండి తరలివచ్చిన ప్రజలు :** ఉమ్మడి కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుండి పెద్ద ఎత్తున సూర్యలంక తీరానికి ముస్లిం పర్యాటకులు వచ్చారు. ముస్లిం సాంప్రదాయ దుస్తులు ధరించిన పురుషులు, బుర్ఖాలు ధరించిన మహిళలు పిల్లలు ఇక్కడకు చేరుకున్నారు. సముద్ర తీరానికి చేరుకున్న తరువాత భక్తిశ్రద్ధలతో ఆ భగవంతుడిని ప్రార్థించారు. సర్వ మానవాళి కోసం అల్లాకు దువా చేశారు. అనంతరం సముద్ర స్నానాలు ఆచరించారు. సుమారు 20 వేల మంది పర్యాటకులు వచ్చినట్లు అంచన

**తీరంలో పటిష్ట పోలీసు బందోబస్తు:** బాపట్ల జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక తీరానికి కాలానుగుణంగా పర్యాటకుల రద్దీ పెరుగుతూ వస్తుంది. దీనికి తగినట్టుగా ప్రభుత్వము అధికారులు ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేశారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయి. అలాగే పోలీసు వారు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. తీరంలో అల్లల ధాటికి మునిగిపోకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి నిరంతరం గస్తీ చేపట్టారు. దీంతో పర్యాటకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపారు. రానున్న రోజుల్లో ఇక్కడ పలు ఆకర్షణీయమైన ఆధునికరణమైన సౌకర్యంతమైన ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వము కోట్ల రూపాయలు వేచించేందుకు చర్యలు తీసుకుంది. భవిష్యత్తులో సూర్యలంక తీరం రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపాంతరం చెందుతుంది.

## వైకాపా ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి సాయం నిలిపివేసి ప్రజల జీవితాలతో ఆడుకుంది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఏప్రిల్1,ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి సాయం నిలిపివేసి పేదల జీవితాలతో ఆడుకుందని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారంపట్టణంలోని టిడ్కో గృహాలలో క్యాన్సర్ వ్యాదితో బాదపడుతున్న కనుమూరి శ్రీనివాసరావును ప్రత్తిపాటి స్వయంగా పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ 15లక్షల ఎల్ఓసిని అందచేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ క్యాన్సర్ బాదితుని సోదరుడు కనూమూరి సత్యం ఏన్నో సంవత్సరాలుగా టిడిపి కార్యకర్తగా పనిచేస్తు న్నారని, కార్యకర్త కుటుంబానికి అండగా నిలవాల్సిన బాద్యత తనపై ఉందని అన్న ప్రత్తిపాటి, శ్రీనివాస రావుకు మెరుగైన వైద్య చికిత్స అందేలా చూస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని,ముఖ్యమంత్రి సహాయనిధిని పూర్తిగా నిలిపివేసి ఎంతోమంది పేదల మరణాలకు కారణమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ కరిముల్లా,టిడిపి పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్,కార్యదర్శి మద్దుమాల రవి,మురకొండ మల్లిబాబు, బేరింగ్ మౌలాలి, కొండా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



## గంగన్నపాలెంలోఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

చిలకలూరిపేటరూరల్, ఏప్రిల్1, ప్రభాతవార్త: మండలంలోని గంగన్నపాలెం, కోమటినేనివారిపాలెం గ్రామాలలో తెలుగు దేశం పార్టీ చిలకలూరిపేట మండల అధ్యక్షుడు జవ్వాజి మదన్‌మోహన్ ఎన్టీఆర్ భరోసా పించన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా 64లక్షల మందికి ఫించన్లు అందచేసుందని తెలిపారు.ఒకప్పుడు రూ200 ఉన్న ఫించన్ రూ2వేలకు పెంచిన ఘనతముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో కేవలం వెయ్యిరూపాయిలు మత్రమే పెంచిందని, చంద్రబాబు నాయుడు దానికి రూ4వేలకు పెంచడం జరిగిందన్నారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ3వేల నుంచి రూ6వేలకు పెంచిన ఘనత టిడిపిదేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## చోరీ కేసులో నిందితుని అరెస్టు

**పెదకూరపాడు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** చోరీ కేసులో నిందితుడిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సి.ఐ. తెలియజేశారు. లింగాపురం గ్రామంలో మార్చి 13వతేదీన గుర్తు తెలియని వ్యక్తి షేక్.మీరాభి అనే మహిళ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని బంగారం, విలువైన వస్తువులతో పాటు రూ.40 వేలు నగదును అపహరించాడు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిందితుడు నాగేంద్రకుమార్ అనే వ్యక్తిని ప్రత్యేక టీములు అదుపులోకి తీసుకున్నాయి. అతని వద్ద నుండి 55 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. అయితే రూ.40వేలు నగదును అతను ఖర్చు చేసినట్లు పోలీసులు సి.ఐ. తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధింఆరు.



## పింఛన్లు పంపిణీ చేసిన కూటమి నాయకులు

**సత్తెనపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** పట్టణంలోని 19వ వార్డులో కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పెన్షన్‌లను మంగళవారం అందజేశారు. పెన్షన్ తీసుకుంటున్న భర్త చనిపోతే మరుసటి నెల నుండే భార్యకు ఇచ్చే పెన్షన్‌ను అనుముల రామాంజమ్మకు అందించారు. అదే విధంగా చంద్రపాటి ముత్యాలమ్మకు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ బాషా, ఎమ్యూనిటీ మృధుల, టిడిపి నాయకులు జయరావు, శ్రీనివాసరావు, ఇజ్రాయిల్, నాగేశ్వరావు పాల్గొన్నారు.



## ఉపాధిహామీ పథకంలో భగంగా పశువులకు తాగునీటి తొట్ల ఏర్పాటు

సత్తెనపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం పనులు మండలంలో మంగళవారం నిర్వహించారు. ఈ పథకంలో భాగంగా పశువుల త్రాగునీటి తొట్ల నిర్మాణానికి సంబంధించి తెలుగుదేశంపార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. పెద్దమక్కెన గ్రామంలో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమలో నాయకులు అమరేశ్వరరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కోమటినేని శోభారాణి, సాంబయ్య, సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, గ్రామ కూటమి నాయకులు పి.వి.నారాయణ, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.




## స్మశాన వాటికలు పరిశుభ్రం చేయించాలని మునిసిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేత

**చిలకలూరిపేటటౌన్, ఏప్రిల్1 ,ప్రభాతవార్త:** పవిత్ర ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రతి ఒక్క క్రైస్తవుడు వారియొక్క పూర్వికుల సమాధులను శుభ్రపరుచుకొనటం సాంప్రదాయంగా వస్తున్నందును పట్టణంలోని ఐదు స్మశాన వాటికలను పరిశుభ్రపరచవలసినదిగా పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, కొండా వీరయ్యలు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానికి కలసి వినతిపత్రం చేశారు. స్మశాన వాటికలలో గొట్టపుబావులకు మరమ్మత్తులు చేయించవలసినదిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో గట్టుపల్లి మాణిక్యారావు, శానం శ్రీనివాసరావు, కొండపాటి రమేష్‌బాబు, చందు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో అగ్ని మధనం

**పొన్నూరు, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** పట్టణంలోని తెలగపాలెం శ్రీ కోదండ రామాలయం మహాకుంభాభిషేక మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మాణమైనటువంటి ఈ దేవాలయానికి మహాకుంభాభిషేకం నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆ ప్రాంత భక్తులు చెప్పున్నారు. ఈ దేవాలయంలో మొదట శ్రీ సీతారామలక్ష్మణ సమేత చిత్రపటము మాత్రమే ఉండేదన్నారు. కొన్ని సంవత్సరాలపాటు ఈ చిత్రపటానికి పూజలు నిర్వహించిన అనంతరం సిమ్మెంట్‌తో తయారు చేసిన విగ్రహాలను ఏర్పాటు చేసి కొన్ని సంవత్సరాలు పాటు పూజలు నిర్వహించుకోవడం జరిగిందని నిర్వాహకులు చెప్పారు. 2008వ సంవత్సరం ఫిబ్రవరి 8వ తేదీన విగ్రహాలను ఏర్పాటు చేసి సాంప్రదాయ బద్దంగా, శాస్త్రీయంగా, ఆగమశాస్త్రం ప్రకారం ప్రతిష్టా మహోత్సవాన్ని నిర్వహించు కోవడంతో పాటు ఆలయం ముందు ధ్వజస్థంభాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాటి నుండి ఇక్కడి స్వామివారు భక్తులు కోరిన కోర్కెలను తీరుస్తుండడంతో ప్రతి ఏటా నిర్వహించి అన్ని రకాల పండుగులను నిర్వహిస్తూ ఆలయం దేదీవ్యమానంగా వెలుగొందుతందన్నారు. దేవాలయం నిర్మాణం వంద సంవత్సరాల పైచిలుకు కావడంతో తెలగపాలెంకు చెందిన భక్తులందరూ పార్టీలకు అతీతంగా మహా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించుకునేందుకు ముందుకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. మహాకుంభాభిషేకంలో భాగంగా రెండవ రోజు మంగళవారం ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహము, పంచగవ్య ఆరాధన, పంచగవ్యప్రాసన, వాస్తుపూజ, వాస్తు హోమం నిర్వహించారు. ఆగమశాస్త్రానికి అనుగుణంగా అగ్ని మధనం నిర్వహించి, మధించిన అగ్నిని యజ్ఞకుండములలో చేర్పి హోమ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీనివాసుల శ్రీనివాస దీక్షిత అయ్యంగారు యాజ్ఞీకత్వంలో, దేవాలయం అర్చకస్వామి చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు నేతృత్వంలో కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలను వీక్షించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాలను వీక్షిస్తున్నారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఉభయదాతలుగా పేర్లు నమోదు చేసుకొన్న పలువురు దంపతులు కార్యక్రమంలో పాల్గొని దీక్ష వస్త్రాలతో స్వామివారి కైంకర్యాలలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాలయం శాశ్విత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు అల్లం సాంబశివరావు, ఉపాధ్యక్షుడు అప్పికట్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి శింగంశెట్టి శివ శంకర్ నేతృత్వంలో కమిటి సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.




## పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ

**సత్తెనపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** పట్టణంలో కొవ్వొత్తులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై న్యాయవిచారణ జరగాలన్నారు. క్రైస్తవ సమాఖ్య, యునైటెడ్ ఫాస్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. క్రైస్తవ సంఘాల కాపరులు, నాయకులు కొవ్వొత్తులను చేతబూని అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తాలూకా సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. తాలూకా సెంటర్, గడియారస్తంభం సెంటర్, ఐదు లాంతర్ల సెంటర్, ప్రధాన వీధుల్లో ర్యాలీ జరిగింది. సియోన్ లూథరన్ చర్చి, బాక్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి, షాలీం చర్చి పాస్టర్లు, క్రైస్తవులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## పూరిళ్ళు,వరిగడ్డివామి దగ్ధం

**కొల్లిపర,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తూములూరులో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిళ్ళు..గడ్డివామి దగ్ధం అయ్యాయి.ఈ ప్రమాదంలో రూ.2.35 లక్షలు నష్టం వాటిల్లింది.వివరాల్లోకి వెళ్ళగా తూములూరు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆళ్ళ నాగిరెడ్డి పూరిళ్ళుకు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.ప్రక్కనున్న ఆరుమళ్ళ వెంకటరెడ్డికి చెందిన 5 ఎకరాల వరిగడ్డి వామి ముట్టుకుంది.ఈ ప్రమాదంలో నాగిరెడ్డికి చెందిన పూరిళ్ళు దగ్ధం కాగా కట్టుబట్టలతో మిగిలిపోయాడు.వెంకటరెడ్డి వరిగడ్డి వామి పూర్తిగా దగ్ధం అయ్యింది.ఈ ప్రమాదంలో 2 లక్షల 35 వేల రూపాయలు వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.



## ఉచిత మహాప్రస్థాన వాహన పున:ప్రారంభం

**తాడేపల్లి,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** తాడేపల్లి పట్టణంలో డాక్టర్ వైఎస్సార్ అండ్ కెవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఉచిత మహాప్రస్థాన వాహనాన్ని పున:ప్రారంభించిన పట్టణ వైఎస్సార్‌సీపి అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి.డాక్టర్ వైఎస్సార్ అండ్ కెవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు గుంటూరు టెలికాం మెంబర్ "కళ్ళం రాజశేఖర్‌రెడ్డి" ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణంలో ఎనో న్న సంవత్సరాలుగా డాక్టర్ వైఎసా ్సర్ అండ్ కెవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.దీనిలో భాగంగా "ఉచిత మహాప్రస్థానం" వాహానం కొన్ని అనివార్య కారాణాల వల్ల ఆగటం జరిగింది.దీంతోపట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో మరలా అందుబాటులోనికి తీసుకురావాలనే ఆలోచనతో సుమారు రూ.5లక్షలు వెచ్చించి ఉచిత మహాప్రస్థానం వాహనాన్ని అందుబాటులోనికి తీసుకొచ్చారు.ఈ వాహనాన్ని ఆదివారం ఉదయం 8.30గంటలకు స్థానిక వైఎసా ్సర్‌సిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర ్భంగా వారు మాట్లాడుతూ కళ్ళం రాజశేఖర్‌రెడ్డి తాడేపల్లి పట్టణంలో అనేక సంవత్సరాల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిసు ్తనా ్నరని దీనిలో భాగంగా ఉచిత మహా ప్రస్థానం వాహనాన్ని ఈరోజు ప్రారంభించడం జరిగిందని ఈ సేవా కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ కళ్ళం రాజశేఖర్‌రెడ్డి ని అభినందించారు.కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు,రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్,పార్టీ సీనియర్ నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి,దొంతిరెడ్డి శ్రీరామ్‌రెడ్డి (గాంధీ),నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షు/ బందాపు రుక్మాంగరెడ్డి,బిసి నాయకులు బత్తుల దాసు,బందాపు శ్రీనివాసరెడ్డి,స్థానికులు పాల్గొన్నారు.



# విశ్రాంత ఉద్యోగులకు ఎస్పీ సత్కారం

**నరసరావుపేట క్రైం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** పోలీస్‌శాఖలోని విశ్రాంత ఉద్యోగులకు మంగళవారం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం జరిగింది. ఉద్యోగ విరమణ చేసిన సురేంద్రనాథ్ బెనహర్‌బాబును ఆయన అభినందించారు. పోలీస్‌శాఖలో ఎన్నో ఆటుపోటులను తట్టుకొని



ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. 35 సంవత్సరాల వయస్సు వివిధస్థాయిలలో పోలీస్‌శాఖకు సేవలందించడం విశేషమన్నారు. నక్సలిజంతో పాటు రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉండే సమయంలో సైతం విజయవంతంగా విధులు నిర్వహించడం భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయమని ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.వి.సంతోష్, సత్తిబాబు, ఏవో రామారావు, డిఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, పోలీస్ అధికారులు పి.మాణిక్యాలరావు, ఎస్.కృష్ణ, గోపినాథ్ పాల్గొన్నారు.

# పట్టణ ఆర్యవైశ్యసంఘం, వాసవీసేవాసంఘ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మ్యాంగో జ్యూస్ పంపిణీ

**చిలకలూరిపేట,ఏప్రిల్1,ప్రభాతవార్త:** పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవీసేవాసంఘ్



ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా ఆర్‌విఎస్ సివిఎస్ హైస్కూల్ వద్ద ఏర్పాటుచేసిన వాసవి ధర్మచలివేంద్రంలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం నాటినుండి పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు మజ్జిగ, ఇతర శీతలపానియాలు ప్రతిరోజు పంపిణీ చేస్తున్నారు. కాగా మంగళవారంతో పరీక్షలు ముగిస్తున్న సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖ దస్తావేజు లేఖరి దివంగత చేబ్రోలు నారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు చేబ్రోలు వెంకటేశ్వరరావు, శ్రీలత, విష్ణుసాయి, సాయి సమన్విత సహకారంతో షుమారు 800 మంది విద్యార్థులు, పాదాచారులకు మ్యాంగోజ్యూస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొత్త కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి దాతకు, సభ్యులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోరాచుమల్లు సూర్యారావు, కొప్పురావూరి కుమార్, గ్రంధి సుబ్బారావు, చిలకల రామలింగేశ్వరరావు, సువర్చలా దేవి, అనంతలక్ష్మి, బాలనాగు సాంబశివరావు, పొట్టి సుబ్బారావు, జోషిత్, కిషోర్, రోహిత్ పాల్గొన్నారు.

# పింఛన్లు పంపిణీ చేసిన 22వ వార్డు తెదేపా నాయకులు

**చిలకలూరిపేట,ఏప్రిల్1,ప్రభాతవార్త:** భర్త చనిపోయిన వెంటనే భార్యకు వితంతు పెన్షన్ వెంటనే ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాట ప్రకారం, మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి ఆదేశాల మేరకు మంగళవారం 22వ వార్డు హనుమాయమ్మ సత్రంలో మూడు నెలల ఫించన్‌ను రూ 12వేలు టిడిపి నాయకులు లబ్ధిదారుకు అందచేశారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ కూనల ప్రమీల,టిడిపి నాయకులు సాంబయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్‌కు పలువురి అభినందనలు

**మంగళగిరి,ఏప్రిల్1,ప్రభాతవార్త:** మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నియమితులైన జవ్వాది కిరణ్ చందుకు అభినందనలు తెలిపిన వారు ఓబీసీ జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ.. శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ భోగి కోటేశ్వరరావు, రాష్ట్రీయ గో సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదాల వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు నల్లగోర్ల శివరామకృష్ణ, బిజెపి నాయకులు బోయిన రాజేంద్రప్రసాద్ తదితరులు



# నూతన పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందహేల

**ఎ కొండూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో కొత్తగా లబ్ధిదారులకు మంజూరైన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామ పంచాయతీ వార్డులో తెలుగుదేశం పార్టీ శ్రేణులు నాయకులు మంగళవారం పండుగ వాతావరణంలా పంపిణీ చేశారు. చీమలపాడు గ్రామంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు మండల బిసి నాయకుడు బెజవాడ శంకర్, గ్రామ పార్టీ సెక్రటరీ జంగా కిషోర్ పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి 3 నెలలకు మంజూరైన రూ.12వేలు ఒక్కో లబ్ధిదారుడికి పంపిణీ చేశారు. కొత్తగా కూటమి ప్రభుత్వంలో పెన్షన్‌లు మంజూరు కావడం పట్ల పేదల కళ్లల్లో ఆనంద భాష్పాలు జాలువారాయి.



# రంజాన్ నెలలో మొహిద్దీన్ సామాజిక సేవా ధార్మిక సేవా అమోఘం

## ముస్లీం మత పెద్దల ప్రశంసలు

**ఎ కొండూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు జామియా మస్జిద్ ప్రెసిడెంట్ మొహిద్దీన్ పవిత్ర రంజాన్ మాసంలో జామియా మస్జిద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మస్జిద్ అభివృద్ధికి, అలాగే నెలరోజుల పాటు కఠోర నియమ నిష్టతో ఉపవాసాలు (రోజా) పాటించిన దీక్షాపరులకు ఇఫ్తార్, సహరీ ఏర్పాట్లు ఈ నెలలో వచ్చే లైలతుల్ ఖాదర్ బేసి రాత్రుల్లో జాగారం ప్రత్యేక ప్రార్థనలు నమాజ్ నిర్వహించే దీక్షాపరులకు ఎన్నడూ లేని విధంగా ప్రజా ప్రతినిధుల సాకారంతో అలాగే రంజాన్ ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లీం సోదరులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా మ్యాట్‌లు, ఎసి కూలర్లు తాగునీరు వయో వృద్ధులకు నమాజ్ కుర్చీలపై చదివే విధంగా వారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయడం పట్ల ప్రెసిడెంట్ మొహిద్దీన్ ఆధ్యాత్మిక సేవ, ధార్మిక సేవా సమాజసేవ పట్ల అందరి మన్ననలు పొందిన మొహిద్దీన్‌లు స్థానిక జామియా మస్జిద్‌లో శాలువలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మత గురువులు ముహమ్మద్ లియాఖత్ హుస్సేన్ రజ్వీఖాద్రి అస్లం రజాఖాద్రీ సాహెబ్, సుభాని సాహెబ్, రఫీబాయ్, తదితర ముస్లీం మత పెద్దలు, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# పశువులతొట్టి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన తెదేపా నేత హరిబాబు

**సంతనూతలపాడు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామంలో మంగళవారం నాడు పశువుల సంరక్షణ నిమిత్తం ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద ఏర్పాటు చేసిన పశువుల తొట్టి నిర్మాణానికి మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు శంకుస్థాపన చేశారు. స్థానిక చెరువు సమీపంలో ఈ పశువుల తొట్టి నిర్మాణాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ డి.హరిబాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, ఈసీ బాబు, గ్రామటీడీపీ అధ్యక్షులు అబ్బూరి శ్రీనివాసరావు, ఎన్ఎస్‌పీడీసీ సంఘం అ్యక్షులు నల్లూరి కృష్ణారావు, టీడీపీ నాయకులు నల్లూరి నారాయణ, వలేటి రవి, బొడ్డపాటి చంద్రశేఖర్‌లు, టిపి చెన్నమ్మ, ఎఫ్ఏ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు

**దర్శి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** దర్శి పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం పెన్షన్ పంపిణీ చేసిన దర్శి నాయకులు, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే పింఛన్లు పంచడం జరిగిందని, అవ్వాతాతలకి బడుగు, బలహీన వర్గాలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, నాయకులు యాదగిరి వాసు, సంగా తిరుపతిరావు, జి.స్టీవెన్, ఇత్తడి దినకర్ నక్క రంగా,జూపల్లి కోటేశ్వరరావు, నారపుశెట్టి మధు, బెల్లం శ్రీనివాసరావు, ఊరుబిండి మధు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# నిషేధిత క్యారీబ్యాగులు విక్రయిస్తే కఠిన చర్యలు

## -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** నిషేధిత క్యారీబ్యాగులు విక్రయించినా, ఉపయోగించినా ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య చట్టం 1965ను అనుసరించి జరిమానా విధించడంతోపాటు



అవసరమైన కేసులు కూడా నమోదు చేస్తామని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు హెచ్చరించారు. పట్టణంలో సింగిల్‌యూస్ క్యారీ బ్యాగులను పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. ఎవరైనా నిషేధిత క్యారీ బ్యాగులు కలిగి ఉన్నట్లయితే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. క్యారీ బ్యాగుల నిషేధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వర్ణపురి పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడంలో మునిసిపల్ అధికారులకు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. నిడుబ్రోలు ఓవర్ బ్రిడ్జి సమీపంలోని పండు టీ స్టాల్‌లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్లు గుర్తించి, సంబంధిత యజమానికి రూ.2వేలు జరిమానా విధించామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 2015కోట్ల టర్నోవర్ సాధించిన సంగం డెయిరీ

**పొన్నూరు, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి సంగం డెయిరీ 2015కోట్ల టర్నోవర్‌ను సాధించిందని సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చెప్పారు. స్థానిక సంగం డెయిరీలో ఈ సందర్భంగా ఉద్యోగులతో ఈ ఆనందాన్ని కేక్ కట్ చేసి పంచుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నాటి అధికార పార్టీ డెయిరీపైన, తనపైన వేధింపులకు దిగిందనీ, తనను మానసికంగా, డెయిరీని ఆర్థికంగా బెబ్బతీయాలనే కుట్రతో ఆరోపణలు చేసి, అరెస్టు చేసి జైలులో పెట్టించదన్నారు. అయినప్పటికీ ఉద్యోగులు ఎక్కడా వెనుకడుగు వేయకుండా సమర్థవంతంగా నాటి అధికార పార్టీ కుట్రలను



ఛేధించారన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2,500కోట్లు టర్నోవర్ సాధించే విధంగా కృషి చేయాలని కోరారు. పలువురు సంగం డెయిరీ ఉద్యోగులు మాట్లాడుతూ సంగం డెయిరీ చైర్మన్‌గా ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఉండడం వల్లే ఇంతటి ఘనత సాధించేందుకు కారణమైందన్నారు. నరేంద్రకుమార్ హయాంలో రూ.200కోట్ల నుంచి రూ.2వేల కోట్లకు పెరిగిందన్నారు. డెయిరీ అనుబంధ పాల పొడి కేంద్ర సామర్థ్యాన్ని పెంచడంతోపాటు పలు నూతన పాల ఆధారిత ఉత్పత్తులు మార్కెట్‌లో ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో సంగం డెయిరీ ఒక ప్రముఖ స్థానాన్ని సంపాదించిందని కొనియాడారు. చైర్మన్ ధూళిపాళ్ళ కేక్‌ను కట్ చేసి సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్‌కు, సిబ్బందికి పంచిపెట్టారు.

# పాస్టర్ ప్రవీణ పగడాల మరణంపై హైకోర్టు విశ్రాంత జడ్జిలతో విచారణ జరిపించాలి

**గుంటూరు విద్య,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** ప్రవీణ్ పగడాల మరణం విషయంలో రిటైర్డ్ హైకోర్టు జడ్జిలతో జ్యూడిషియల్ ఎంక్వయిరీ చేయించాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజాసుందరబాబు పలు దళిత క్రైస్తవ సంఘాలతో కలసి పాత్రికేయుల సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐక్యఇత్వ ఐడియా నేషనల్ దళిత క్రిస్టియన్ వాచ్,ఎమ్మార్పిఎస్,మాల మహానాడు,క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటి,రాష్ట్రీయ మహాజన



సమితి,తదితర క్రైస్తవ దళిత ప్రజాసంఘాల నేతలు,పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. పాత్రికేయుల సమావేశం తదనంతరం,నాలుగు డిమాండ్‌తో కూడి వినతిపత్రాన్ని వాచ్ నాయకురాలు ఆధ్వర్యంలో డాక్టర్ రాజసుందర బాబు సమక్షంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఉద్దేశించిన నాలుగు పేజీల వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. వినతిపత్రంలో నాలుగు రోజుల క్రితమే ప్రాథమిక పోస్టుమార్టం నివేదిక పోలీసులకు అందిన,పాస్టర్ ప్రవీణ్ పగడాల ఎప్పుడు చనిపోయారో ఇంతవరకు పోలీసు యంత్రాంగం బయట పెట్టడం లేదన్నారు.ఎనిమిది రోజులుగా పెద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అంతర్జాతీయ క్రైస్తవ సువార్తికుడిగా పేరు తెచ్చుకొని,పలుదేశాల్లో గుర్తింపుపొందిన పాస్టర్ ప్రవీణ్ పగడాలను హత్య చేసి ఆయనను తాగుబోతుగా చిత్రీకరించి ఆయన కీర్తిప్రతిష్టలను తుంగలో తొక్కే పెద్దడ్రామా నడుస్తుందని డాక్టర్ రాజ సుందర్‌బాబు విమర్శించారు. ఒక పక్క తన సోదరుడు విజయవాడ నుండి కొవ్వూరు దాక చేరుకున్న మోటార్ బుల్లెట్ పైన డ్రైవ్ చేసిన వ్యక్తి తన సోదరుడు కాదని పాస్టర్ ప్రవీణ్ పగడాల సోదరి అరచి గోల పెడుతుంటే పోలీసుల కోణంలో పరిశీలించడం లేదని డాక్టర్ రాజా సుందర్ బాబు ఆందోళన వెలిబుచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న తంతు అంతా కూడా,ప్రవీణ పగడాల హత్య జరగేలేదని కేవలం తాగిన మైకంలోనే ఆయన యాక్సిడెంట్ గురై ప్రాణాలు కోల్పోయాడనే ప్రజలకు నమ్మబలికే వ్యవహారం నడుస్తుందని డాక్టర్ రాజా సుందర్ బాబు అన్నారు.నేషనల్ దళిత్ క్రిస్టియన్ వాచ్ జాతీయ నాయకురాలు గద్దె రత్నశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దళితులు క్రైస్తవులు అందరూ కూడా కలసి ఒకే వేదిక మీదకు వచ్చి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.మతంలో ఉన్న మంచిని తీసుకొని మతాల్లో ఉన్న చెడును వదిలివేసి దేశంలోని ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎమ్మార్పిఎస్ నాయకులు రమేష్,ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి నాయకులు రవికాంత్,తదితరులు ఉన్నారు. నాయకులందరూ మాట్లాడుతూ ప్రభుత్వం పాస్టర్ పగడాల ప్రవీణ్ విషయంలో న్యాయం చేయకపోతే రాష్ట్రంలో భారీ ఎత్తున క్రైస్తవులు ఉద్యమిస్తారని హెచ్చరించారు.

# 2నుండి ఉర్సు మహోత్సవాలు

**ఎ కొండూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** నఖీబుల్ ఔలియా బాబా హజరత్ ఖ్వాజా ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ అవులియా (ర.అ) వారి ధర్మపత్ని మహోన్నత సూఫీ మహనీయ జనని మొహమ్మద్ ఖ్రమున్నీసా బేగం (ర.అ) చీమలపాడు వారి సూఫీ ధర్మక్షేత్రం పావన 4వ దివ్య సూఫీ సుగంధ ఉర్సు మహోత్సవ్ ఈ నెల 2,3,4 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎఎఎంటికె దర్బార్ అండ్ దర్గా పీఠాధిపతి అతావుల్లా బాబా ఆధ్యాత్మిక వారసుడు ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ మంగళవారం మీడియాకు తెలిపారు. 2న ఉర్సు ఉత్సవ్ ప్రారంభం దివ్య ఖురాన్ పఠనం, 3న దివ్య ఖురాన్ పఠనం, ఉర్స్ సందల్ (గంధం) అతావుల్లా షాఖాదరీ బాబా శాశ్విత దివ్య విశ్రాంతి మందిరంలో పవిత్ర పుష్పాంజలి, సూఫీ సుగంధం సందల్ ఊరేగింపు, పుష్పాంజలు పవిత్ర పతాక ప్రతిష్టాపనం, 4న నఖీబుల్ ఔలియా హజ్రత్ అతావుల్లా బాబా (ర.అ) వారి ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ వారి ఆధ్యాత్మిక సందేశం ఉర్సు ముగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు నిరంతర అన్నప్రసాద వితరణ ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి కులమతాల కతీతంగా వచ్చే వేలాది మంది భక్తులకు బాబా జాన్ అమ్మాజాన్ ఆశీస్సులు అందుకోవాలని అందరికి ప్రేమ పూర్వక ఆహ్వానంగా భావించి తరలివచ్చి దిగ్విజయం చేయాలని పీఠాధిపతి మొహియుద్దీన్ పిలుపునిచ్చారు.

# మునిసిపల్ కార్మికుల ధర్నా,ర్యాలీ

**తిరువూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** ఆప్కాస్ రద్దు ప్రైవేట్ ఏజెన్సీకి అధకారాలు కట్టబెట్టే చర్యలు విడనాడి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నాలు, తిరువూరు పట్టణంలో ర్యాలీ చేసి అనంతరం చీరాల సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఆ క్రమంలో సిఐటియు నాయకులు బి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి6వ తేదీన రాష్ట్ర




ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేసి పరుగు సేవలకు సిబ్బందికి నియమకాలు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని తీర్మానం చేసినట్లు పత్రికలో వార్త వచ్చింది మొదలు ఆప్కాస్‌లో పనిచేస్తున్న కార్మికులందరూ తీవ్ర ఆందోళనకు గురయ్యారని ఆప్కాస్ కన్నా మెరుగైన సేవలు అందించాలాంటే భద్రత లేక జీతాలు ఎప్పుడిస్తారో తెలుసుకోలేక ఆందోళన చెందే కార్మికులను మెరుగైన సేవలకు పర్మినెంట్ చేయటమే పరిష్కారమని అన్నారు. మున్సిపల్ నాయకులు రమణ సామ్రాజ్యం గురవయ్య నరసరావు దుర్గారావు వెంకట రమణ విజయమ్మ వెంకటకృష్ణ నాగరాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందబాబు

**కొల్లూరు, ఏప్రిల్ 1 (ప్రభాతవార్త) :** మండల పరిధిలోని దోనేపూడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటికి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార క్రమంలో కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ



అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కొల్లూరు మండల మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, ఎంపీడీవో నరసింహారావు, పంచాయితీ ఇన్‌చార్జి కార్యదర్శి బి.మల్లిఖార్జున్, సంగం డైయిరీ డైరెక్టర్ గుత్తికొండ జ్ఞానానంద భగవాన్, మహేష్, సుంకర రామ్మోహన్‌బాబు, కొల్లూరు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవికాలంలో గర్భిణీలు తగిన జాగత్తలు తీసుకోవాలి

## -మండల వైద్యాధికారి సుమంత్



**కొల్లిపర,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** వేసవికాలంలో గర్భిణీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు.మంగళవారం మండల పరిధిలోని తూములూరులో వైద్యాధికారులు ప్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌సీ భారతి,ఏఎన్ఎం లలిత,హెల్త్ అసిస్టెంట్ సుదర్శన్,డీఈవో బొమ్ము కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు వనలక్ష్మి,ప్రమీల,తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పేదలు ఉపాధి పదకాన్ని సద్వినియోగించుకోవాలి : ఎంపిడిఓ విజయలక్ష్మీ

**కొల్లిపర,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** పేద ప్రజలు ఉపాధి హామీ పదకాన్ని సద్వినియోగించుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని అత్తలూరి వారిపాలెం,వల్లభాపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా నిరుపేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు.పేదప్రజలకు ఉపాధి కల్పించటానికే ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.



# కవి వెంకటనరసయ్య యువతకు ఆదర్శం

**పెదకూరపాడు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** కవి వెంకటనరసయ్య యువతకు ఆదర్శమని క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బెల్లంకొండ రామ్‌గోపాలరావు అన్నారు. మంగళవారం లైబ్రరీ సెంటర్‌లో పెదకూరపాడు అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో వెంకటనరసయ్య జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వెంకటనరసయ్య కవితల ద్వారా గ్రామానికి ఆయన మంచిపేరు తీసుకువచ్చారని తెలిపారు. ప్రజాకవి దర్శి శేషారావు మాట్లాడుతూ సమాజంలో ఉన్న రుగ్మతలను తన కవితల ద్వారా ఆయన చీల్చిచెండాడారన్నారు. కార్యక్రమంలో శేషారావు, అప్పారావు, నాగేశ్వరరావు, మస్తాన్‌రావు, పొట్టి శ్రీనివాసరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# ఆచార్య చెన్నారెడ్డి రచించిన స్వప్న సాగరం నవల ఆవిష్కరణ

**గుంటూరు,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** వర్సిటీలోని ఆంగ్ల విభాగంలో ఆచార్యునిగా సేవలందిస్తునన ప్రముక రచయిత ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి "స్వప్న సాగరం" నవలను రచించారు. భారతదేశంలోనే తొలి ద్వితీయ పురుష రచనాశైలిలో వెలువరించిన ఏకైక నవలగా ఈ స్వప్న సాగరం నవల నిలుస్తుందని ఆచార్య చెన్నారెడ్డి వెల్లడించారు.ఈ నవలను ఇన్‌చార్జీ విసి ఆచార్య గంగాధరరావు ఆవిష్కరించారు .ఇన్‌చార్జ్ రెక్టార ఆచార్య కె.రత్నషీలా మణి,ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం,ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్‌లకు అందించారు.ఈ సందర్భంగా విసి మాట్లాడతూ తన రచనలతో సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న చెన్నారెడ్డి సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు.రిజిస్ట్రార్ మాట్లాడుతూ చెన్నారెడ్డి ఇప్పటికే 215 పరిశోదక వ్యాసాలురాసితన ఆధ్వర్యంలో 42డాక్టరేట్లను పూర్తి చేయించారని విద్యారంగపై మక్కువతో రచనలపై అభిలాషతో ఎన్నో రచనలు సైతం చేస్తున్నారని కొనియాడారు.కార్యక్రమంలో వర్సిటీ ఏఈ కృష్ణ,డాక్టర్ బసవేశ్వరరావు,డాక్టర్ అచ్చిబాబు,పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కోర్సులు మూసేస్తే కోర్టులో కేసులు వేస్తాం...

## -పిజి డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ పరిరక్షణ జేఏసి అల్టిమేటం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** వర్సిటీలో పీజీ న్యాయశాస్త్ర విభాగంలో రెండు బ్రాంచీలను తొలగిస్తూ గత నెల 29న అకడమిక్ సెనెట్ నిర్ణయం తీసుకుంది.ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పీజి న్యాయ శాస్త్ర విద్యార్థులు మంగళవారం ఇన్‌చార్జ్ విసి,ఇన్‌చార్జ్ రెక్టార్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ లను కలసి వినతి పత్రాన్ని అందజేశారు.ఎల్ఎల్ఎంలో కొన్ని కోర్సులను ఈ విద్యాసంవత్సరం నుంచి నిలిపివేసున్నట్లు వార్తలను చదివి దిగ్భ్రాంతికి లోనయ్యాయన్నారు.మా విజ్ఞప్తిని తమరు పరిశీలించక కాలయాపన చేస్తే విద్యార్థులందరూ సంఘటితమై మా యొక్క ప్రాణాలను ఫణంగా పెట్టి న్యాయవిభాగాన్ని కాపాడుకోవడానికి ఏమాత్రం వెనుకంజ వేసే ప్రశ్న లేదని మీ దృష్టికి తీసుకువస్తానికి మేము చింతిసున్నప్పటికీ, పెద్ద మనసుతో తమరు ఆ పరిస్థితి తలెత్తనీయకుండా కోర్సుల ఉపసంహరణ విరమించుకోవలసిందిగా కోర్సులను రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి కేసు వేసేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యార్థులు స్పష్టంచేశారు.



# లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్లు పంపిణీ చేస్తున్నాం : పి.వెంకటనారాయణ

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** బ్ధిదారులకు సకాలంలో పెన్షన్‌లు పంపిణీ చేస్తున్నారని కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది కూడ తమ పరిధిలో ఉన్న పెన్షన్‌దారులందరికీ శనివారం ఉదయం నుండి పెన్షన్‌లు పంపిణీ చేస్తున్నారని ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) పి.వెంకటనారాయణ పేర్కొన్నారు. సర్కిల్-3 పరిధి లోని పుష్ప హోటల్ సెంటర్‌లో ఆయన తన చేతుల మీదుగా పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు నగరపాలక సంస్థ పరిధి లోని సర్కిల్-1 పరిధిలో ఉన్న 20,370 పెన్షన్‌లకు గాను 19,357,సర్కిల్-2 పరిధిలో ఉన్న 25,666 గాను 24,365,సర్కిల్-3 పరిధిలో ఉన్న 20,363కు గాను 19,251 పెన్షన్లను పంపిణీ చేశారని, మిగిలిన వాటిని కూడ సత్వరమే పూర్తి చేసి పెన్షన్‌ను లబ్ధిదారులకు సత్వరమే అందిస్తారని తెలిపారు.



2-4Pg5.qxd:2-4Pg5.qxd 01/01/01 6:53 AM Page 1



# నెలాఖరుకల్లా బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నిక!

## పది నెలలుగా పెండింగ్‌లోనే..



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** భారతీయ జనతాపార్టీకి సుదీర్ఘకాలంగాపెండింగ్‌లో ఉన్న జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ఈ నెలాఖరుకు పూర్తి అవుతుందని అంచనా. గడచిన పదినెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈ బిజెపిదేశాధ్యక్షుడి ఎన్నికకు కసరత్తులు ముమ్మరంచేస్తున్నారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన వెంటనే బిజెపి ఇక సంస్థాగత కార్యక్రమాలపై ఫోకస్ పెంచుతోంది. ఎన్నికలు ఇప్పటికే ట్రాక్‌లోకి వచ్చాయి. గత నెల 15వ తేదీనాటికే జరగాల్సి ఉన్నప్పటికీ పార్లమెంటు సమావేశాలకారణంగా వాయిదాపడింది. మొత్తం 13 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించారు. మిగిలిన 13 రాష్ట్రాల సంస్థాగత అధ్యక్షుల ఎన్నిక పూర్తి అయిన వెంటనే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక మొదలవుతుంది. వచ్చే వారంరోజుల్లోనే మిగిలి ఉనన కీలక రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో రాష్ట్ర చీఫ్‌లను ప్రకటిస్తారు. మొత్తం 19 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించిన తర్వాత పార్టీపరంగా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ప్రారంభం అవుతుంది. బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు 50 శాతం రాష్ట్రాల సంస్థాగత ఎన్నికలు పూర్తి చేసుకుని రాష్ట్రాల చీఫ్‌లను ప్రకటించి ఉండాలి. అంతకుముందే బూత్, మండల్, జిల్లాస్థాయిలో ఎన్నికలు పూర్తి చేసి ఉండాలి. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డా బిజెపి జాతీయ అధ్యక్షుడుగా 2019లో బాధ్యతలు చేపట్టారు. 2020లో ఆయన బిజెపి జాతీయ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత హోంమంత్రి అమిత్‌షానుంచి ఆయన పాలనపగ్గాలుచేపట్టారు. ఆ తర్వాత ఆయన పదవీకాలం 2024 జూన్‌వరకూ పొడిగించారు. ఆకాలంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున సంస్థాగత ప్రక్రియను వాయిదావేసారు. ఇక కేంద్రకేబినెట్‌లోకి ఆయన్ను చేర్చుకోవడంతో ఇపుడు జోడుపదవులకు బ్రేక్‌చెపుతూ అర్హుడైన జాతీయ నాయకుడికోసం అన్వేషణ సాగుతోంది. ఈప్రక్రియలో బిజెపి కులాల సమీకరణ చూడాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇటీవలి కాలంలో పెరిగిపోయిన ఉత్తర దక్షిణ వివాదాలను కూడా సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలి. అలాగే పునర్విభజన, భాషా వివాదాలను కూడా పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. ఉత్తరప్రదేశ్‌లో పార్టీబేస్‌ను మరింత శక్తివంతంచేసుకునేందుకు ఇప్పటికే బిజెపి ఒత్తిడి ఎదుర్కొంటున్నది. లోక్‌సభ ఎన్నికల్లో కొంతమేర పార్టీకి విఘాతం కలిగిన సంగతి తెలిసిందే. యుపిలో సీట్లు మెజార్టీ సాధిస్తే లోక్‌సభలో సింగిల్ హ్యాండెడ్‌గా నడుస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు. అన్నివర్గాలకు ఆమోదయోగ్యుడయిన వ్యక్తి పార్టీ అధ్యక్షుడిగా రావాలి. బిజెపి సైద్ధాంతిక గురువు రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ ప్రభావంతోపాటు సంస్థాగత విలువలను పరిరక్షించుకుంటూ ముందుకుపోయే నాయకుడి అన్వేషణకు బిజెపి ఇప్పటినుంచే మొదలు పెట్టింది.

# ఒకరి అరెస్టు తప్పదు

**ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు**




**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డిఒజిఇ) శాఖ సారథిగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోషల్ సెక్యూరిటీ నిధుల దుర్వినియోగంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ సెక్యూరిటీ డేటాబేస్ నుంచి 4 లక్షల నంబర్లు దొంగలించిన వ్యక్తి రేపు అరెస్టు అవుతారని పేర్కొన్నారు. మస్క్ మాట్లాడిన ఒక వాయిస్ నోట్‌ను డోజ్ డిజైనర్స్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఆడియో ప్రకారం 'రేపు ఒకరిని అరెస్టు చేయ బోతున్నారు. అతడు సోషల్ సెక్యూరిటీ డేటా బేస్ నుంచి 4 లక్షల సోషల్ సెక్యూరిటీ నం బర్లను, వ్యక్తగత సమాచారాన్ని దొంగలించి, విక్ర యించాడు. ఇది వలసదారులను అక్రమ ఓటర్లుగా మార్చే వేదికగా మారింది' అని మస్క్ పేర్కొన్నారు. అమెరికా పౌరులు ఆని ప్రజలకు వీటిని అందించి తమకు ఇష్టమైన వ్యక్తులకు ఓటు వేసేలా ప్రేరేపిస్తున్నారని మస్క్ ఆరోపించారు. ఈ సందర్భంగా మస్క్ డెమోక్రాట్లపైనా పలు విమర్శలు చేశారు. అక్రమ వలసదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేందుకు డెమోక్రాట్లు ప్రభుత్వంలోని ప్రతిదాన్ని వినియోగించార న్నారు. జాతీయ విపత్తులు నుంచి దేశంలోని పౌరులను రక్షించేందుకు ఫెమాకు అందించే నిధులను సైతం దారి మళ్లించారని ఆరోపించారు. వాటిని న్యూయార్క్‌లోని లగ్జరీ హోటల్స్‌లో అక్రమ వలసదారులను ఉంచేందుకు వినియోగించారన్నారు. గతంలోనూ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ మస్క్ ఇదే వ్యాఖ్యలు చేశారు. ఇక ఈ అంశంపై దర్యాప్తు సంస్థలు ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఇటీవల కాంగ్రెస్‌లో ప్రసంగించే సమయంలో సోషల్ సెక్యూరిటీ నిధుల దుర్వినియోగంపై ట్రంప్ పలు వ్యాఖ్యలు చేశారు. భారీ స్థాయిలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలిందన్నారు. సోషల్ సెక్యూరిటీ మాజీ కమిషనర్ ఆస్ట్రూ దీనిపై స్పందించారు. ట్రంప్ యంత్రాంగానికి సోషల్ సెక్యూరిటీపై సరైన అవగాహన లేదని విమర్శించారు. దీనికి ఉపయోగించే పాత, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై డోజ్ బృందానికి నైపుణ్యం లేదన్నారు.

# భూకంప మృతులు 2719 పైనే..!

## మరో 441 మంది ఆచూకీ గల్లంతు

## తీవ్రగాయాలతో చికిత్సపొందుతున్న 4521 మంది క్షతగాత్రులు




**నాయ్‌పైథా(మైన్మార్), ఏప్రిల్ 1:** మైన్మార్‌లో సంభవించినభూకంపాలలో మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతవారంలో వచ్చిన ఈ భూకంప ధాటికి 2719 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సూనిక ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో ఐదేళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారని తెలిపాయి. 4521 మంది గాయపడగా 441 మంది ఆచూకీ ఇప్పటికీ లభించాల్సి ఉంది. సైనికపాలన అంతర్యుద్ధాలతో మగ్గిపోతున్న మైన్మార్‌ప్రజలపై గత వారం సంభవించిన భూకంపం తీవ్రప్రభావమే చూపించింది. ప్రాణ, ఆస్థినష్టం భారీస్థాయిలో ఉంది. సహాయక బృందాలు చేరుకోలేని ప్రాంతాలు ఇప్పటికీ అనేకం ఉన్నాయి. మాండలే వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం వెలువడుతోంది. మండుటెండలో ఉత్త చేతులతో చిన్నచిన్న పారలతో శిథిలాలను తొలగిస్తూ ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమో తెలుసుకునేందుకు వారి కుటుంబీకులు యత్నిస్తున్నారు. ప్రీస్కూలు కూలిపోవడంతో 50 మందిచిన్నారులు, ఇద్దరు టీచర్లు చనిపోయినట్లు ఐక్యరాజ్యసమితి సిబ్బంది వెల్లడించారు. కొన్ని భూకంప తాకిడిప్రాంతాలకు తరలివెళ్లేందుకు ఆయా చోట్లప్రభుత్వ తిరుగు బాటు దళాలమధ్య జరుగుతున్న ఘర్షణలు అవరోధంగా మారాయి. ఈ పరిణామాలమధ్య మృతులసంఖ్య ఎంతకు చేరుతుందోనన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం నీరు, షెల్టర్ తక్షణమే అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇదిలా ఉంటే బ్యాంకాక్‌లో కూలిన భారీ భవనం శిథిలాల్లో అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. బ్యాంకాక్‌నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవంతి పేకమేడలా కూలిపోయింది. మొత్తం 74 మంది శిథిలాలకింద ఉన్నారని చెపుతున్నా ఆ శిథిలాలకింద 300నుంచి 400కు పైగా ఉంటుందని అధికారులే అంచనాలు వేస్తున్నారు. శిథిలాలకింద చిక్కుకున్నవారిలో 60 మంది మైన్మార్ వాసులున్నారు. మిగిలిన వారంతా కూలిపనులకోసం విదేశాలనుంచి తీసు కువచ్చిన కార్మికులేనని చెపుతున్నారు. 2020లో ఈభవన నిర్మాణంప్రారంభించారు. చైనాకు చెందిన ఒకసంస్థకు భాగస్వామ్యం ఉంది. ఈ భవంతి కూలినతర్వాత నలరగురు చైనీయులు శిథిలాలు ఉన్న ప్రాంతం వద్దకు అక్రమంగా వెళ్లి కొన్ని పత్రాలు తీసుకునేందుకు యత్నించారని తేలింది. ఇతర భవనాలు సురక్షితంగానే ఉన్నా ఈ భవనం కూలిపోవడం అనుమానాలకు తావిస్తోంది నాసిరకం ఉక్కు, ఇతర నిర్మాణ సామగ్రి వాడినట్లు గుర్తిం చామన్నారు.

# నేను ఒక యోగిని.. పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ జాబ్‌కాదు

**యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్**




**లక్నో, ఏప్రిల్ 1:** ప్రధాని నరేంద్ర మోడీ వారసత్వం గురించి మహారాష్ట్ర అధికారి, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన రాజకీయ జీవితంపై యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని . పార్టీ నన్ను యుపి ప్రజల కోసం నియమించింది. అందుకే రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తున్నారు. ఇక పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు. వాస్తవానికి 'నేను ఒక యోగిని' అని ఆయన పేర్కొన్నారు. ప్రతి పనికి ఒక కాలపరిమితి ఉంటుందని అదేవిధంగా తన రాజకీయ జీవితానికి కూడా పరిమితి ఉంటుందని అన్నారు. జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బిజెపి హైకమాండ్‌తో తనకు విభేదాలు ఉన్నాయని వస్తున్న వార్తలను యోగి ఖండించారు. తనకు పార్టీ ఇచ్చిన అవకాశం వల్లే ఇక్కడ కూర్చున్నానని, పార్టీ పెద్దలతో విభేదాలు ఉంటే ముఖ్యమంత్రి స్థానంలో కొనసాగేవాడిని కాదని అన్నారు. ఎవరో ఒకరు తప్పుడు ప్రచారాలు చేస్తూనే ఉంటారని వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. నాగ్‌పుర్‌లోని సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని ప్రధాని నరేంద్రమోడీ సందర్శించడంపై శివసేన నేత సంజయ్‌రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

గత పదేళ్లలో ఎన్నడూ ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి వెళ్లని ప్రధాని ఇప్పుడు వెళ్లడం వెనుక ముఖ్యమైన కారణం ఉండవచ్చని అన్నారు. ఆయన పదవీవిరమణ చేయాలని యోచిస్తున్నారని తన రిటైర్మెంట్ ప్రణాళికల గురించి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో చర్చలు జరపడానికే అక్కడికి వెళ్లి ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ రాజకీయ నాయకత్వంలో ఆరెస్సెస్ మార్పు కోరుకుంటోందని, మోడీ వారసుడు మహారాష్ట్ర నుంచే వస్తాడని అన్నారు. ఆయన వ్యాఖ్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కొట్టిపడేశారు. ఈ నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## పార్కు చేసిన ట్యాంకర్ నుంచి విషవాయువు లీక్

# ముగ్గురు మృతి, 50 మందికి తీవ్ర అస్వస్థత



**జైపూర్,ఏప్రిల్ 1:** రాష్ట్రంలోని బేవార్‌జిల్లాలో ఉన్న రసాయన కర్మాగారంలో పార్కుచేసిన ట్యాంకర్‌నుంచి ప్రమాదకర విషవాయువు విడుదల కావడంతో ముగ్గురు చనిపోయారు. 50 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఫ్యాక్టరీ యజమానితోపాటు మరో ఇద్దరు కూడా చనిపోయినట్లు తేలింది. జిల్లాకలెక్టర్ మహేంద్ర ఖడ్‌గావత్ మాట్లాడుతూ నైట్రిక్‌యాసిడ్ లీకు వల్ల ఈప్రమాదం జరిగిందని, నివాసిత ప్రాంతం అయిన బైద్య ప్రాంతంలో అక్రమంగా నిల్వచేసి ఉంచారని, ఈప్రమాదంలో 53 మందికిపైగా గాయపడినట్లు గుర్తించామని చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని ఎస్పీ శ్యాంసింగ్ చెప్పారు. అనేకమంది ఈప్రాంతం పరిసరాల్లో ఉన్నవారు కూడా అస్వస్థతకు లోనుకాగా వారందరినీ వివిధ ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఫ్యాక్టరీ యజమాని సునీల్ సింఘాల్(47) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. స్థానికులు దయారామ్, నరేంద్ర సోలంకి అనే ఇద్దరు మంగళవారం చనిపోయారు. ఈప్రాంతంలో అనేకమందికి ఈ విషవాయుప్రభావం సోకడంతో వారిని కూడా ఆసుపత్రులకు తరలించారు. అందరికీ శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు, వాంతులు రావడంతో అందరినీ ఆసుపత్రులకు తరలించామన్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో వీరిని అజ్మేర్‌లోని జెఎల్‌ఎన్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఫ్యాక్టరీ పరిసరప్రాంతాలుమొత్తం ఖాళీ చేయించినట్లు కలెక్టర్ చెప్పారు. అంతేకాకుండా నగరపరిషత్, రెవెన్యూ,పోలీస్‌శాఖలతో కమిటీలుఏర్పాటుచేసి అనుమతుల్లేకుండా కొనసాగిస్తున్న ఫ్యాక్టరీలను సర్వే చేయాలని ఆదేశించారు.

# సౌదీకి ట్రంప్ తొలి విదేశ పర్యటన..



**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా పాలనపగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ తొలి విదేశీపర్యటనకు రెడీ అవుతున్నారు. వచ్చే నెలలో అరబ్‌దేశాల్లో పర్యటించనున్నట్లు ఆయన స్వయంగా ప్రకటించారు. వైట్‌హౌస్ మీడియా మీట్‌లో ఆయనే ఈ సమాచారం తెలిపారు. తాను ఖతార్, యుఎఇ, సౌదీ అరేబియా దేశాల్లో పర్యటిస్తానని ట్రంప్ తెలిపారు. అయితే పర్యటన పూర్తి షెడ్యూల్, అజెండా వంటి వివరాలపై అధ్యక్షుడు స్పష్టత నివ్వలేదు. అమెరికా కంపెనీల్లో సౌదీ ఒక ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్న అంశాన్ని ట్రంప్ గుర్తుచేసారు. ఆ కంపెనీలు సౌదీతోపాటు మధ్యప్రాచ్యంలోని ఇతర దేశాలకు కావాల్సిన పరికరాలు తయారు చేస్తాయన్నారు. మధ్యప్రాచ్యదేశాలతో కూడా తనకు మంచి సంబంధాలున్నాయన్నారు. 2017లో ట్రంప్ అధ్యక్ష హోదాలో తొలిసారి సౌదీలో పర్యటించారు. ఆ సమయంలో రియాద్‌తో ఆయన సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నారు. అవి కొనసాగించాలనే లక్ష్యంతోనే తొలిపర్యటనకు అక్కడికే వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఇజ్రాయెల్ దాడులతో ధ్వంసమైన గాజాను స్వాధీనంచేసుకుని అమెరికా పునర్నిర్మిస్తుందని ట్రంప్ ప్రకటించారు. అంతకంటే ముందు గాజాలో యుద్ధం కారణంగా నిరాశ్రయులైన పాలస్తీనీలకు అరబ్‌దేశాలు ఆశ్రయం కల్పించాలని ప్రతిపాదిస్తే ఆదేశాలు ఖండించాయి. తమ ప్రతిపాదనలు నిరాకరిస్తే అమెరికా నుంచి అందే సాయం నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఈజిప్టు రూపొందించిన గాజా అభివృద్ధిప్రణాళికవైపు గల్ఫ్ దేశాలు మొగ్గుచూపాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ అరబ్‌దేశాల పర్యటనకు వెళతానని ప్రకటించడం గమనార్హం.

# గడువుకు ముందే.. భారత్ వేసే సుంకాలు తగ్గొచ్చు

**యుఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ స్పందన**

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:**భారత్ సహా కీలక భాగ స్వామ్యదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలపై రేపు (బుధవారం) తుది నిర్ణయం వెలువడనుంది. ఈ తరుణంలో మన దేశాన్ని ఉద్దేశించి ట్రంప్ స్పందించారు. లిబరేషన్ డే డెడ్‌లైన్‌కు ముందే భారత్ నుంచి భారీగా టారిఫ్ కోతలు ఉంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. అమెరికా ఉత్పత్తులపై సుంకాలను గణనీయంగా తగ్గించాలని నిర్ణయానికి వచ్చిందని పేర్కొన్నారు. 'అమెరికాతో అన్యాయంగా ప్రవర్తించిన చాలా దేశాలు తమ సుంకాలను తగ్గించుకుంటాయి.ఇయు ఇప్పటికే 2.5 శాతం మేర తగ్గించుకుంది. భారత్ కూడా గణనీయంగా సుంకాలను తగ్గించుకుంటుందని ఇటీవల విన్నాను' అని అధ్యక్షుడు తాజాగా మాట్లాడారు. పరస్పర సుంకాల తగ్గింపు అమలులోకి తీసుకురావాలనుకుంటున్న రోజునే ఆయన లిబరేషన్ డేగా అభివర్ణిస్తున్నారు. ఈనెల 3నుంచి వాహ నాలు, వాటి విడిభాగాలపై 25శాతం సుంకాలు అమలు కానున్నాయి. ఇంతకుముందు ఇదే అంశంపై వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ మాట్లాడారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ 100శాతం సుంకాలు వసూలు చేస్తోం దని అన్నారు. ఇతర దేశాలు విధించే అధిక సుంకాల వల్ల అమెరికా ఉత్పత్తులను ఎగుమతి చేయడం అసాధ్యంగా మారుతోందని అన్నారు. అందుకే వాటిపై ప్రతీకార సుంకాలకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం భారత్‌కు అమెరికా చేసే ఎగుమతులకు సగటున 7.7 శాతం టారిఫ్ ఉండగా అమెరికాకు భారత ఎగుమతులపై కేవలం 2.8శాతమే ఉంది. అంటే వ్యత్యాసం 4.9శాతం. ఒకవేళ భారత్ నుంచి ఎగుమతయ్యే అన్నిఉత్పత్తులపై ఏకరీతిలో అమెరికా టారిఫ్‌లు విధిస్తే అదనంగా ఈ 4.9 శాతం మేర పెరగొచ్చు. ఒకవేళ వ్యవసాయ, పారిశ్రామికరంగాల ఉత్పత్తులకు వేరుగా టారిఫ్‌లు విధించాలని నిర్ణయిస్తే భారత్ నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులకు 32.4శాతం, పారిశ్రామిక ఉత్పత్తులకు 3.3శాతం మేర టారిఫ్‌లు పెరిగే అవకాశం ఉంటుంది.

# ధోలాఘాట్‌లో సిలిండర్ పేలి ఏడుగురు మృతి



**కోల్‌కతా, ఏప్రిల్ 1:** రాష్ట్రంలోని దక్షిణ 24 పరగణాల జిల్లాలోని పథర్‌ప్రతిమా ప్రాంతంలో ఒక ఇంట్లో గ్యాస్ సిలిండర్‌ఫేలి ఏడుగురు మరణించారు. వీరిలో నలుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. పథర్‌ప్రతిమ బ్లాక్‌లోని ధోలాఘాట్‌గ్రామంలో రాత్రి తొమ్మిది గంటలప్రాంతంలో ఈసంఘటన జరిగిందని సుందర్బన్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు తెలిపారు. మృతదేహాలన్నింటినీ స్వాధీనంచేసుకుని పోస్టుమార్టంకు పంపించారని, తీవ్రంగా గాయపడిన ఒక మహిళను మాత్రం ఆసుపత్రిలో చేర్పించామని అన్నారు. ఇంట్లో రెండు గ్యాస్‌సిలిండర్లు ఉన్నాయని, ఇదే ఇంట్లో బాణాసంచాను కూడా దాచిపెట్టడంతో ఈ మంటలు మరింత వ్యాపించాయని రావ్ వెల్లడించారు. ముందు బాణాసంచా పేలి ప్రమాదం జరిగిందని భావించారు. కానీ గ్యాస్ సిలిండర్ అని తర్వాత నిర్ధారణ అయింది. ఇదే మరో సంఘటనలో వారణాసి కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ సమీపంలో ఒకసిలిండర్ పేలి అనేక షాపులు ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు. సిగ్రా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ సంజయ్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ రైల్వేస్టేషన్ 59వ పిల్లర్ వద్ద ఈ పేలుడు సంభవించిందని సమాచారం తెలిసిన వెంటనేఫైర్‌మెన్, పోలీసులు స్పాట్‌కు చేరుకుని మంటలను అదుపుచేసారని అన్నారు. కొన్ని షాపులు దెబ్బతిన్నాయని అయితే ఎలాంటి మరణాలు సంభవించలేదని పోలీసులు తెలిపారు.

## లైంగిక హింసకేసులో వివాదాస్పద పాస్టర్‌కు జీవితఖైదు

**అమృత్‌సర్, ఏప్రిల్ 1:** అత్యాచారం కేసులో సెల్ఫ్ స్టైల్డ్ క్రిస్టియన్ పాస్టర్ బాజిందర్ సింగ్‌కు పంజాబ్‌కోర్టు శిక్ష ఖరారుచేసింది. ఆయనకు జీవితఖైదు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పింది. యేసు యేసు ప్రొఫెట్‌గా సింగ్ పాపులార్ అయ్యారు. బాజిందర్‌సింగ్ తనపై అత్యాచారానికి పాల్పడినట్లు 2018లో పంజాబ్‌లోని జిరాక్‌పూర్‌కు చెందిన ఒక మహిళ ఆరోపించింది. విదేశాలకు తీసుకెళతానని మాయమాటలు చెప్పి బాజిందర్ తనను శారీరకంగా వాడుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు ఆయనపై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటు మొత్తం ఏడుగురిపై ఈ కేసులో అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసు విచారణ జరిపిన ట్రయల్ కోర్టు బాజిందర్‌సింగ్‌ను నాలుగు రోజుల క్రితమే దోషిగా తేల్చింది. కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మిగిలిన ఆరుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈక్రమంలో ఈరోజు ఆతడికి శిక్షఖరారుచేసింది. బాజిందర్‌సింగ్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. అయితే బాజిందర్‌సింగ్ తరచూ వివాదాల్లో ముందుంటాడు. ఆయన తన కార్యాలయంలో ఒక మహిళపైనా మరో వ్యక్తిపైనా దాడికి పాల్పడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వారిని చెంపలపై కొట్టడం, చేతికి ఏది దొరికితే అది విసరడం వంటి దృశ్యాలు విడియోలో ఉన్నాయి. 2022లో ఓ మహిళ తనను లైంగికంగా వేధించాడని సింగ్‌పై ఆరోపణలుచేసింది. అలాగే అనారోగ్యంతో ఉన్న ఒక మహిళను బాగుచేస్తానని చెప్పి ఆమె కుంటుం బనుంచి భారీగా డబ్బులు వసూలు చేసాడు. అయితే ఆమె మరణించింది.



## 13యేళ్ల తర్వాత బంగ్లాకు పాక్ విదేశాంగమంత్రి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పాకిస్థాన్‌ప్రధానమంత్రి షెహబాజ్‌షరీఫ్ బంగ్లాదేశ్ కేర్‌టేకర్ చీఫ్ మహ్మద్‌యూనస్‌తో ఫోన్‌లోసంభాషించిన తర్వాత ఆదేశ విదేశాంగమంత్రి ఇషాక్‌దర్ సుమారు 13 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్ పర్యటనకు వస్తున్నట్లు ఖరారుచేసారు. ఇరువురు అగ్రనేతలు ఈద్ ఉల్‌ఫితర్ శుభాకాంక్షలు చెప్పుకున్న తర్వాత రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక బంధం మరింతశక్తివంతం కావాలని ఆకాక్షించారు. పాకిస్థాన్‌కు రావాలని షరీఫ్ యూనస్‌ను ఆహ్వానించారు. అంతేకాకుండా బంగ్లాదేశీ సాంస్కృతిక బృందాన్ని కూడా ఆహ్వానించారు. ప్రముఖ గాయని రూనా లైలా కచేరి పాకిస్థాన్‌లో ఏర్పాటుచేయాలని ఆయన కోరారు. ఇక డిప్యూటీప్రధానమంత్రి విదేశాంగమంత్రి అయిన ఇషాక్‌ధర్ కూడా బంగ్లాదేశ్ పర్యటనకు వస్తున్నారు. ఈనెల 22 నుంచి 24తేదీల్లో ఆయన పర్యటిస్తారు. యూనస్‌తోభేటీ అయి వివిధ అంశాలపై చర్చలు జరుపుతారు. బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు తౌహీద్ హొస్సేన్ ఇతర కేబినెట్ సభ్యులతో చర్చలు జరుపుతారు. కొన్ని ఎంఒయులు కూడా చేసుకుంటారని అంచనా. వాణిజ్యం, ఇతర ఒప్పందాలు, ప్రజలమధ్య నేరుగా సంబంధాలు వంటి వాటిపై ఒప్పందాలు జరుగుతాయని అంచనా. పాక్‌కుచ ఎందిన విదేశాంగమంత్రి హినా రబ్బాని ఖర్ ఒక్కరే బంగ్లాదేశ్‌ను చివరిసారిగా పర్యటించిన పాక్ విదేశాంగ మంత్రిగా నిలిచారు. అమె 2012లో బంగ్లాలో పర్యటించారు. సముద్రమార్గంలో నేరుగా కెనెక్టివిటీ పెంచుకన్న తర్వాత మొదటి కార్గోనౌక బంగ్లా సముద్రజలాల్లోకి వచ్చిన తర్వాతనుంచి పాక్ బంగ్లాదేశ్ రెండూ కూడా వాణిజ్యబంధం పెంచుకోవాలని భావిస్తున్నాయి. బంగ్లాలో రెండో అత్యున్నత ఆర్మీ అధికారి ప్రిన్సిపల్ స్టాఫ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్ఎం కమరుల్ హస్సన్ కూడా ఇటీవలే పాకిస్థాన్‌లో పలుసార్లు పర్యటించారు.



## మాకు వేరే అవకాశం లేదు..

# అణ్వాయుధాల వైపే: ఇరాన్



**టెహరాన్, ఏప్రిల్ 1:** అణ్వాయుధాల ఒప్పందం విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అగ్రరాజ్యం తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయుత్లా అలీ ఖమేనీ హెచ్చరించిన విషయం విదితమే. తాజాగా ఈ విషయమై ఖమేనీ సలహాదారుడు అలీ లారిజానీ కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే తాము అణ్వాయుధాల వైపు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. 'మేం అణ్వాయుధాల వైపు వెళ్లాలనుకోవడం లేదు. మీరు ఇరాన్ విషయంలో ఏదైనా తప్పు చేస్తే దేశాన్ని రక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితుల్లో వాటిని వినియోగించడంపై దృష్టి పెట్టాల్సి వస్తుంది' అని ఆయన హెచ్చరించారు. ఇంతకుమించి తమకు వేరు అవకాశం లేదన్నారు.

ఇరాన్ చుట్టూ ఉన్న ప్రాంతంలో అమెరికన్లకు కనీసం 10 స్థావరాలు 50,000 మంది సైనికులు ఉన్నారని ఇరాన్ ఇస్లామికన రివల్యూషనరీ గార్డ్ సీనియర్ కమాండర్ జనరల్ అమిరాలి హాజీజాదే పేర్కొన్నారు. అద్దాలమేడలో కూర్చున్న అధికారులు తమపై రాళ్లు విసిరితే అవి తిరిగి మేడలనే కూల్చేసే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి తమపై విమర్శలు చేసే ముందు అగ్రరాజ్యం మరోసారి ఆలోచించుకోవాలని హితవు పలికారు.

ఇరాన్-అమెరికా మధ్య గత కొన్ని రోజులుగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. హూతీ తిరుగుబాటుదారులకు అండగా నిలుస్తున్న టెహ్రాన్‌కు అగ్రరాజ్యం గట్టిగానే హెచ్చరికలు చేసింది.

దీనికి ఇరాన్ స్పందిస్తూ తన కొత్త భూగర్భ క్షిపణి నగరానికి సంబంధించిన విడియోను విడుదల చేసింది. ఇందులో ఖైబర్ షేకాన్స్, ఘద్రహస్, సెజ్జిల్స్, హజ్ ఖాసీమ్స్, పవేహ్ ల్యాండ్ అటాక్ క్షిపణులు ఉన్నాయి. మరోవైపు, ఈ ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసేలా అణుఒప్పందం విషయంలో అగ్రరాజ్యం ప్రత్యక్ష చర్చల ఆహ్వానాన్ని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తిరస్కరించారు. పరోక్ష చర్చలకు మాత్రం దారులు తెరిచే ఉన్నాయని అన్నారు. ఈ పరిణామాలతో అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్వరాన్ని పెంచారు.

ఒప్పందాన్ని కుదుర్చుకోని పక్షంలో ఇరాన్‌పై బాంబు దాడులకూ వెనకా డబోమని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ అగ్రరాజ్యం దాడులకు తెగబడితే ఎదురుదాడులు తప్పవని బెదరింపులకు పాల్పడ్డారు.

2-4Pg6exHMNWJQE.qxd:2-4Pg6exHMNWJQE.qxd 01/01/01 9:25 AM Page 1



# ఎస్సీ, ఎస్టీ, బిసి, ఆదివాసీల ఇంటి నిర్మాణాలకు అదనంగా రూ. 3,220 కోట్ల సాయం

**విజయవాడ,ఏప్రిల్ 1,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు ఆదివాసీ గిరిజనులు ఇంటి నిర్మాణాల్లో పడుతున్న కష్టాలు మరియు ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వారికి ఆర్థిక సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి. రాజబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న 5.99 లక్షల ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకునేందుకు రూ. 3,220 కోట్ల అదనపు ఆర్థిక సాయాన్ని మంజూరు చేసారని ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 పథకం క్రింద ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ బి.ఎల్. సి., ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, ప్రధాన మంత్రి జన్ మన్ స్కీం ల క్రింద 20162024 మధ్య కాలంలో 7.32 లక్షల మంది ఇళ్ళు పూర్తిచేయవలసి ఉంది. పురోగతిలో ఉన్న ఆ ఇళ్ళను పూర్తి చేయించి, పేదవారి పక్కా ఇంటి కలను నిజం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ధృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. గత ప్రభుత్వం యూనిట్ విలువను కేవలం రూ. 1.80 లక్షలుగా నిర్ణయించింది. గత 5 సంవత్సరాలలో ఇంటి సామాగ్రి మరియు కూలీల ధరలు విపరీతంగా పెరిగినందున లబ్దిదారులు ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయటానికి అప్పులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ, రాష్ట్ర స్వంత నిధులతో ఇంటి యూనిట్ విలువకు అదనంగా ప్రతి షెడ్యుల్ కులము వారికి రూ. 50,000/, వెనక బడిన తరగతుల వారికి రూ. 50,000/, షెడ్యూలు తెగల వారికి రూ. 75,000/ చొప్పున మరియు ఆదివాసీ గిరిజనుల (శిజుగిబి) వారికి రూ. 1,00,000/ చొప్పున అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ఈ అదనపు ఆర్థిక సాయం నాలుగు విడతలలో అనగా బేస్మెంట్ స్థాయి, రూఫ్ లెవెల్ స్థాయి, స్లాబు స్థాయి మరియు ఇల్లు పూర్తి స్థాయిలలో లబ్దిదారుల వ్యక్తిగత ఖాతాలకు నేరుగా ఆర్థిక సాయం జమ చేయబడు తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ సువర్ణ అవకాశాన్ని లబ్దిదారులందరూ వినియోగించుకొని, సత్వరమే ఇంటి నిర్మాణాలను పూర్తిచేసి, మీ పక్కా ఇంటి కలను సాకారం చేసుకోవాలని తెలిపారు.

# మూగజీవాలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య,కలెక్టర్ డా. జి.లక్ష్మీశ,

### - ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య,కలెక్టర్ డా. జి.లక్ష్మీశ,

**విజయవాడ,ఏప్రిల్ 1,ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామాల్లో మూగజీవాలకు యుద్ధప్రాతిపదికన నీటి తొట్టెల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వవిప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మిశ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో నిర్మాణం వీటి నిర్మాణం చేపడతామన్నారు. వేసవి ఎండల దృష్ట్యా మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మంగళవారం నందిగామ మండలం, ఐతవరం గ్రామంలో నీటి తొట్టె నిర్మాణానికి ప్రభుత్వవిప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మిశ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మిశ నాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 48 నీటి తొట్టెలను ఏర్పాటు చేయడం జరిగిందని.. మంగళవారం మరో 143 ఆవాసాల్లో తొట్టెల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. వేసవి తాగునీటి కార్యాచరణలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ముఖ్యమైన పాయింట్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని.. ఇదే విధంగా పశు సంపదకు తాగునీటికి ఇబ్బంది లేకుండా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహకారంతో నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక నీటి తొట్టె నిర్మాణానికి రూ. 33 వేలు మంజూరవుతుందన్నారు. జిల్లాలోని 780 ఆవాసాల్లోనూ నీటి తొట్టెల ఏర్పాటుకు స్థలాలను గుర్తించి, తక్షణమే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో త్వరితగతిన తొట్టెల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీస్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక అధికారి డా. ఎం.హనుమంతరావు, డ్వామా పీడీ ఎ.రాము, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఎన్షన్ల పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యులు తంగిరాల పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యులు తంగిరాల సౌమ్యఎన్టీఆర్ భరోసా ద్వారా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య నందిగామ మండలం, ఐతవరం గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియను పరిశీలించారు.

# బయోఇంధన రంగంలో విప్లవాత్మక మైలురాయి రిలయన్స్ సిబిజి!

## రేపు కనిగిరిలో మంత్రి లోకేష్ చేతుల మీదుగా శ్రీకారం

## 5యేళ్లలో రూ.65వేల కోట్ల పెట్టుబడులు, 2.5లక్షల మందికి ఉపాధి!

**మంగళగిరి(గుంటూరుజిల్లా),ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** భారత్ లో 2035 నాటికి కర్బన ఉద్గారాలను జీరోస్థాయికి తేవడమే లక్ష్యంగా సాంప్రదాయేతర ఇంధన వనరులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధమైన కృషి జరుగుతోంది. ఈ లక్ష్యసాధన కోసం విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగవంతంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో రిలయన్స్ సంస్థ రూ.65వేలకోట్లతో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ (సిబిజి) ప్లాంట్ల ఏర్పాటు చేసేందుకు ఏపి ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా రిలయన్స్ తొలి సిబిజి ప్లాంట్ కు ప్రకాశం జిల్లా కనిగిరిలో 242025 న మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తోపాటు ఇతర మంత్రులు, రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరక్టర్ పిఎంఎస్ ప్రసాద్, ఆర్ఐఎల్ మెంటర్ పివిఎల్ మాధవరావు, రిలయన్స్ బయో ఎనర్జీ బిజినెస్ సిఇఓ హరీంద్ర కె. త్రిపాటి పాల్గొంటారు. బయో ఇంధన రంగంలో ఇదొక మైలురాయిగా నిలవనుంది. రాబోయే 5ఏళ్లలో రిలయన్స్ ఏర్పాటుచేసే 500 సిబిజి ప్లాంట్లకు అనుబంధంగా ఎనర్జీ ప్లాంటేషన్ ద్వారా 5లక్షల ఎకరాల బంజరుభూమి ఉపయోగంలోకి వస్తుంది. రాష్ట్రంలో 2.5లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అన్నిప్లాంట్లు ఉత్పత్తి ప్రారంభిస్తే ప్రతిఏటా 40లక్షల మెట్రిక్ టన్నుల కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి అవుతుంది. వ్యవసాయ అవశేషాలు, పారిశ్రామిక వ్యర్థాలు, మున్సిపల్ ఘన వ్యర్థాలు, ఇంధన పంటల ఆధారంగా రిలయన్స్ సంస్థ పాన్ ఇండియా దీటీబి ప్లాంట్లను నిరర్థక భూముల్లో ఏర్పాటు చేస్తోంది. రిలయన్స్ సంస్థ దేశవ్యాప్తంగా 4 ఇంటిగ్రేటెడ్ సిబిజి హబ్ లను విభిన్న బంజరుభూముల్లో ఏర్పాటుచేస్తుండగా, అందులో ప్రకాశం జిల్లాలో ఒక హబ్ ఏర్పాటుచేస్తోంది. ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం, అనంతపూర్, చిత్తూరు, కడప జిల్లాల్లో అధికంగా బంజరుభూములు ఉన్న ప్రాంతాల్లో సిబిజి ప్లాంట్లను ఏర్పాటుచేస్తారు. రాష్ట్రంలోని నిరర్థక భూముల్లో కేవలం 3నుంచి 4శాతం భూమిలో ఎనర్జీ క్రాప్స్ ద్వారా పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేసే లక్ష్యంతో రిలయన్స్ 500 ఇంటిగ్రేటెడ్ సిబిజి ప్లాంట్లను ఏర్పాటుచేస్తోంది. సిబిజి ప్లాంట్, క్యాప్టివ్ ఎనర్జీ ప్లాంటేషన్ కోసం ప్రతిప్లాంటుకు వెయ్యి ఎకరాల బంజరుభూమి అవసరమవుతుంది. ఒక సిబిజి ప్లాంటు నెలకొల్పడానికి రిలయన్స్ బయో ఎనర్జీ సంస్థ రూ.130 కోట్లు ఖర్చు చేస్తుంది. ఇందులో ప్లాంటు ఏర్పాటుకు రూ.105కోట్లు, సమీప బంజరుభూముల పునరుజ్జీవనానికి రూ.25కోట్లు వెచ్చిస్తుంది. ప్రతి సిబిజి ప్లాంటు ఏటా 7,800 మెట్రిక్ టన్నుల కంప్రెస్డ్ బయోగ్యాస్ తో పాటు 22వేల మెట్రిటన్నుల హైక్వాలిటీ ఫెర్మినేటెడ్ మాన్యూర్ ను ఉత్పత్తిచేస్తుంది.

దీనిద్వారా 3వేల ఎకరాల భూమిని సారవంతంగా మార్చవచ్చు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.5లక్షల బంజరుభూముల్లో హైబ్రిడ్ నేపియర్ గ్రాస్, ఇతర ఎనర్జీ పంటలను పెంచడం ద్వారా ఇంటిగ్రేటెడ్ సిబిజి ప్లాంట్లను నెలకొల్పాలని రిలయన్స్ సంస్థ నిర్ణయించింది. సిబిజి ప్లాంట్ల నుంచి ఉత్పత్తి అయ్యే గ్రీన్ ఫెర్టిలైజర్ ను ఉపయోగించి నిరర్థక భూములను ఉత్పాదక భూములుగా మారుస్తారు. దీనిద్వారా ప్లాంట్లు నెలకొల్పే ప్రాంతాల్లో యువతకు ఉపాధి లభిస్తుంది.

# ఉపాధి హామీ ద్వారా పశువులకు 12,500, నీటి తొట్టెల నిర్మాణానికి రూ.56.25 కోట్లు - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్



**విజయవాడ,ఏప్రిల్ 1,.ప్రభాతవార్తప్రతినిధి:** పాధి హామీ ద్వారా పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణం ఈ నెల 15నాటికి పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఆ మేరకు ఆయన పంచాయతీరాజ్.,గ్రామీణాభివృద్ధి అధికారులకు ఆయన వర్చువల్‌గాను.లేఖాపరంగాను ఆదేశాలు జారీ చేసారు.ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.మంగళవారం నుంచి పవన్ కల్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా నీటి తొట్టెల నిర్మాణం చేపట్టారు,.పల్లెల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలతోపాటు రైతాంగానికి భరోసా ఇచ్చే విధంగా ఉపాధి హామీ నిధులను వినియోగిస్తున్నారు. గోకులాల నిర్మాణం, పంట నీటి కుంటల తవ్వకాన్ని ఉపాధి హామీ పథకంలో భాగం చేసిన విధంగానే ఇప్పుడు పాడి రైతుల కోసం మరో కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టింది. వేసవిలో పశువులు నీటి కోసం ఇబ్బందిపడకుండా ఉండేందుకు గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మిస్తున్నారు. గ్రామాల్లో పశు సంపదకి తాగు నీటి సమస్య ఎదురు కారాదని పవన్ హెచ్చరించారు.12,500 నీటి తొట్టెలు నిర్మిస్తున్నారు. ఇందుకోసం ఉపాధి హామీ నుంచి రూ.56.25 కోట్లు నిధులు వెచ్చిస్తున్నారు. ఈ నీటి తొట్టెల నిర్మాణం ఈ నెల 15వ తేదీనాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వేసవిలోనే ఈ తొట్టెలు సంపూర్ణంగా వినియోగంలోకి రావాలని స్పష్టం చేశారు.25 లక్షల పశువులు, మూగ జీవాలకు నీరు పవన్ కళ్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు పశువులకు ఉద్దేశించిన నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. ఒక్కో నీటి తొట్టెకు రూ.45 వేలు వెచ్చిస్తారు. ఈ నీటి తొట్టెలు ద్వారా రోజుకి 25 లక్షల పశువులు, మూగ జీవాలు నీరు తాగే అవకాశం లభిస్తుంది.ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు ఇవి. పశువుల నీటి నిల్వ తొట్టెలపై సంక్షిప్త సమాచారం రాష్ట్రంలో వ్యవసాయ ఆదాయంతోపాటు పాడి పరిశ్రమ ముఖ్యమైన ఆదాయ వనరులలో ఒకటి. కానీ రైతులు తమ పశువులు/మేక/గొర్రెలకు అవసరమైన గడ్డి మరియు తాగు నీటిని అందించడంలో ఇబ్బందిపడుతున్నారు. గ్రామంలోని పశువులు, మేకలు, గొర్రెలకు తాగు నీటి సమస్యను పరిష్కరించడానికి పశువుల నీటి తొట్టెలను ఉపాధి హామీ నిధులతో నిర్మించడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. రాష్ట్రంలో 12,500 పశువుల నీటి తొట్టెలు నిర్మాణం అవసరాన్ని పశుసంవర్ధక శాఖ గుర్తించింది. ఉపాధి హామీ పథకం ద్వారా 12,500 పశువుల తొట్టెలు నిర్మాణం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంకల్పించింది. ఒక నీటి తొట్టెకు రూ. 45,000 ప్రకారం మొత్తం అవసరమైన నిధులు రూ. 56.25 కోట్లు. పశువులు మేత మేసి ఇంటికి తిరిగి వచ్చే మార్గం లో నీరు తాగుటకు పశువుల నీటి తొట్టిలను ఏర్పాటు చేయాలి. పశువుల నీటి తొట్టిల నిర్మాణం కోసం రెండు రకాల డిజైన్లను అనుసరించాలి. టైప్1 పశువులకు మాత్రమే మరియు టైప్2 పశువులు, మేకలు/గొర్రెలకు. టైప్1 : 4.55 మీ_ 1.55 మీ_ 0.60 మీ. కొలతలతో ఒకే నీటి తొట్టి ఉంటుంది.

# 8న పాపిరెడ్డిపల్లికి జగన్

### - హత్యకు గురైన వైఎస్సార్సీ కార్యకర్త

### లింగమయ్య కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడిన మాజీ సిఎం

**అనంతపురం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త బ్యూరో** ఉమ్మడి అనంతపురం జిల్లా రామగిరి ఎంపిపి ఎన్నికల నేపథ్యంలో రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైసిపి, టిడిపి వర్గాల మధ్య గొడవలు జరగడం, ఆ గొడవల్లో వైసిపి క ఆర్యకర్త లింగమయ్య ఇటీవల హత్యకు గురైన విషయం తెలిసిందే. కురుబ లింగమయ్య సతీమణి రామాంజినమ్మ కుమారుడు శ్రీనివాసులు ఇతర కుటుంబీకులతో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఫోన్‌లో పరామర్శించి జరిగిన సంఘటనను ఆరా తీసి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఏమీ భయపడవద్దండి నేను మీ ఊరికి మంగళవారం వస్తాను, పార్టీ అండగా ఉంటుంది, ధైర్యంగా ఉండండి అంటూ ఫోన్ ద్వారా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు ధైర్యం చెప్పడం విశేషం. లింగమయ్య హత్య ఎందుకు జరిగింది, ఎందుకు దాడి చేశారు అని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లింగమయ్య కుటుంబీకులను అడగగా రామగిరి ఎంపిపి ఎన్నికల్లో పాపిరెడ్డిపల్లికి చెందిన వైసిపి నాయకుడు రామ్మోహన్‌రెడ్డికి మేము మద్దతుగా ఉన్నామనే కారణంతోనే దాడి చేశారని, పండగకు గుడ్డలు తెచ్చుకుంటుంటే కూడా విడిచిపెట్టకుండా దాడులకు పాల్పడ్డారని ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబీకులే ఈ దాడులకు పాల్పడ్డారని వివరించారు. పరిటాల కుటుంబీకులతో తమకు ప్రాణహాని ఉందని రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వారి నుంచి తమను కాపాడాలని హత్యకు గురైన లింగమయ్య కుటుంబీకులు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఫోన్‌లో వారితో మాట్లాడుతూ.. రామగిరి ఎంపిపి ఎన్నికల సందర్భంగా మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్‌పైన, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపైన కూడా పోలీసులు కేసులు పెట్టారని వచ్చే మంగళవారం పాపిరెడ్డిపల్లికి వస్తానని మీతో కలిసి మాట్లాడుతానని ధైర్యంగా ఉండాలని వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలు, నాయకులు పూర్తి అండగా నిలబడుతారని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఫోన్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితులతో

మాట్లాడిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఇదే సమయంలో రామగిరి ఎంపిపి ఎన్నికల సందర్భంగా వైసిపి నాయకుడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడిన వీడియోలు కూడా చర్చనీయాంశంగా మారాయి.

# వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌దే అధికారం

**మర్కుక్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ఈనెల 27న జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభ వేడుకలను వరంగల్ జిల్లాలో నిర్వహించేందుకు గానూ మంగళవారం మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తన వ్యవసాయ క్షేత్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బిఆర్ఎస్ ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్ రజతోత్సవ సభకు సంబంధించి పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ దిశగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నేతలు సైనికుల్లా పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలతో ఎన్నో అబద్దపు హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిందని, వాట న్నింటినీ అమలు చేసే వరకు ప్రజా క్షేత్రంలో ప్రజాప్రతినిధులు ఎండ గట్టాలని పిలుపునిచ్చారు.

ఈ సమీక్ష సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్, మాజీ స్పీకర్ మధుసూద నాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రావు, గండ్ర వెంకట రమణారెడ్డి, గండ్ర జ్యోతి, వినయ్‌భాస్కర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నరేంద్ర, మాలోతు కవిత, రాజ్యసభ సభ్యులు సంతోష్‌రావు, వరంగల్ ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# హెచ్‌సియు భూముల వేలం కుదరదు

### హైకోర్టులో కేసు కొనసాగుతోంది

### ఆ 400 ఎకరాల భూమి అటవీపరిధిలోనిదే..

### కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** హెచ్‌సియు భూములను వేలం వేయడం కుదరదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కంచ గచ్చిబౌలి భూములపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అట వీ పరిధిలోనిదన్నారు. అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయలేమని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నాయని, కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తోందన్నారు. వట ఫౌండేషన్ అనే ఎన్‌జిఓ దాఖలు చేసిన కేసులో ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఈ విషయం తెలిసి రాష్ట్ర ప్రభుత్వం భూముల చదను పేరుతో కోర్టు ధిక్కరణకు పాల్పడు తుందన్నారు. చెట్లను తొలగిస్తూ, మొక్కలను పీకేస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతుం దన్నారు. ఆ భూములను డీఫారెస్టైజేషన్ చేసి అమ్మి వేల కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మా ర్గం అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరి స్తుందన్నారు. ప్రజాప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయిం చడాన్ని రేవంత్‌రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా? అంటూ ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలి భూముల విక్రయం కాంగ్రెస్ అవకాశ వాద రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. తక్షణమే గచ్చిబౌలి భూముల అమ్మ కంపై ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసం హరించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

# హెచ్‌సియు విద్యార్థులను రెచ్చగొట్టే యత్నం

### 20 యేళ్ల క్రితమే ప్రభుత్వానికి వర్సిటీ మధ్య భూబదలాయింపు

### కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బిఆర్ఎస్‌లవి ఒకే గొంతుక

### బిసి సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ సెంట్రల్ యూనివర్సిటీ స్థలం గుంజుకుంటున్నట్లు ఆరోపణలు చేస్తూ విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తు న్నారని బిసి సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రబాకర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ 7న తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అప్పటివరకు ఉన్న ముళ్ల కంచెలు తొలగించి ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఓపెన్‌చేసి ప్రజాస్వామిక పరిపాలన కొనసాగిం చామన్నారు. అయితే ఎన్నికైన మొదటి నెల నుండి బిఆర్ఎస్, బిజెపి రెండు కవల పిల్లల లాగా ప్రజాప్రభుత్వానికి పిల్లి శాపనార్థాలు పెడుతూ ప్రభుత్వం కూలిపోతుందని, ప్రభుత్వం సక్సెస్ కావద్దని ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నా రని ఆరోపించారు. ప్రభుత్వం తెలంగాణ సెంట్రల్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

యూనివర్సిటీ స్థలం గుంజు కుంటున్నట్టు ఆరోపణలు చేస్తూ విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థి సంఘం నాయకుడిగా విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నానని, 2004లో పంచనామాచేసి 400 ఎకరాలు వర్సిటీకి సంబంధం లేదని గోపన పల్లిలో ఆల్టర్నేటివ్ ల్యాండ్ కింద తీసుకోవడం జరిగిందని 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వానికి యూనివర్సిటీకి మధ్య భూబదలాయింపు జరిగిందని మంత్రి పొన్నం వివరించారు. కంచె, గోపనపల్లి గ్రామా ల పరిసరాల్లో 132 ఎకరాలు ఎన్జీఒలకు కేటా యించారని, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు 10 సంవత్సరాల్లో అధికారం లో ఉండి కోర్టులో కేసులు నడుస్తుంటే వర్సిటీకి సంబంధించిన అధికా రులు కూడా ఈ స్థలం మాది అని కూడా న్యాయపరమైన పోరా టంలో భాగస్వామ్యం తీసుకోలేదని తెలిపారు. 2004 నుండి న్యాయబద్ధమైన పోరాటం ప్రభుత్వం చేస్తున్నదని ఈ 400 ఎకరాలు కోర్టు ద్వారా ప్రభుత్వానికి వచ్చిందని హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి ఈ భూమికి సంబంధం లేదన్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బిఆర్ఎస్ పార్టీ ఒకే గొంతుగా తానా తందనా అంటూ విద్యార్థులను రెచ్చగొడుతూ ప్రభుత్వం తప్పు చేస్తుందని అభద్రతా భావంతో మాట్లా డుతున్నారని విమర్శించారు.

# హెచ్‌సియు భూములపై విద్యార్థులతో చర్చించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆందోళనలు కొనసాగుతున్న హెచ్‌సియు భూముల వ్యవహారంపై విద్యార్థి ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములకు సంబంధించి ఆందోళన వ్యక్తం చేస్తున్న హెచ్‌సియు విద్యార్థుల ప్రతినిధి బృందంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని ..అవి హెచ్‌సియు భూములని విద్యార్థులు అంటుండగా.. కాదు రాష్ట్ర ప్రభుత్వానివేనని ప్రభుత్వం అంటున్నదని కూనంనేని అన్నారు.ఆ 400 ఎకరాలకు బదులుగా.. వర్సిటీకి అంతే మొత్తంలో భూములు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం రికార్డులు చూపిస్తుందన్నారు. ఈ అంశంపై సందేహాలను నివృత్తి చేసేందుకు విద్యార్థుల ప్రతినిధి బృందంతో చర్చించి.. వారి అభిప్రాయాలను స్వీకరించాలన్నారు. అదే సమయంలో వర్సిటీ విద్యార్థులపై పోలీసుల బలప్రయోగాన్ని ఖండిస్తున్నామని.. అరెస్టయిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని, వారిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భూముల అమ్మకం విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఇటువంటి ఆందోళనలను తలెత్తినప్పుడు సామసరస్యంగా పరిష్కరించడం మంచిదని.. ప్రభుత్వం ముందుకొచ్చి మాట్లాడితే మంచి సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఇలాంటి సున్నితమైన అంశాల విషయంలో పోలీసులు అతిగా ప్రవర్తించవద్దని.. దాని వల్ల సమస్య జఠిలమవుతుందన్నారు. విద్యార్థులకు ఆందో ళన ఉంటుందని.. దానిని అర్థం చేసుకొని పరి ష్క రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# పార్లమెంటుకు చేరిన హెచ్‌సియు భూముల వ్యవహారం

### రాజ్యసభలో ప్రస్తావించిన

### బిజెపి ఎంపి కె.లక్ష్మణ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అమ్మే ప్రక్రియను రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం రాజ్యసభలో ఈ కీలకమైన అంశంపై ఆయన మాట్లాడారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యా లయానికి 1974లో విద్య, పరిశోధనల కోసం ఈ 400 ఎకరాల భూమి కేటాయించబడిందని చెప్పారు. ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో విశ్వ విద్యా లయ భూములను ఇతర ప్రాజెక్టుల కోసం తీసుకుపోయాయని హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఆరోపించింది. ప్రభుత్వానికి ఈ భూమిని అమ్మకాలు చేసే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరారు.

# పంట రుణాల మాఫీ, రైతు భరోసాపై గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** వ్యవసాయ పంట రుణ మాఫీ, రైతు భరోసా పథకాల లబ్దిదారుల జాబితాలను ఇక నుండి గ్రామాల్లో ప్రదర్శించనున్నారు. పంట రుణాల మాఫీ, రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అమలు చేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ధీటుగా సమాధానం ఇచ్చేందుకు తెలంగాణ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన జాబితాను గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయాలని చేయనుంది. ఇందులో భాగంగా ఒక్కో గ్రామ పంచాయతీకి 6-3 సైజుల్లో మూడు ఫ్లెక్సీల చొప్పున ఏర్పాటు చేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఒక్కో ఫ్లెక్సీకి రూ.350 చొప్పున రేటు నిర్ణయించారు.

# రైతులకు తక్కువ ధరకు ఎరువులు

### రూ.37,216 కోట్ల సబ్సిడీ మంజూరు కేంద్ర వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** రైతులకు కేంద్ర ప్రభుత్వం భారీ గుడ్ న్యూస్ చెప్పింది. తక్కువకే ఎరువులను అందించేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు గాను రూ.37,216 కోట్ల సబ్సిడీని మంజూరు చేసింది. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఫాస్పరస్, పొటాషియం తదితర ఆధారిత ఎరువులను రైతులకు తక్కువ ధరకే విక్రయించేలా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంటుంది.

# ప్రభుత్వం భూములు అమ్ముతూ పోతే ప్రజల భవిష్యత్ ఏమిటి?

## బిజెపి శాసనసభాపక్ష ఉపనాయకుడు పాయల్ శంకర్



మంగళవారం బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ పక్ష ఉపనాయకుడు పాయల్ శంకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూములు అమ్ముతూ పోతే ప్రజల భవిష్యత్ ఏమిటని బిజెపి శాసనసభ పక్ష ఉపనాయకులు పాయల్ శంకర్ ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఉన్న టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ బాటలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణం చేస్తున్నారన్నారు.

గతంలో మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి, 'ప్రభుత్వ భూములు అమ్మడానికా ప్రభుత్వాలు? భూములు అమ్మాలనుకుంటే ప్రభుత్వాలు ఎందుకు? రియల్ ఎస్టేట్ ఏజెంట్లకే అప్పగిస్తే సరిపోతుంది' అని ప్రశ్నించారు. కానీ, ప్రస్తుతం స్వయంగా ప్రభుత్వ భూములు అమ్మే ప్రయత్నం చేయడం మూర్ఖత్వం అన్నారు. విద్యార్థులు, పర్యావరణ సంఘాలు, రాజకీయ పార్టీలు అందరూ హెచ్‌సియుకు చెందిన 400 ఎకరాల భూమిని అమ్మొద్దని డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం "సుప్రీంకోర్టులో గెలిచాం, భూములు అమ్మే అధికారం మాదే' అనే వాదనను ముందుకు తీసుకువస్తుందన్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాల విలువైన భూములను అమ్మి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలో నెట్టే ప్రయత్నం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదేలా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికే కాలుష్య ప్రభావిత నగరాల్లో హైదరాబాద్, ఢిల్లీ తర్వాతి స్థానం పొందే ప్రమాదం ఉందన్నారు. ఒకవైపు "హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చుతామంటూ హామీలు, మరోవైపు పర్యావరణానికి హాని చేసే నిర్ణయాలు ఇలా చేస్తే విశ్వనగరంగా మారుతుందా? అన్నారు. ప్రభుత్వ భూములను అమ్మితే హైదరాబాద్ విశ్వనగరం అవుతుందా..? ఇదేనా మీ భిన్నమైన పరిపాలన..? అన్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా భూముల విషయంలో ప్రజలను అయోమయానికి గురిచేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం "భూమాత పోర్టల్" తెచ్చి భూములను రక్షిస్తామని చెప్పినా, చేతల్లో మాత్రం భూముల అమ్మకానికే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చినంత మాత్రాన, భూముల విక్రయానికి సర్టిఫికెట్ ఇచ్చినట్లు కాదన్నారు.

**హెచ్‌సియు విద్యార్థులకు మద్దతు ఇస్తాం**

**బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకుండా భారతీయ జనతా పార్టీ విద్యార్థుల తరఫున పోరాడుతుందని బిజెపి శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. యూనివర్సిటీలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి వెళ్లిన బిజెపి ఎమ్మెల్యేలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి పరిశోధన కేంద్రాలు స్థాపిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అనేక ప్రాజెక్టులకు భూములు కేటాయించలేకపోతుందన్నారు.

రాష్ట్రంలోని భూములను ఇలా అమ్మేస్తే భవిష్యత్తులో అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూములు ఎక్కడి నుంచి కేటాయిస్తారు? అన్నారు. ప్రభుత్వ భూములను విద్యార్థుల భవిష్యత్తు కోసం లైబ్రరీలు, కమ్యూనిటీ హాళ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల కోసం ఉపయోగిస్తామని గతంలో రేవంత్ రెడ్డి చెప్పారు. కాని ఇప్పుడు అవే భూములను అమ్మాలని ప్రయత్నం చేస్తున్నారు. భూములను ఇష్టానుసారంగా అమ్ముతూ పోతే పర్యావరణానికి, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో నియంతృత్వ విధానాన్ని అమలు చేస్తోందన్నారు.

# శాతవాహన వర్సిటీకి లా కాలేజీని మంజూరు చేయండి

## కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌మేఘ్వాల్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ వినతి

### సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో లా కాలేజీ (న్యాయ కళాశాల) అనుమతి ఇవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర



న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కోరారు. మంగళవారం శాతవాహన వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావులతో కలిసి బండి సంజయ్ మధ్యాహ్నం ఢిల్లీలో కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో అర గంటకుపైగా కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. శాతవాహనవర్శిటీ పరిధిలో వచ్చేవిద్యా సంవత్సరానికిగాను 120 మందితో (రెండు సెక్షన్లతో కలిపి) లా కాలేజీని నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి గతంలో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వర్చువల్ ద్వారా తనిఖీ నిర్వహించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వివరణలతో కూడిన నివేదిక కోరిందని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరణాత్మక నివేదికను పంపామని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మూడేళ్ల లా కోర్సుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బండి సంజయ్ వినతికి సానుకూలంగా స్పందించిన అర్జున్ మేఘ్వాల్ అందుకు అనుగుణంగా శాతవాహన వర్శిటీకి అనుబంధంగా సాధ్యమైనంత తొందర్లో లా కాలేజీకి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా వచ్చే విద్యా సంవత్సరం(2025-26) నుండే లా కాలేజీ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు.

# లైంగిక దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షిస్తాం: మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట, హైదరాబాద్ లైంగిక దాడుల ఘటనలపై మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత పోలీసు అధికారులు, మహిళా సంక్షేమ అధికారులతో మాట్లాడారు.ఈ కేసులకు సంబంధించిన పురోగతి వివరాలను అడిగి తెలుసుకుని, బాధితులకు అన్ని రకాల సాయం అందించడంతోపాటు నింధితులను కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నాగర్ కర్నూల్‌కు జిల్లా ఉరవకొండ,హైదరాబాద్ లైంగిక దాడులను నింధితులను అరెస్టు చేశామని, ఈ సందర్భంగా అధికారులు మంత్రి సీతక్కకు వివరించారు. అంతే కాకుండా వారిని తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సఖీ సెంటర్ సంరక్షణలో బాధితులను సంరక్షిస్తున్నామని, వారి బాగోగులను ప్రభుత్వం చూసుకుంటుందని మంత్రికి తెలిపారు. లైంగిక దాడి సంఘటలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, పోలీసు అధికారులు సహకారంతో ఇటువంటి సంఘటలను పునరావృతంగా కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# 30 వరకు బిసి ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల స్వీకరణ

## 2025 జనవరి స్ప్రింగ్ సెషన్‌కు దరఖాస్తులు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** : రాష్ట్రంలో బిసి, ఈబిసి విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి మహాత్మా జ్యోతిబా పూలే బిసి ఓవర్సీస్ విద్యా నిధికి సంబంధించిన దరఖాస్తులన ప్రక్రియను ప్రారంభించారు. దరఖాస్తులను ఈ నెల 30 వరకు స్వీకరించనున్నట్టు ఇప్పటికే బిసి సంక్షేమ శాఖ అధికారులు ప్రకటించారు. 2025 జనవరి, ఫిబ్రవరి స్ప్రింగ్ సెషన్‌కి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు అధికారులు ప్రకటించినప్పటికీ.. ఏప్రిల్ 1 ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఎవరూ దరఖాస్తు చేయనట్టు తెలిసింది. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, అగ్రికల్చర్ సైన్స్, మెడిసిన్ అండ్ నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు పోస్టున గ్రాడ్యుయేషన్(పిజి) కోర్సును విదేశాల్లో చేయాలనుకునే బిసి, ఈబిసి విద్యార్థులు బిసి ఓవర్సీస్ విద్యానిధి పథకంలో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది.

గ్రాడ్యుయేషన్‌లో వారు 60 శాతం మార్కులను సాధించి ఉండాలి.. అలాగే వారి కుటుంబ వార్షికాదాయం రూ. 5 లక్షలకు మించకుండా ఉండాలని.. దరఖాస్తు చేసే నాటికి వారి వయస్సు 35 సంవత్సరాలు మించకుండా ఉండాలని సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా బిసి ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 2025లో జనవరి స్ప్రింగ్ సెషన్‌కి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించి.. ఈ నెల 30 వరకు దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించింది.




# రీవాల్యుయేషన్ చేసి గ్రూప్1 అభ్యర్థులకు న్యాయం చేయండి

## బిఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :రీవాల్యుయేషన్ నిర్వహించి గ్రూప్1 అభ్యర్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మెయిన్స్ పేపర్స్ వాల్యువేషన్‌లోపాలు- పేపర్ల రీవాల్యుయేషన్ చేయాలి అనే అంశంపై గ్రూప్1 అభ్యర్థులు నిర్వహించిన సమావేశానికిరాకేష్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని చెబుతున్నారు గ్రూప్1 పరీక్షలు ఫలితాలు అన్ని లోప భూయిష్టమేనని అన్నారు. కేవలం 10, 15 సెంటర్లకు చెందిన వారే టాపర్లుగా నిలవడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. మాతృభాషలో పరీక్షలు రాసిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రీవాల్యూషన్ నిర్వహించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఎన్నికల హామీల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పారని, ఆ ఉద్యోగాల మాట పక్కన పెడితే కనీసం గ్రూప్ పరీక్షలు సక్రమంగా నిర్వహించడంలో విఫలమయ్యారన్నారు. గ్రూప్ 1లో 40 శాతం విద్యార్థులు తెలుగు మీడియంకు సంబంధించిన వారు ఉన్నారని, కనీసం టాప్ 500లో ఒక్కడంటే ఒక్క విద్యార్థి కూడా లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తన తప్పులు సరిదిద్దుకొని వెంటనే గ్రూప్1లోని అన్ని పేపర్ల రివాల్యూయేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయులో ప్రభుత్వం చేపట్టిన విధ్వంసంలో 700 జీవరాశులు, 200 వృక్షాలు అంతరించిపోతున్నాయని, బుల్డోజరు చక్రాల కింద జాతీయ పక్షులు నలిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని కావాలని కలలుగంటున్న రాహుల్‌గాంధీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే రేవంత్ రెడ్డిని సిఎం పదవీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ విఠల్, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీ రాజ్, ఉద్యమ నేతలు జనార్ధన్, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో నీటిఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

## గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** : రాష్ట్రంలో మూడు నెలలు అధిక ఉష్ణోగ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మార్చి నుండి ఉష్ణోగ్రత రాష్ట్రవ్యాప్తంగా అధికంగా పెరగడం వల్ల రాబోయే మూడు నెలలు ఏజెన్సీ ప్రాంతాల్లో, మైదాన గిరిజన ప్రాంతాల్లో తాగునీరు కోసం ఆదివాసి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలన్నారు.

ఆదివాసీ గిరిజనులు పట్టణాలకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఏజెన్సీ ప్రాంతాల్లో మైదాన ప్రాంతాలలో నీటి వనరులకు దూరంగా వారి గూడాలు తాండాల్లో వేసవి ప్రారంభానికి ముందే ఏజెన్సీలో నీటిమట్టం తీవ్రంగా పడి పోవడం.. తాగునీటి కోసం గిరిజనులు, ఇప్పటికే కొన్ని కిలోమీటర్ల దూరంలోని చెలిమెల ద్వారా, ఊట బావుల ద్వారా నీటికోసం గంటల తరబడి ఎదురుచూడాల్సినటువంటి పరిస్థితి నెలకొంద న్నారు. రక్షిత మంచినీటి కోసం ఎండాకాలం ప్రారంభమై ఏప్రిల్ నెలలో ప్రవేశించినప్పటికీ ముందుగానే ప్రభుత్వం వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణనలో తీసుకొని వారి గూడాల్లో తండాల్లో మంచినీటి సౌకర్యం అందేలా గిరిజనులు, వయోవృద్ధులు గర్భిణులు చిన్నపిల్లలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

# 65 రకాల మందులు సీజ్

## రూ.3.3 లక్షల విలువైన ఔషధాలను స్వాధీనం చేసుకున్న డిసిఎ



**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** : తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ ఆడ్మినిస్ట్రేషన్ (డిసిఎ)అధికారులు గత మార్చి నెలలో నకిలీ, గడువు దాటిన సుమారు రూ.3.3 లక్షల విలువ చేసే 65 రకాల మందులను సీజ్ చేసింది. సరైన మందుల చీటి లేకుండా కొంత మంది మెడికల్ షాప్ నిర్వాహకులు మందులను ఇస్తున్నట్లు తమ విచారణలో తేలిందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఇదే అంశంపై పలు మెడికల్ షాప్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. గడువు తేదీ దాటిన మందులను వినియోగించడం ద్వారా వినియోగదారులు తీవ్ర అస్వస్థతలకు లోనుకావడమే కాకుండా కొన్ని సందర్భాల్లో అత్యంత విలువైన ప్రాణాలు కూడా కోల్పేయే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. మందులు కొనుగోలు సమయంలో వాటి ధరతోపాటు గడువు తేదీని కూడా పరిశీలించాలన్నారు. అంతేకాకుండా సంబంధిత మెడికల్ షాప్‌లకు లైసెన్స్ ఉందా లేదా అనే అంశాలను డిసిఎ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. కొత్త మెడికల్ షాప్ నిర్వాహకులు అనుమతి లేకపోయినా అత్యంత ప్రమాదకరమైన మందులను అమ్ముతున్నట్లు మా దృష్టికి వచ్చిందని, అటువంటి షాపులను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని, ఆయా షాపులు నిర్వాహకులపై కేసులు పెట్టి కఠినంగా శిక్షంచడమే కాకుండా, వాటి లైసెన్స్‌లను కూడా రద్దు చేస్తామని వారు హెచ్చరించారు.

# కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో బిఆర్ఎస్ ఎంపిల భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. ఏప్రిల్1:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కేఆర్ సురేష్‌రెడ్డి, ఉప నాయకుడు వద్దిరాజు రవిచంద్ర, విప్ దివకొండ దామోదర్‌రావు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి కలిశారు.

పార్లమెంటు ఆవరణలోని మంత్రి చాంబర్‌లో మంగళవారం ఆయనతో ఎంపీలు సమావేశమై తెలంగాణలో విమానాశ్రయాల ఏర్పాటుపై చర్చించారు. వరంగల్‌లోని మామూనూరు విమానాశ్రయం పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాల్సిందిగా కోరారు.

నిజాం కాలంలో నిర్మించిన మామూనూరు నుంచి గతంలో విమానాలు నడిచాయని, ఇక్కడి నుంచి విమాన సర్వీసులు పునరుద్ధరిస్తే వరంగల్, చుట్టుపక్కల జిల్లాల ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని ఎంపీలు సురేష్‌రెడ్డి, రవిచంద్ర, దామోదర్‌రావు, పార్థసారథి రెడ్డి మంత్రి రామ్మోహన్ నాయుడుకు వివరించారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి సమీపాన ప్రతిపాదిత విమానశ్రయం ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిందిగా వారు మంత్రిని కోరారు.

సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు, నవభారత్, ఐటీసీ, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ వంటి అనేక పరిశ్రమలు అక్కడ నెలకొన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చేపోయే భక్తులకు ఇక్కడ ఏర్పాటు చేసే విమానాశ్రయం సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రికి బీఆర్ఎస్ ఎంపీలు వివరించారు.

అదేవిధంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల సమీపాన ప్రతిపాదిత విమానశ్రయాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సిందిగా ఎంపీలు కోరగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించారు.



మంగళవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

# సన్న బియ్యం, నాణ్యత, పరిమాణ ఫిర్యాదులు రాకుండా చూడాలి

## కలెక్టర్‌లకు సిఎస్ శాంతికుమారి సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :రాష్ట్ర ప్రభుత్వం ఉగాది రోజున ప్రారంభించిన సన్న బియ్యంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్షించారు. సన్న బియ్యం, నాణ్యత, పరిమాణానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. మంగళవారం సిఎస్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సమీక్షించారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉగాది రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని, ఈ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించేందుకు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు తగిన విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఇప్పటికే యాభై శాతానికి పైగా సన్నబియ్యం చౌక ధరల (రేషన్ షాప్) దుకాణాలకు వచ్చాయని, మిగిలిన స్టాక్‌ను రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని సిఎస్ తెలిపారు.

# ఊర్కొండపేట ఘటనపై సిఎం ఆరా

## అత్యాచార బాధితురాలికి అండగా ఉంటాం: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

### ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారిస్తాం

### నిందితులను కఠినంగా శిక్షిస్తాం..

### జోగులాంబ గద్వాల మల్టీజోన్ ఐజి సత్యనారాయణ వెల్లడి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 1, ప్రభాతావార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట అత్యాచార ఘటనలో బాధితురాలికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఈ సంఘటన లో నిందితులు ఎవరైనాప్పటికీ వారిని కఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఊర్కొండ పేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఒక వివాహిత మహిళపై సామూహిక అత్యాచార సంఘటన జరిగిన నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక ఆలయ అధికారులు పోలీస్ అధికారులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊర్కొండ పేట ప్రాంతం నుంచి మొదటిసారి జెడ్పిటిసి సభ్యుడిగా గెలిచారని ఆ తరువాత ఆయన ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి ఊర్కొండ పేట ఆంజనేయ స్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు జరిపించారని తెలిపారు. ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయ సమీపంలో జరిగిన ఈ సంఘటనను సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా పరిగణిస్తున్నారని, ఈ విషయం గా తనతో సీఎం ఫోన్లో మాట్లాడారని అనిరుద్ రెడ్డి వివరించారు. జరిగిన సంఘటనలో 8 మంది నిందితులు ఉన్నారని చెప్పుండగా వారిలో ఆరు మంది బిఆర్ఎస్, ఇద్దరు బిజెపి పార్టీలకు చెందిన వారు ఉన్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ అత్యాచార సంఘటన ఆంజనేయ స్వామి ఆలయానికి సమీపంలోనే జరిగిందని దుష్ప్రచారం చేస్తున్నారని వాస్తవానికి ఈ సంఘటన జరిగిన ప్రాంతానికి ఆలయం చాలా దూరంగా ఉందని సంఘటన జరిగిన ప్రదేశం కూడా ఆలయానికి చెందిన భూమి కాదని అనిరుద్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సంఘటన లో కిలక పాత్ర పోషించినట్లు చెప్పబడుతున్న ఆలయ తాత్కాలిక ఉద్యోగిని ఇప్పటికే ఉద్యోగం నుండి తొలగించడం జరిగిందన్నారు. ప్రస్తుత ఆలయ ఈవో వచ్చిన తర్వాతనే అవినీతి తగ్గిందని ఆలయానికి నూతనంగా నియమించిన పాలకమండలి బాధ్యతలు చేపట్టిన తర్వాతనే ఆలయ పరిసరాలలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అనిరుధ్ రెడ్డి వివరించారు.

**ఇదీ జరిగింది..**

నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట ఆంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న భజన, ఆధ్యాత్మిక కార్యక్రమాలను తిలకించేందుకు మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలానికి చెందిన ఓ మహిళ శనివారం సాయంత్రం తన సహచరుడుతో కలిసి వెళ్లింది. అదే రాత్రి సమయంలో తిరిగి వస్తూ ఆలయ సమీపంలో ఉన్న చెట్టు చాటున మాట్లాడుకుంటున్నారు. ఈ తతంగం అంతా ఆలయంలోనే పనిచేసే ఓ యువకుడు గమనిస్తూ వచ్చాడు. వారు భార్యాభర్తలు కాదని, వారికి వ్యవహారం చూసి ఇక అంచనాకు వచ్చి వారిని ఫాలో అయ్యారు. ఆలయ సమీపంలోని ఓ గుట్ట వద్ద చెట్టు చాటున ఉన్న వారిని గమనించి ఇదే అదనుగా భావించి వెంటనే అతడు తన మిత్రులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఏడుగురు యువకులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారు భార్యభర్తలు కాకపోవడంతో ఈ సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నారంటూ పోలీసులకు చెబుతామంటూ బ్లాక్‌మెయిల్ చేశారు. ఆమె వెంట ఉన్న వ్యక్తికి చితకబాది ఒకరి తర్వాత ఒకరు వివాహితపై లైంగికదాడికి పాల్పడ్డారు. ఆమెపట్ల అత్యంత అమానవీయంగా పాశవికంగా వ్యవహరించారు. ఆమె సహచరుడిని చెట్టుకు కట్టేసి కొట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. బాధిత మహిళలకు కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఐజి సత్యనారాయణ

**ఐజి సందర్శన..**

ఊర్కొండపేట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతంలో ఓ మహిళపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన అత్యంత పాశవికమని జోగులాంబ గద్వాల్ మల్టీజోన్ ఐజి సత్యనారాయణ పేర్కొన్నారు. మహిళపై సామూహిక అత్యాచారం జరిగిన సంఘటన స్థలాన్ని మంగళవారం జోగులాంబ గద్వాల్ మల్టీజోన్ ఐజి సత్యనారాయణ, నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ తో కలిసి పరిశీలించారు. ఇది అత్యంత పాశవిక చర్యగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. ఏడుగురు ఒకరి తర్వాత ఒకరు వివాహితపై లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపారు. వారితో నగదు కొంత బంగారం కూడా తీసుకొని బెదిరిస్తూ అక్కడి నుంచి పరారయ్యారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందుతులకు గుర్తించామని అవసరమైతే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్ష పడేలా చూస్తామని తెలిపారు.

2-4pg10.qxd:2-4pg10.qxd 01/01/01 7:02 AM Page 1



# బరిలోకి దిగకున్నా విజేతలే


వాషింగ్టన్ సుందర్


రిషభ్ పంత్


అర్షదీప్ సింగ్


యుజ్వేంద్ర చాహల్


సంజూ శాంసన్


యశశ్వి జైస్వాల్

## ఒక్క మ్యాచ్ ఆడకుండానే ఛాంపియన్స్

**న్యూఢిల్లీ:** ప్రతి క్రికెట్ ప్లేయర్ దేశానికి ప్రాతినిధ్యం వహించాలని, ఐసిసి ట్రోఫీ గెలవాలని కలలు కంటుంటారు. కానీ, ఒక్కోసారి ఐసిసి టోర్నీలకు ఎంపికైనా, స్క్వాడ్‌లోని ఆటగాళ్లందరికీ మ్యాచ్ ఆడే అవకాశం రాకపోవచ్చు. ఇలా ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే ఐసిసి ట్రోఫీ గెలిచిన భారత్ ప్లేయర్లు చాలా మందే ఉన్నారు. ఈ ఏడాది జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమిండియా విజేతగా నిలిచింది. ఈ జట్టులో యంగ్ ప్లేయర్లు వాషింగ్టన్ సుందర్, రిషభ్ పంత్, అర్షదీప్ సింగ్‌లు కూడా టీమిండియాలోని 15మంది స్క్వాడ్‌లో ఎంపిక య్యారు.

వీరంతా టీమ్‌ఇండియాతో పాటుగా, దుబాయ్‌కు కూడా వెళ్లారు. కానీ, ఈ ముగ్గురికి టోర్నీలో ఒక్క మ్యాచ్‌లో కూడా బరిలో దిగే ఛాన్స్ రాలేదు. దీంతో వీళ్ల టోర్నీలో ఒక్క గేమ్ ఆడకున్నప్పటికీ ఛాంపియన్స్ అయ్యారు. అలాగు అమెరికా, వెస్టిండీస్ వేదికగా గతేడాది టీ20 వరల్డ్ కప్-2024 జరిగింది. ఈ టోర్నీలోనూ భారత్ విశ్వవిజేతగా నిలిచింది. లెగ్‌స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, సంజూ శాంసన్ కూడా ఈ జట్టులో సెలెక్ట్ అయిన వారిలో ఉన్నారు. ఈ టోర్నీలో భారత్ తొలి మ్యాచ్ నుంచి ఓటమి లేకుండా దూసుకెళ్లింది. దీంతో విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చే ఉద్దేశం లేకపోవడం వల్ల చాహల్, శాంసన్‌కు ఆడే ఛాన్స్ రాలేదు. టోర్నమెంట్ అంతా బెంచ్‌కే పరిమితం అయ్యారు. అలా వీళ్ల కూడా విశ్వవిజేతలు అయ్యారు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌కు సంబంధించి టీమ్‌ఇండియా దీన్ని కూడా దక్కించుకుంది. ఆ టోర్నీకి ఆటగాళ్లు వినయ్ కుమార్, ఇర్ఫాన్ పఠాన్, అమిత్ మిశ్రా, మరళీ విజయ్ జట్టులో ఎంపికయ్యారు. కానీ, వీళ్లెవరూ ఈ ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో ఆడలేదు. అలా ఆ టోర్నీలో ఈ నలుగురు ప్లేయర్లు అసలు బరిలోకి దిగలేదు. అలాగే లెగ్ స్పిన్నర్ పియూష్ చావ్లా 2007 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియా స్క్వాడ్‌లో ఉన్నాడు.

భారత్ ఆ టీ20 వరల్డ్ కప్ గెలిచింది. అయితే చావ్లాకి ఒక్క మ్యాచ్‌లో కూడా ఛాన్స్ రాలేదు. 2002లో ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ శ్రీలంక తలపడ్డాయి. అయితే వర్షం కారణంగా మ్యాచ్ నిర్వహించడం సాధ్యం కాలేదు. దీంతో రెండు టీమ్‌లు టైటిల్ షేర్ చేసుకున్నాయి. ఇందులో జై ప్రకాష్ యాదవ్ టోర్నీకి సెలక్ట్ అయ్యాడు. కానీ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. భారత్ తొలిసారి 1983లో వన్డే వరల్డ్ కప్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీకి ఎంపికైన సునీల్ వాల్సన్‌కి ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా రాలేదు. అయినా వీరంతా హీరోలు అయి పోయారు.



## ఇంగ్లండ్, భారత్ ద్వైపాక్షిక టెస్టుకు గుడ్ బై

**న్యూఢిల్లీ:** ఏటా ఇంగ్లండ్, భారత్ మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌కు స్వస్తి పలకాలని నిర్ణయించింది. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటన జరగాల్సి ఉంది. అయితే ఈ సిరసీ ఈ ఏడాది జరిగే అవకాశం కనిపించడం లేదు. ఇంగ్లండ్ గడ్డపై ఇరు జట్ల మధ్య మన్సూర్ అలీఖాన్ పటౌడీ ట్రోఫీ పేరిట 1961 నుండి ద్వైపాక్షిక టెస్టు సిరీస్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అయితే ఈ ట్రోఫీకి గుడ్‌బై చెప్పాలని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు భావిస్తోంది. ఈ ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌ను 1961 నుండి 1975 మధ్య కాలంలో భారత్ జట్టు తరపున 46 టెస్టులు జరిగాయి. దీన్ని రద్దు చేసి దానికి బదులుగా రెండు జట్ల మధ్య మరో సిరీస్‌ను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఇక ఇంగ్లండ్ పర్యటన సమయంలో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య 2024 నుండి క్రో-ధోర్ప్ ట్రోఫీని నిర్వహిస్తున్నారు. ఇంగ్లండ్ పర్యటన సమయంలో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య టెస్టు సిరీస్ 2007 నుండి పటౌడీ ట్రోఫీ పేరుతో జరుగుతోంది. భారత్ వేదికగా ఈ రెండు జట్ల మధ్య టెస్టు సిరీస్‌ను 1951 నుండి భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు నిర్వహిస్తోంది. ఈవిధంగానే భారత్-ఆస్ట్రేలియా మధ్య విజ్డెన్ ట్రోఫీతో సిరీస్‌లు జరిగాయి. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు విజ్డెన్ ట్రోఫీని రద్దు చేసి, దాని బదులుగా రెండు జట్ల మధ్య రిచర్డ్స్-బోథమ్ ట్రోఫీ పేరుతో మరో సిరీస్‌లను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ఆయా దేశాల మధ్య నాలుగు ట్రోఫీల టెస్టు సిరీస్‌లు నిర్వహిస్తున్నాయి. ఇదే విధంగా భారత్-ఆస్ట్రేలియా మధ్య 1996 నుండి బోర్డర్ గావాస్కర్ ట్రోఫీ, వెస్టిండీస్-ఆస్ట్రేలియా మధ్య 1960 నుండి ఫ్రాంక్ వోరెల్ ట్రోఫీ, ఆస్ట్రేలియా-శ్రీలంక జట్ల మధ్య 2007 నుండి వార్న్-మురళీధరన్ ట్రోఫీ, న్యూజిలాండ్-ఇంగ్లండ్ జట్ల మధ్య 2024 నుండి క్రో-థోర్ప్ ట్రోఫీలను నిర్వహిస్తున్నాయి.

## మయామి ఓపెన్‌లో.. జోకోవిచ్ ఘోర ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రపంచ దిగ్గజం, సెర్బియాకు చెందిన నోవాక్ జోకోవిచ్‌కు ఘోర ఓటమి ఎదురైంది. 2019 తర్వాత పాల్గొన్న మయామి ఓపెన్ ఎటిపి మాస్టర్స్-1000 సిరీస్ టెన్నిస్ టోర్నీలో తన కెరీర్‌లో 100వ టైటిల్ సాధించాలని ఆశించి, పట్టుదలతో ఆడిన జోకోవిచ్‌కు చుక్కెదురైంది. ఈ టెన్నిస్ టోర్నీలో కేవలం రన్నరప్‌గానే నిలిచాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19 ఏళ్ల జాకుబ్ మెన్‌షిక్ అసాధారణ ఆట తీరు కనపరచి మోనార్క్‌కు గట్టి షాక్ ఇచ్చాడు. 2 గంటల 3 నిముషాల పాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో మెన్‌షిక్ 7-6 (7/4), 7-6 (7/4)తో గతంలో ఆరుసార్లు మయామి ఓపెన్ ఛాంపియన్‌గా నిలిచిన జోకవిచ్‌ను బోల్తా కొట్టించాడు. 6 అడుగుల 4 అంగుళాల ఎత్తు, 83 కేజీల బరువు ఉన్న మెన్‌షిక్ 14 ఏస్‌లతో అదరగొట్టాడు. ఇద్దరూ తమ సర్వీస్‌లను ఒక్కోసారి కోల్పోగా, టైబ్రేక్‌లలో మెన్‌షిక్ పై చేయి సాధించి తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. విజేతగా నిలిచిన మెన్‌సిక్‌కు 11,24,380 డాలర్ల (రూ.9 కోట్ల 61 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 1000 ర్యాంకింగ్ పాయింట్లు, రన్నరప్ జోకోవిచ్‌కు 5,97,80 డాలర్ల ( రూ.5 కోట్ల 11 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ విజయంతో మెన్‌సిక్ ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 30 స్థానాలు పురోగతి సాధించి కెరీర్ బెస్ట్ 24వ రాయంక్‌కు చేరుకున్నాడు.

## ఐపిఎల్ రన్ రేట్‌లో.. టాప్ ప్లేస్‌లో ఆర్సీబీ

### సెకండ్ పొజిషన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 ట్రోఫీ కోసం అన్ని జట్లు తమ వేటను ఆరంభించాయి. ఇప్పటివరకు అన్ని జట్లు రెండేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకోగా, పంజాబ్ కింగ్స్ మాత్రం ఒక మ్యాచ్ మాత్రమే ఆడింది. మరికొన్ని జట్లు మూడు మ్యాచ్‌లు కూడా ఆడేశాయి. ఇప్పటికే అన్ని జట్లు పాయింట్ల ఖాతాను ఓపెన్ చేశాయి. ఈసారైనా కప్ సాధించాలని పట్టుదలతో ఉన్నా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఘన విజయాలు సాధించి నాలుగు పాయింట్లతో టేబుల్‌లో టాప్ ప్లేస్‌లో ఉంది. రన్ రేట్ కూడా +2.266 అన్ని జట్ల కంటే చాలా ఎక్కువగా ఉంది. రెండో స్థానంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఉంది. ఢిల్లీ కూడా రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించగా, నెట్‌రన్ రేట్ +1.320 ఆర్‌సీబీ కంటే తక్కువగా ఉంది. మూడోస్థానంలో లక్నో సూపర్ జెయింట్స్ ఉంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒక గెలుపు, ఒక ఓటమితో రెండు పాయింట్లు సాధించింది. లక్నోకు రన్‌రేట్ +0.963 ఇతర జట్ల కంటే మెరుగ్గా ఉంది. గుజరాత్ టైటాన్స్ రెండు మ్యాచ్‌ల్లో ఒక గెలుపుతో రెండు పాయింట్లు, +0.625 రన్‌రేట్‌తో నాలుగోస్థానంలో ఉంది.

పంజాబ్ కింగ్స్ ఆడిన ఒకే మ్యాచ్‌లో విజయం సాధించి ఐదోస్థానంలో ఉంది. ముంబై ఇండియన్స్ మూడు మ్యాచ్‌లు ఆడగా రెండు ఓటములు, ఒక గెలుపుతో ఆరోస్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ మూడు మ్యాచ్‌లు ఆడగా, ఒక మ్యాచ్‌లోనే విజయం సాధించింది. రెండు పాయింట్లు 0.771 రన్‌రేట్‌తో ఏడోస్థానంలో కొనసాగుతుంది. మొదట మ్యాచ్‌లోనే భారీ స్కోరుతో అంచనాలు పెంచేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆ తరువాత రెండు మ్యాచ్‌ల్లోనూ దారుణంగా ఓటమిపాలైంది.

రెండు పాయింట్లు, 0.871 రన్‌రేట్‌తో 8వ స్థానానికి పడిపోయింది. రాజస్థాన్ రాయల్స్ ఒకగెలుపు, రెండుఓటములతో తొమ్మిదో స్థానంలో ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఒకే గెలుపుతో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది.

## ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. స్వర్ణాలతో రాణించిన జెస్సీరాజ్



**న్యూఢిల్లీ:** అర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ అమ్మాయి జెస్సీరాజ్ అద్భుత ప్రదర్శన కనపరచింది. ఆల్ రౌండర్‌గావివిధ విభాగాల్లో స్వర్ణ,రజత, కాంస్య పతకాలతో ప్రపంచదేశాల్లో భారత్‌కు గుర్తింపు తెచ్చింది. మార్చి 26వ తేదీ నుండి 31 వరకూ తైవాన్‌లో జరిగిన అర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో జెస్సీరాజ్ పసిడి పతకాలతో రాణించింది. ఈ పోటీల్లో జనెస్సీరాజ్ 2 స్వర్ణ పతకాలు, ఒక రజతం, ఒక కాంస్య పతకాన్ని సాధించింది. సోలో డ్యాన్స్, కపుల్ డ్యాన్స్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు లభించాయి. అలాగే పెయిర్ స్కేటింగ్ విభాగంలో వెండి, ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా తైవాన్‌లో జరిగిన కార్యక్రమంలో అర్టిస్టిక్ స్కేటింగ్ చైర్మన్ అలెక్స్ వాంగ్ చేతుల మీదుగా ఈ పతకాలను జెస్సీరాజ్ అందుకుంది. కాగా జెస్సీరాజ్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏలూరు జిల్లా దెందులూరులో 9వ తరగతి చదువుతుండటం విశేషం.

# వాణిజ్యం

## సెన్సెక్స్, నిఫ్టీల భారీ పతనం

**ముంబై, ఏప్రిల్ 1:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిసాయి. అమెరికా ప్రతీకార సుంకాల భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటి, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా కుదేలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఏకంగా 1400 పాయింట్లకుపైగా నష్టపోగా, నిఫ్టీ 23,200 మార్క్ దిగువకు చేరింది. ఇన్వెస్టర్ల సంపద రూ.3.5లక్షల కోట్లు క్షీణించి రూ.409 లక్షల కోట్లకు పరిమితమైంది. ఉదయం 76,882.58 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,912.18 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరిన సూచి, చివరికి 1390.41 పాయింట్లు నష్టపోయి 76,024.51 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 353.65 పాయింట్లు నష్టపోయి 23,165 పాయింట్ల వద్ద నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిసాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు దొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దేశీయ ఐటి కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. అలాంటిది అమెరికాలో ఐటీకి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చన్న అంచనాలతో ఐటి స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టి, హెచ్‌సిఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇటీవల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి



చేరింది. భారత్ చమురును ప్రధానంగా దిగుమతి చేసుకొనే దేశం కావడంతో మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీవల దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుగా 8 సెషన్లలో దాదాపు 5శాతానికిపైగా పెరిగాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, రిలయన్స్ షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి.

## అమ్మకాల్లో కియా అప్..హుండయ్ డౌన్


**ముంబై, ఏప్రిల్ 1:** దక్షిణ కొరియా కార్ల తయారీ దిగ్గజం కియా మోటార్స్ మార్చి నెల అమ్మకాల్లో 2.2శాతం వృద్ధిని నమోదు చేసింది. దేశీయంగా,అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడంతో ఈ వృద్ధి సాధ్యమైందని కంపెనీ పేర్కొంది. కియా గత నెలలో 2,78,058 వాహనాలను విక్రయించగా, గత యేడాది ఇదే నెలలో 2,72,011 యూనిట్లు అమ్ముడయ్యాయి. దేశీయ అమ్మకాలు 2శాతం పెరిగి 50,006 యూనిట్లకు చేరుకున్నాయి. విదేశీ అమ్మకాలు 2.2శాతం పెరిగి 2,27,724 యూనిట్లకు చేరాయి. ఈ సందర్భంగా కియా మోటార్స్ ప్రతి నిధి మాట్లాడుతూ, ఈ యేడాది మొదటి త్రైమాసికంలోనే అత్యధిక అమ్మకాలు సాధించాం. జనవరి- మార్చి మధ్య మొత్తం 7,72,351 యూనిట్లను విక్రయించాం. ఇది గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 1.6శాతం ఎక్కువ. ఇవి3, స్పోర్టేజ్, సోరెంటో వంటి కీలక మోడళ్ల హైబ్రిడ్ వెర్షన్లు గతేడాది ద్వితీయార్థంలో విడుదలయ్యాయి. ఇవి అమ్మకాలను పెంచడంలో సహాయ పడ్డాయని, తద్వారా మొదటి త్రైమాసికంలోనే అత్యధిక పనితీరును కనబరిచాం అని అన్నారు. అదే సమయంలో హుండయ్ మోటార్స్ మార్చి నెల అమ్మకాల్లో తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు క్షీణించడంతో మార్చి నెలలో హుండయ్ మోటార్స్ అమ్మకాలు 2శాతం తగ్గాయని ఆ సంస్థ తెలిపింది. గత నెలలో 3,65,812 వాహనాలను విక్రయించగా, గత సంవత్సరం ఇదే నెలలో 3,73,290



యూనిట్లు అమ్ముడయ్యాయి. దేశీయంగా 0.9శాతం వృద్ధి చెంది 63,090 యూనిట్లు విక్రయించినా, అంతర్జాతీయంగా అమ్మకాలు 2.6శాతం తగ్గి 3,02,722 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఒకే దేశానికి చెందిన రెండు కార్ల కంపెనీల అమ్మకాలలో ఇంత వ్యత్యాసం ఎందుకు కనిపిస్తోందనే దానిపై విశ్లేషకులు పలు రకాలుగా స్పందిస్తున్నారు. హుండయ్ పాత మోడల్ కార్ల అమ్మకాలపై దృష్టిపెట్టిం దని, కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడంలో వెనుకబటి ఉందని అభిప్రాయపడుతున్నారు. దీనికి విరుద్ధంగా కియా మాత్రం సరికొత్త మోడళ్లను ఎప్పటికప్పుడు విడుదలచేస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటోందని, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై దృష్టిసారించడం కియాకు కలిసొచ్చే అంశం.

## 60 నిమిషాల్లో 10 లక్షల మంది యూజర్లు

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** ఓపెన్‌ఎఐ ఆధ్వ ర్యంలోని చాట్‌జిపిటి కేవలం ఒకే గంటలో పది లక్షల మంది యూజర్లను సంపాదించినట్లు కంపెనీ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. కంపెనీ ఇటీవల ప్రారంభించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆర్ట్ స్టూడియో జీబ్లీకి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఇలా చాట్‌జిపిటికి వినియోగదారులు పెరుగుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆల్ట్‌మన్ తన ఎక్స్ ఖాతాలో ఈ విషయాన్ని పంచుకున్నారు. 26 నెలల క్రితం చాట్‌జిపిటి ప్రారంభించిన సమయంలో అత్యంత క్రేజ్‌తో క్షణాల్లో ఈ ప్లాట్‌ఫామ్ వైరల్ అయి ఐదు రోజుల్లో 10 లక్షల మంది యూజర్లను సంపాదించుకున్నట్లు ఆల్ట్‌మన్ చెప్పారు. కానీ కొత్తగా ప్రవేశపెట్టిన జీబ్లీ స్టూడియో ద్వారా చాట్‌జిపిటి గతంలో కంటే మరింత వైరల్ అయి కేవలం గంటలోనే 10 లక్షల మంది యూజర్ల బేస్‌ను సంపాదించిందని వివరించారు. ప్రస్తుతానికి కంపెనీ మొత్తం వినియోగదారుల సంఖ్యను విడుదల చేయలేదు. ఈ కొత్త ఫీచర్‌ను ఓపెన్‌ఎఐ గత వారం జిపిటి-4ఓలో ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఎలాంటి ఎక్స్‌టర్నల్ టూల్స్ అవసరం లేకుండా నేరుగా చాట్‌జిపిటిలోనే టెక్స్ట్, యూజర్ ఫొటోలు అప్‌లోడ్ చేసి జీబ్లీఇమేజ్‌లను



పొందవచ్చు. ఇప్పటికే చాలా మంది యూజర్లు తమసెల్ఫీలు, పెంపుడు జంతువులు, కుటుంబచిత్రాలు, చాట్‌జిపిటిలో అప్‌లోడ్ చేసి జీబ్లీ ఫొటోలను పొందుతున్నారు. వాటిని తమకు చెందిన వివిధ సామాజిక మాధ్యమ ఖాతాల్లో షేర్ చేస్తున్నారు. జీబ్లీ ఇమేజ్ క్రియేట్ చేసేందుకు అనువైన మౌలిక సదుపాయాలు కావాల్సి ఉంటుంది. దీనివల్ల భారీగా జిపియు కరిగిపోతుంది. దీనిపై కొంత ఆందోళనలు వ్యక్తమవుతున్నా కొత్త ఫీచర్‌ను ఉపయోగించాలని ఆల్ట్‌మన్ వినియోగదారులను కోరారు.

## ఎస్‌బిఐ సేవల్లో అంతరాయం

**ముంబై, ఏప్రిల్ 1:** స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కస్టమర్లు ఆన్‌లైన్ సేవలతో సమస్య లను ఎదుర్కొంటున్నారు. వెబ్‌సైట్ పర్ఫామెన్స్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డెటెక్టర్ ప్రకారం, మంగళవారం ఉదయం 8:15 గంటలకు ఈ అంతరాయం ప్రారంభమైంది. 11:45 గంటలకు సమస్య తీవ్రమై 800కంటే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. వార్షిక ముగింపు కార్యకలాపాల కారణంగా ఏప్రిల్ 1 మధ్యాహ్నం 1:100 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో లైట్, యుపిఐ సేవల వంటి డిజిటల్ సర్వీసులు అందు బాటులో ఉండవని, ఈ అంతరాయానికి క్షమించమని ఎస్‌బిఐ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. డౌన్‌డెటెక్టర్ ప్రకారం సుమారు 64శాతం మొబైల్ బ్యాంకింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు, 33 లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంతరాయం నుంచి బయటపడడానికి కస్టమర్లు యుపిఐ లైట్, ఎటిఎం ఉపయోగించుకోవచ్చని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెల్లడించింది.



## సిఎన్‌జి ధరల పెరుగుదల

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దేశీయంగా ఉత్పత్తి అయ్యే సహజవాయువు ధరలను భారత్ రెండేళ్లలో తొలిసారిగా పెంచింది. ఏప్రిల్ 1 నుంచి ఎపిఎం (అడ్మినిస్ట్రేటెడ్ ప్రైసింగ్ మెకానిజం) గ్యాస్ ధరను 10 లక్షల థర్మల్ యూనిట్లకు 6.50 డాలర్ల నుంచి 6.75 డాలర్లకు పెంచినట్లు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖకు చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ విభాగం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఒఎన్‌జిసి), ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లు నామినేషన్ ప్రాతిపదికన కేటాయించిన క్షేత్రాల నుంచి ఉత్పత్తి చేసే సహజ వాయువును ఎపిఎం గ్యాస్ అంటారు. ఈ గ్యాస్‌ను 'అడ్మినిస్ట్రేటెడ్ ప్రైసింగ్ మెకానిజం' వద్ద వినియోగదారులకు విక్రయిస్తారు. ఇంట్లో వంట అవసరాలకు పైపుల ద్వారా సహజ వాయువుగా ఈ గ్యాస్‌ను సరఫరా చేస్తారు. ఆటోమొబైల్స్ అవసరాల కోసం కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్‌గా మారుస్తారు. ప్రభుత్వం రూపొందించిన రోడ్ మ్యాప్‌కు అనుగుణంగా రెండేళ్లలో తొలిసారి ధరల పెంపును అమలుచేశారు. 2023 ఏప్రిల్‌లో దేశీయంగా ఉత్పత్తి అయిన సహజ వాయువు ధరలను మిలియన్ థర్మల్ యూనిట్లకు 4 డాలర్లు నుంచి గరిష్టంగా 6.5డాలర్లుగా పరిమితిని విధించారు. ధరల పెంపుకు సంబంధించి నిపుణుల కమిటీ నివేదికను గతంలో కేంద్ర కేబినెట్ ఆమోదిం చింది. 2027 వరకు 0.5 డాలర్లు పెంచాలని సూచించింది. 2023 నుంచి రెండేళ్ల పాటు ఎలాంటి పెంపు తీసుకోలేదు. ఈ గడువు ముగియడంతో తాజాగా 0.25 డాలర్ల పెంపు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చే రెండేళ్ల పాటు రేట్లు మారవని, ఆ తర్వాత మరో 0.25 డాలర్లు పెంచాలని కేంద్ర కేబినెట్ ఇప్పటికే నిర్ణయిం చింది. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ అనేది అధిక పీడ నం వద్ద నిల్వ చేసి ఉప యోగించేందుకు వీలైన గ్యాస్. దీన్ని ప్రధానంగా మీథేన్, గ్యాసోలిన్, డీజిల్ లేదా బొగ్గు వంటి సాంప్రదాయ శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్నారు. కార్లు, బస్సులు, ట్రక్కులు, ఆటోరిక్షాలు సహా ఆటోమొబైల్స్‌కు ప్రత్యామ్నాయ ఇంధనంగా సిఎన్‌జిని విస్తృతంగా వాడుతున్నారు. గ్యాసోలిన్ లేదా డీజిల్, పెట్రోల్‌తో పోలిస్తే తక్కువ ఉద్గారాలు విడుదల చేస్తుంది.



## 900 ఔషధాల ధరల పెంపు!

**ముంబై, ఏప్రిల్ 1:** దేశీయంగా 900 రకాలకు పైగా ఔషధాల ధరలు ఏప్రిల్ ఒకటి నుంచి పెరిగాయి. ఈ విషయాన్ని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) ప్రకటించింది. పెరిగిన వాటి జాబితాలో యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, గుండె జబ్బులు, మధుమేహానికి సంబంధించిన మందులున్నాయి. టోకు ద్రవ్యోల్బణ సూచి ఆధారంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా తయారీదారులు ఔషధాల ధరలను సవరించొచ్చు. 2023తో పోలిస్తే 2024 కేలండర్ సంవత్సరంలో నమోదైన టోకు ద్రవ్యోల్బణం ఆధారంగా, ఔషధ ధరలను గరిష్టంగా 1.74శాతం వరకు ధరలు పెరిగినట్లు ఎన్‌పిపిఎ పేర్కొంది. సవరించిన ధరల ప్రకారం యాంటీబయాటిక్ అజిత్రోమైసిన్ 250 ఎంజి ఒక్కో టాబ్లెట్ ధర రూ.11.87, 500 ఎంజి ధర రూ.23.97కు పెరిగింది. అమోక్సిసిలిన్, క్లావులానిక్ యాసిడ్ కలిగిన యాంటీబయాటిక్ డ్రై సిరప్ ధర ఒక్కో ఎంఎల్ గరిష్ట ధరను రూ.2.09గా నిర్ణయించారు. డైక్లోఫెనాక్ టాబ్లెట్ గరిష్ట ధర రూ.2.09, ఇబ్రూఫెన్ 200 ఎంజి ఒక టాబ్లెట్ ధర రూ.0.72, 400ఎంజి టాబ్లెట్ ధర రూ.1.22గా పేర్కొన్నారు. దీంతో పాటు దయాబెటిస్, గుండెజబ్బులకు సంబంధించిన ధరలను స్వల్పంగా పెంచి వాటి గరిష్ట పరిమితులను ఎన్‌పిపిఎ తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14